
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ప్రకాశం

జిల్లా వార్తలు

మంగళవారం 8, జూలై 2025



ఇతరుల పేరుతో ఉన్న తమ పొలాన్ని తమకు ఆన్‌లైన్ చేయించాలని సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో 'మీకోసం' కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఈమె పెద్దారవీడు మండలం సోమేపల్లికి చెందిన వృద్ధురాలు తిరుమలమ్మ

భూమి ఆన్‌లైన్ కోసం ఐదేళ్లుగా ప్రదక్షిణలు



ఈయన దొనకొండ మండలం చిలకలపల్లికి చెందిన రైతు ఆరెం చెన్నయ్య. అతని తండ్రి ఆరెం శౌరయ్య 2020లో మృతిచెందాడు. భూమనపల్లి రెవెన్యూ పరిధిలో తండ్రి పేరుమీద ఉన్న 2.40 ఎకరాల పట్టాభూమి, 3.59 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని చెన్నయ్య తల్లి సుశీలమ్మ పేరుమీద ఆన్‌లైన్ చేయించుకునేందుకు ఐదేళ్లుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ఫలితంగా ప్రభుత్వం అందించే పథకాలు కోల్పోవటమే కాక బ్యాంకు రుణాలు పొందలేక అన్నివిధాలా నష్టపోతున్నాడు.



తర్లుపాడులో 'మీకోసం'కు అధికారులు ఎవరూ రాక ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

ఏడాదిగా తిరుగుతున్నా పింఛన్ రాదాయే..



ఈమె గిద్దలూరు మండలం వెల్లుపల్లికి చెందిన కోటా రాజమ్మ. ఏడాదిన్నర కిందట ఆమె భర్త కోటా వెంకటరంగారెడ్డి మృతి చెందారు. పింఛన్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతోంది. కూతురికి, కుమారునికి పెళ్లి చేయగా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఆమె ఒక్కరే ఉంటున్నారు. కూలి పని చేస్తేనే రోజు గడిచేది. తనకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటోంది.

సమయానికి రారు.. సమస్యలు పరిష్కరించరు!

ఆంధ్రజ్యోతి విజిట్

ప్రజా వినతుల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమం మొక్కుబడి తంతుగా జరుగుతోంది. ఈ ప్రక్రియలో మండల స్థాయి అధికారులంతా కీలకం కాగా అధిక శాతం మండలాల్లో కీలక అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సకాలంలో కార్యాలయాలకు ఎక్కువ ప్రాంతాల్లో అధికారులు వస్తున్న పరిస్థితి లేకపోగా అనేకచోట్ల సమస్యల పరిష్కారం కోసం వస్తున్నవారి అర్జీలు తీసుకోవడం తప్ప వాటి పరిష్కారానికి చొరవ చూపడంలేదు. ప్రత్యేకించి భూసంబంధ విషయాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో యంత్రాంగం నిర్వహించిన మీకోసం కార్యక్రమాన్ని ఆయా కార్యాలయాలను ఆంధ్రజ్యోతి బృందం సందర్శించ(విజిట్)గా మొక్కుబడి తంతుగా జరుగుతున్న తీరు, అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్న వైనం, పనులు కాక జనం పడుతున్న పాట్లు దర్శనమిచ్చాయి.

మొక్కుబడిగా ప్రజావిజ్ఞప్తుల పరిష్కార కార్యక్రమం

- కీలకమైన మండల స్థాయి అధికారుల్లో నిర్లక్ష్యం
- పలు కార్యాలయాల్లో కనిపించని అధికారులు
- గోడు వినేవారు, పట్టించుకునేవారు లేక జనం గగ్గోలు
- ప్రతి వారం సీఎస్ స్థాయిలో సమీక్షిస్తున్నా మారని తీరు

ఒంగోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) పేరుతో నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి కలెక్టర్ నుంచి సచివాలయం ఉద్యోగి వరకు మధ్యాహ్నం దాకా అధికారులు అంతా విధిగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలి. తక్షణ పరిష్కారానికి అవకావం ఉన్నవి అయితే వెంటనే అలా వాటిని నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలి. ఒకవేళ పరిష్కారానికి అవకాశం లేకపోతే ఆ విషయం అర్జీదారునికి స్పష్టంగా తెలియజేయలి. ఏరోజున ఎన్ని అర్జీలు తమ కార్యాలయాలకు అందాయి? వాటిన్నింటినీ ఎప్పటిలోగా పరిష్కారం మిగతా 6లో...



కలెక్టరేట్‌లో ఫిర్యాదుదారులతో కిక్కిరిసిపోయిన 'మీ కోసం' హాలు

నూరు శాతం వైకల్యం ఉన్నా పింఛన్ ఇవ్వడం లేదు



మేం కూలి చేసుకుని బతికేటోళ్లం. మా పాపకు రెండేళ్ల వయస్సు. పుట్టకతోనే గ్లకోమా వ్యాధి సోకింది. (పుట్టు అంధత్వం) వైద్యం కోసం తిరగని ఆసుపత్రి లేదు.. నెలకు రూ.15వేలు మందులకు ఖర్చు అవుతున్నాయి. సదరం సర్టిఫికెట్ కోసం ఏడాదిగా తిరుగుతున్నాను. నూరు శాతం అంధత్వం ఉన్నా ఫించన్‌కు అర్హత లేదంటున్నారు. సచివాలయంలో వారిని కలిస్తే ఏమి చేయలేమంటున్నారు. అధికారులు కనికరించి పింఛన్ ఇస్తే మందుల ఖర్చులకైనా వస్తాయి.

- అనూషా, ఇందిరమ్మ కాలనీ, ఒంగోలు

వీరయ్య చౌదరి హత్యకేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

- వీరిలో ఆరుగురు రాజమండ్రి జైలుకు తరలింపు
- ముప్పా సురేష్ బెయిల్ పిటిషన్ నేడు విచారణ

ఒంగోలు క్రైం, జూలై7(ఆంధ్రజ్యోతి): వీరయ్య చౌదరి హత్యకేసులో 11 మంది నిందితులకు రిమాండ్ పొడిగించారు. వీరిలో ఆరుగురిని రాజమండ్రి జైలుకు తరలించారు. ప్రధాన నిందితుడు ముప్పా సురేష్ భార్య అనితకు ఆదివారం పోలీసులు నోటీసులు అందించారు. ఎస్సై అజయ్ కుమార్ హైదరాబాద్‌లో సురేష్ ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. వీరయ్య చౌదరి హత్యకు ప్రణాళిక ముప్పా సురేష్ ఇంట్లో జరిగిందని పోలీసు విచారణలో వెల్లడైయింది. ప్రణాళిక రూపొందించే సమయంలో సురేష్ భార్య అనిత ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో అమెను విచారించేందుకు ఈనెల 10న ఒంగోలు డీఎస్పీ కార్యాలయానికి రావల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. అదే క్రమంలో పోలీసులకు దొరక్కుండా హత్య కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న సురేష్ బెయిల్ పిటిషన్ హైకోర్టులో దాఖలు చేశారు. ఈ మేరకు మంగళవారం విచారణకు రానుంది. ఇప్పటికే రిమాండ్ ఖైదీలుగా జైలులో ఉన్న 11 మంది నిందితులను సోమవారం ఒంగోలులోని న్యాయాధికారి వద్ద హాజరు పరచగా మరో 14 రోజులు రిమాండ్ పొడిగించారు. అదే క్రమంలో హత్య కేసులో ప్రధాన పాత్రధారి వినోద్ కుమార్‌ను, అతనికి సహకరించిన రుత్వేంద్రబాబు, హత్య కేసులో నేరుగా పాల్గొన్న గౌతమ్, తేజ, వంశీ, నాగరాజులను రాజమండ్రి జైలుకు తరలించాలని న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారిని ప్రత్యేక భద్రత నడుమ రాజమండ్రి జైలుకు తరలించారు.



ఘనంగా మొహర్రం

- ముగిసిన పీర్ల ఊరేగింపు..
- మార్కాపురంలో పెద్ద షరగత్, షహాదత్

7

చెడు వ్యసనాలతో తండ్రిపై హత్యాయత్నం

- నిందితుడికి రిమాండ్

7



పొదిలి రోడ్డులోని వాగును ఆక్రమించి సాగుచేస్తున్న జామాయిల్

ప్రభుత్వ స్థలం.. పాగా వేద్దాం!

- కబ్జాల పాలైన చెరువు అలుగు, కొండవాగు స్థలాలు
- పోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి వారసుల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు
- కేసులు నమోదు చేసినా మారని కబ్జాదారులు

కనిగిరి ప్రాంతంలోని వివిధ మండలాలతో పాటు, పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నేరుగా భూ అక్రమాలకు పాల్పడిన ఆ పార్టీ నాయకులు ప్రస్తుతం తెర వెనుక పాత్ర నడుపుతున్నారు. అధికారులు మచ్చిక కాకపోతే అధికార పార్టీ నేతల అండతో పబ్బం గడుపుకుంటున్నారు.

కనిగిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొండకింద కాలనీ నుంచి శివనగర్‌కాలనీ వరకు, శివనగర్ కాలనీ నుంచి కందుకూరు రోడ్డు వరకు, పొదిలి రోడ్డు నుంచి పాతూరు వరకు కబ్జాకు గురయ్యాయి. పాతూరు నుంచి పామూరు రోడ్డుకు మిగతా 6లో...

క్యూ కడుతున్న బాధితులు

ఇటీవల కనిగిరి పట్టణంలో రూ.15 కోట్ల భారీ భూకుంభకోణం వెలుగులోకి రావటం, సదరు అక్రమార్కులు జైలుకు వెళ్లటంతో బాధితులు ఒక్కొక్కరిగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. భూఆక్రమణ, తప్పుడు రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన ఓ అక్రమార్కుడిపై రావిగుంటపల్లికి చెందిన బాధితులు నేరుగా సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో బాధితుల సమస్యను పరిష్కరించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. సదరు అక్రమార్కుడి చిట్టాపై పోలీసులు దృష్టి సారించగా ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగు చూసున్నాయి.

మాదిగలు రాజకీయ శక్తిగా ఎదగాలి

ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగులుప్పలపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ద్వారా సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలను అందిపుచ్చుకొని మాదిగలు రాజకీయ శక్తిగా ఎదగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ దినోత్సవం, వర్గీకరణ విజయోత్సవ సభను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం గడ్డ ఈదుమూడిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఈదుమూడి గ్రామంలో నిర్మించిన మాదిగ అమరవీరుల స్థూపం వద్ద వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో గ్రామంలో పెద్ద ఎత్తున డప్పుల ప్రదర్శనగా ర్యాలీ చేశారు. కాలనీకి చెందిన పెద్ద కొమ్మూరు సైమన్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభకు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పొనుగోటి కృపాకర మాదిగ, సభ్యులు కొమ్మూరు గరటయ్య మాదిగలు అధ్యక్షత వహించారు. వర్గీకరణ చట్టం, ఆర్డినెన్స్ జీవోలను నాయకులు సభలో ఆవిష్కరించారు. ఈదుమూడి గ్రామం దండోరా చప్పుళ్లతో హోరెత్తింది. కార్యక్రమంలో నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, డొక్కా మాణిక్య వరప్రసాద్, పేరిపోగు వెంకటేశ్వరరావు, కొమ్మూరి కనకారావు, దండు వీరయ్య పాల్గొన్నారు.



ఒంగోలులో 'ఇంటింటికీ టీడీపీ'లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

జోరుగా ఇంటింటికీ టీడీపీ

- ఏడాది విజయాలను వివరిస్తూ విస్తృతంగా కరపత్రాల పంపిణీ
- కీలక నేతలంతా కార్యక్రమంలో భాగస్వామ్యం

ఒంగోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికీ కార్యక్రమం జిల్లాలో జోరుగా సాగుతోంది. 'ఏడాది పాలనకు తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ' పేరుతో ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల పాటు ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా ఆరవ రోజైన సోమవారం జిల్లాలో జోరుగానే సాగింది. పార్టీ శ్రేణులు ఎక్కడిక్కడ స్థానికంగా ముందుకు వచ్చి ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా కీలక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తమ ప్రాంతాల్లో భాగస్వాములు అవుతున్నారు. అలా సోమవారం మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సింగరాయకొండలో పర్యటించగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలో 24, 25 డివిజన్లలో, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మద్దిపాడు మండలం బూరేపల్లిలో పాల్గొన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి మునిసిపాలిటీ పరిధిలోని మాచవరంతో పాటు పామూరు పట్టణంలో పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంతో పాటు రూరల్ మండలం పెద్దనాగులవరం, పొదిలి పట్టణాల్లోనూ పాల్గొన్నారు. దర్శిలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గోట్టిపాటి లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొనగా ఎర్రగొండపాలెంలోని 18, 19 బూతుల పరిధిలో టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక నాయకులు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.

తాగునీరు, రోడ్లకు మరింత ప్రాధాన్యత ఇస్తా

- కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి సీఎం హామీ
- రెండు సామాజికవర్గాల ప్రజలను మరింత ఆకట్టుకోవాలి
- మీ పరిస్థితి బాగుంది.. పార్టీ కమిటీలను పటిష్టపర్చండి
- కనిగిరి నియోజకవర్గంపై సమీక్షలో చంద్రబాబు
- బయోగ్యాస్ ప్లాంట్ పనుల్లో జాప్యంపై ఉగ్ర ఫిర్యాదు

6

ఇంజనీరింగ్, ఫార్మసీ కౌన్సెలింగ్ ప్రారంభం

- 13 నుంచి 18 వరకు వెబ్ ఆప్షన్లు
- 22న సీట్ల కేటాయింపు

7

తాగునీరు, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తా

బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో జాప్యంపై ఉగ్ర ఫిర్యాదు

రెండు సామాజికవర్గాల ప్రజలను మరింత ఆకట్టుకోవాలి

మీ పరిస్థితి బాగుంది.. పార్టీ కమిటీలను ఇంకా పటిష్ఠం చేయండి

ఎమ్మెల్యే ఉగ్రకు సీఎం హామీ

కనిగిరి నియోజకవర్గంపై చంద్రబాబు సమీక్ష

ఒంగోలు, ఆంధ్రజ్యోతి

తొలి ఏడాదిలో ఎమ్మెల్యేల పనితీరును ఆయా నియోజకవర్గాల్లో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కనిగిరిపై సోమవారం రాత్రి అమరావతిలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి నియోజకవర్గ పరిస్థితులను చెప్పారు. అందిన సమాచారం మేరకు.. నియోజకవర్గంలో తాగునీరు, రోడ్ల సమస్య విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. తాగునీటి పథకం ప్రతిపాదనను ఎమ్మెల్యే ఉగ్ర సీఎంకు వివరించారు. వాటిని అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందన్న విషయం ప్రస్తావించగా, రిలయన్స్ సంస్థ చేపట్టిన బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరగడంలేదని డాక్టర్ ఉగ్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అలాంటివి మరికొన్ని ప్రాజెక్టులు ఇవ్వాలని ఉగ్ర కోరారు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటీ, వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కూడా వారి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. తదనంతరం తన వద్ద నివేదిక ఆధారంగా రాజకీయ అంశాలను కూడా సీఎం సమీక్ష చేశారు. 'నియోజకవర్గంలో మీరు అందుబాటులో ఉంటున్నారు.. మధ్యలో మీరు కొన్ని రోజులు లేరన్న' విషయాన్ని సీఎం ప్రస్తావించారు. మహానాడు నిర్వహణకు కడప, యోగాంధ్ర కార్యక్రమ పనులపై విశాఖ వెళ్లినందున ఆ కొద్ది రోజులు నియోజకవర్గంలో లేనని ఉగ్ర వివరించారు. రెండు సామాజికవర్గాల ప్రజలను రాజకీయంగా మరింత చేరువచేసుకోవాల్సిన అవసరాన్ని సీఎం ఉగ్రకు తెలిపారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు మందా కృష్ణమాదిగను కూడా నియోజకవర్గానికి ఆహ్వానించి కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని సీఎం సూచించినట్లు తెలిసింది. మరో సామాజిక వర్గ ఓటర్లలో రాజకీయంగా నిలకడ కనపడలేదని, అందుకు కారణాలను గుర్తించి వారిలో పలుకుబడిని పెంచుకునేందుకు కృషి చేయాలని ఉగ్రకు సూచించినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాల నిర్వహణ ప్రజా సంబంధాలు కొనసాగింపులో ఉగ్ర పనితీరును కొనియాడిన ఆయన పార్టీ అనుబంధ సంస్థల నియామకాలను పూర్తి చేయకపోవడంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఒక మండలంలో నాయకులు, కార్యకర్తల మధ్య గ్యాప్ పెరిగిందని, వెంటనే సరిచేయాలని తన వద్ద ఉన్న సమాచారం ఆధారంగా ఆదేశించినట్లు తెలిసింది.



టీపీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి స్వామి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

సింగరాయకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమనీ, ఈ రెండింటినీ రాష్ట్రంలో సమపాళ్లలో పరుగులు పెట్టిస్తున్నామనీ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని టీపీనగర్‌లో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని, అందించిన సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.4వేలుకి పెంచామని, దీపం పథకం కింద మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలెండర్లు అందజేశామని, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.13వేలు చొప్పున వారి తల్లుల ఖాతాకు జమచేశామని తెలిపారు. ఈనెలలో అన్నదాత సుఖీభవ పథకం తొలివిడత కింద రూ.7వేలు రైతుల ఖాతాకు జమచేయనున్నట్లు వివరించారు. వచ్చే నెల ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే డిగ్రీ చదవి నిరోద్యుగులుగా ఉన్న యువతకు నిరుద్యోగభృతి అందజేస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ అసమర్థ పాలన వల్ల అమరావతి నిర్మాణం రూ.6వేల కోట్లు పోలవరం వ్యయం రూ.2వేల కోట్లు పెరిగిందని తెలిపారు. 30 ఏళ్లు అధికారంలో ఉంటామని విర్రవీగిన జగన్‌రెడ్డిని 11 సీట్లకు పరిమితం చేసి ప్రజలు దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడారన్నారు. అధికారం కోల్పోయిన తరువాత పరామర్శల పేరుతో ప్రజల ప్రాణాల తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంతపార్టీ కార్యకర్త కారు కింద తొక్కి శవాన్ని పక్కకు లాగేసి పడేసి వెళ్లిపోయారంటే జగన్ క్రూరమైన నైజాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. ఇనాం భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకొవచ్చునని అన్నారు. పాకల రైల్వేగేట్ వద్ద ఫ్లైవోవర్ నిర్మాణానికి కృషిచేస్తామని తెలిపారు. అనంతరం కాలనీలో రూ.28 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులు, సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, సుదర్శి చంటి, గాలి హరిబాబు, వేల్పుల వెంకట్రావు, బ్రహ్మేశ్వరరావు, రాంబాబు, గుడే వెంకటేశ్వర్లు, గిరి, పులి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ప్రజల అర్జీలు

టంగుటూరు (కొండపి), జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామికి సోమవారం ఉదయం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. తమ పిల్లలలకు వివిధ స్కూళ్లలో చదువుకోవడానికి ఉచితంగా సీట్లు ఇప్పించాలని కోరుతూ ఎక్కువ మంది మంత్రిని కలిశారు. తమ స్వగ్రామాల నుంచి దూరప్రాంత స్కూళ్లలో సీట్లు వచ్చాయని, అవకాశం ఉంటే దగ్గర స్కూళ్లలో సీట్లు ఇప్పించాలని పలువురు తల్లిదండ్రులు కోరారు. కస్తూర్బా, ఇతర స్కూళ్లలో ఇంటర్ సీట్లు ఇప్పించాలని మంత్రిని కలిసి పలువురు విజ్ఞప్తి చేశారు. కొండపి మండలం జాళ్లపాలెం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తన ప్రభుత్వ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన రావెళ్ల రమేష్ మంత్రిని కలిసి అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ సాయం అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఏకేయూలో కొత్త అడ్మిన్లు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు విద్య, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీలో కొత్తగా పరిపాలనాధికారులు(అడ్మిన్లు)గా నియమితులైన వారు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్శిటీ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నిర్మలామణి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాజమోహన్‌రావు యూనివర్శిటీ ఓఎస్‌డీగా, సీడీసీ డీన్‌గా పనిచేస్తున్న జీ సోమశేఖర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, ఇప్పటి వరకు సీఈగా పనిచేసిన కేవీఎస్ రాజు సీడీసీ డీన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారిని యూనివర్శిటీ అధ్యాపకులు అభినందించారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాల పెంపునకు చర్యలు

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, పీఎం రమేష్

పంగులూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పంగులూరు మార్కెట్‌యార్డ్‌లోని నల్లబర్లీ కొనుగోలు కేంద్రంలో రోజువారీ కొనుగోలు చేసే బేళ్లసంఖ్య ఐదువందలకు పెంచేవిధంగా చర్యలు చేపట్టినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ చెప్పారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో సోమవారం సాయంత్రం నల్లబర్లీ కొనుగోళ్లకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు వెయ్యి బేళ్లను కొనుగోలు చేసినట్లు కరుణశ్రీ తెలిపారు. యార్డ్‌లో కొనుగోలు చేసిన బేళ్లను నిల్వ చేసేందుకు కొత్త గోడౌన్ సిద్ధం చేశామన్నారు. రోజువారీ కొనుగోళ్లను ఐదు వందల బేళ్లకు పెంచనున్నట్లు తెలిపారు. రైతులు తమకు వచ్చిన మెసేజ్‌ల ఆధారంగా ఫోన్ చేసి క్రమపద్ధతిలో రిజిస్ట్రేషన్ ప్రకారం కొనుగోళ్లు చేపడుతున్నట్లు డీఎం కరుణశ్రీ చెప్పారు. రైతు రిజిస్ట్రేషన్ టైమింగ్‌తో పాటు మండె వద్ద దిగిన ఫొటో మ్యాచింగ్ అయిన రైతులకు వరుస వారీ సందేశాలు కంప్యూటర్ ద్వారా జనరేట్ అవుతున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రం పరిధిలోని రైతులందరికీ బేళ్ల అమ్మకానికి అవకాశం వచ్చేలా షెడ్యూల్ రూపొందించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఎం వివరించారు.



పంగులూరు మార్కెట్‌యార్డ్‌లో మాట్లాడుతున్న డీఎం, కరుణశ్రీ, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్

మరోమూడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

కొరిశపాడు మండలం తమ్మవరం, మార్టూరు, చినగంజాంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎం కరుణశ్రీ తెలిపారు. ఆ మేరకు అక్కడ గోడౌన్లను గుర్తించినట్లు వివరించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన రైతులకు 48 గంటలలో నగదు జమచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

నిబంధనలు పాటించకుంటేనే తిరస్కరణ : ప్రాజెక్టు మేనేజర్ రమేష్

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే బేళ్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటే తప్పక కొనుగోలు చేస్తామని, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ తెలిపారు. తేమ 20 శాతానికి మించరాదన్నారు. పండుగుళ్ల మిక్స్ చేయరాదని, బూజు కనిపించే లోగ్రేడ్, తెల్లగా కుళ్లిన ఆకులు చెక్కులో కనిపించకూడదన్నారు. అలా ఉంటేనే వాటిని కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఏపీఎం సుబ్రహ్మణ్యం, ఏవో సుబ్బారెడ్డి, సీఈవో నాగబోయిన లక్ష్మి, తహసీల్దార్ సింగారావు, రైతుసంఘం నాయకులు రామారావు, టీడీపీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

అదనంగా గోడౌన్‌లను సేకరించాలి

అదనపు గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు, జులై 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు గోడౌన్‌లను గుర్తించి, పొగాకు కొనుగోలును మరింత వేగవంతం చేయనున్నట్లు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డు, స్టేట్ వేర్ హౌస్ గోడౌన్లలో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ అధికారులతో కలసి పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన పొగాకు నిల్వల నేపథ్యంలో అదనంగా గోడౌన్‌లను సేకరించే విధంగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అనంతరం అదనపు గోడౌన్‌ల గుర్తించి, అధికారులు, స్థానిక నేతలతో చర్చించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ, మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్, తహసీల్దార్ బ్రహ్మయ్య, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆంక్షలు పెడితే పొగాకు రైతులకు నష్టం

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

ఇంకొల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలులో అధికారులు ఆంక్షలు పెడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య చెప్పారు. ఇంకొల్లు మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రంగు మారిందనే సాకుతో నాణ్యమైన పొగాకుకు సైతం ధర తగ్గిస్తున్నారన్నారు. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడితే నష్టపోతారన్నారు. రైతులు వద్ద ఉన్న పొగాకు అంతా సరసమైన ధరకు కొనుగోలు చేయాలని డిమాండు చేశారు. ధర తక్కువ వేస్తున్నారని సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పెషల్ కలెక్టర్ లవన్న మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బయ్యర్లతో మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, యార్డు సిబ్బంది ఉన్నారు.



ఇంకొల్లులో రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

మెగా టీచర్స్,పేరెంట్స్ మీటింగ్‌ను పండుగలా నిర్వహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్,జూలై 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 10వతేదీన జరగనున్న మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నదన్నారు. జిల్లాలోని 2,955 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 188 జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, అక్కడ చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న గొప్ప వ్యక్తులను కూడా ఈ టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌కు ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వమార్గదర్శకాల ప్రకారం ఈ సమావేశాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించాలన్నారు. తల్లికి వందనంకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని గోపాలకృష్ణ ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు కిరణ్‌కుమార్, లక్ష్మానాయక్, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ, డీఈవో కిరణ్‌కుమార్

ప్రభుత్వ స్థలం.. పాగా వేద్దాం!

(5వపేజీ తరువాయి)

ప్రధాన వాగు, పామూరు రోడ్డును దాటి పవిత్ర ఫంక్షన్ హాలు, వెన్నెల అపార్ట్‌మెంట్ నుంచి కందుకూరు రోడ్డు ప్రాంతానికి పారే వాగులు, వంకలు ఆక్రమణలకు గురయ్యాయి. కొండ వాగు స్థలాలు, కనిగిరి పెద్దచెరువు అలుగువాగు భూమి ఆక్రమణల పరంపర సాగుతూనే ఉంది.

రూ. కోట్లకు పడగలెత్తిన చిరుద్యోగి

- పంచాయతీ కార్యాలయంలో ఒకప్పుడు సాదా చిరుద్యోగిగా పనిచేసి వ్యక్తి ఏకంగా కోట్లకు పడగలెత్తాడు. అసైన్డ్, వాగులు, ప్రభుత్వ, పోరంబోకు భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో రెవెన్యూశాఖలోని దిగువ స్థాయి సిబ్బందికి నజరానాలు ముట్టజెప్పి వాటికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ భూముల్లో పాగా వేస్తున్నాడు.
- పొదిలి రోడ్డులోని 909/ఏ అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి ఆ పక్కనే ఉన్న వాగును ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి.
- మాజీ సైనికోద్యోగికి ప్రభుత్వం ఇచ్చిన 843/ఏ1 సర్వే నెంబరులోని 2.5 ఎకరాల అసైన్డ్ భూమిని అసలు హక్కుదారులకు తెలియకుండా నకిలీ పత్రాలు సృష్టించి కొనుగోలు చేసి సదరు భూమిలో ప్లాట్లు కూడా వేసి అమ్మకాలు సాగించాడు. విషయం తెలుసుకున్న మాజీ సైనికోద్యోగి కుటుంబసభ్యులు అడ్డుకోగా వారిపై బెదిరింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలు ఉన్నాయి.
- 909/1ఏ3 భూమిలో పేదలకు ఇచ్చిన ప్లాట్లను ఆక్రమించటంతో అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో బాధితులకు న్యాయం జరిగింది. పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లు సదరు వ్యక్తిపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- తాజాగా గార్లపేట రోడ్డులోని 465 సర్వే నెంబరులో 12 సెంట్ల భూమిని అమ్మి రూ.30 లక్షలు అమాయకుల నుంచి వసూలు చేసి 463 సర్వే నెంబరులోని భూమిని చూయించాడు. కొనుగోలు చేసిన రావిగుంటపల్లి గ్రామానికి చెందిన బాధితులు తిరిగి దానిని అమ్ముకునే క్రమంలో అసలు భూమి హక్కుల దారులు రావటంతో మోసపోయామన్న విషయాన్ని గ్రహించారు. చేసేది లేక బాధితులు నేరుగా సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయటంతో అధికారులు సర్వే చేపట్టగా మోసం బయట పడింది.
- పట్టణ సమీపంలోని చాకిరాల గ్రామానికి చెందిన 49/1లో దాదాపు ఏడు ఎకరాల పట్టా భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.
- గతంలో సదరు అక్రమార్కులపై పోలీసులు 420 కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా పోలీసుశాఖ వారిని తప్పుదోవ పట్టించేందుకు ఓ ప్రధానవర్గం ముఠాగా ఏర్పడి రాయబేరాలు సాగిస్తుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డీఈఈసెట్‌కు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోండి

సంతనూతలపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): డీఈఈసెట్-2025లో ఉత్తీర్ణత పొంది ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెబ్ ఆప్షన్లు ఈనెల 8 నుంచి 12 వరకునమోదు చేసుకోవాలన్నారు. సీట్లను కేటాయించి ప్రొవిజనల్ లెటర్‌ను 13 నుంచి 16 వరకు జారీ చేస్తారని తెలిపారు. ధ్రువీకరణ పత్రాల తనిఖీ కార్యక్రమం 17 నుంచి 22 వరకు జరుగుతుందని, ఈనెల 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అవీఇవీ

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఒంగోలు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫెన్సింగ్ ఒలింపిక్ పోటీలకు ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. తమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బీవీ సౌమస్యశ్రీ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో ప్రథమ స్థానంలో విజయం సాధించగా, ముంబైలో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే డి. చరణ్, డి. ప్రియ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచారని వీరు కూడా ముంబైలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడల్లో రాణించడం మరింత ఆనందంగా ఉందని జగదీష్ పేర్కొన్నారు.

సమయానికి రారు.. సమస్యలు పరిష్కరించరు!

(5వపేజీ తరువాయి)

చేశారన్నది కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. కలెక్టర్ నేతృత్వంలో ఒంగోలులోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు అందరూ హాజరై మీకోసంలో పాల్గొనాలి. డివిజన్ స్థాయిలో ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ నేతృత్వంలో మండలస్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో కీలక శాఖల అధికారులు అందరూ ఒకచోటకు చేరి అలా చేయాలి. ప్రతివారం మీకోసంలో వచ్చిన వినతులు, వాటి పరిష్కారాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష చేస్తారు. సీఎం నేతృత్వంలో జరిగే కలెక్టర్ల సదస్సులో, ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో జరిగే డీఆర్సీ మీటింగ్‌లలో పీజీఆర్ఎస్‌పై సమీక్షలు చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో అత్యంత కీలకం మండలస్థాయి అధికారులు కాగా జిల్లాలో వారు పట్టీపట్టనట్లుగా మొక్కుబడి తంతుగా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇదే విషయం సోమవారం ఆంధ్రజ్యోతి బృందం విజిట్ నిర్వహించిన సందర్భంగా మరోసారి బహిర్గతమైంది.

జిల్లా కేంద్రంలో ఇలా...

ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం సాగాల్సి ఉండగా కలెక్టర్ అన్సారియా సెలవులో ఉండటంతో ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతల్లో ఉన్న జేసీ గోపాలకృష్ణ ఆ సమయానికే ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులోకి రాగా జిల్లా అధికారులంతా వచ్చారు. తొలుత కొద్దిసేపు అధికారులతో సమీక్ష చేసి అనంతరం వినతులు స్వీకరించారు.

మార్కాపురంలో నలుగురే వచ్చారు

ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా అధికారులు ప్రక్రియ ప్రారంభించే సమయానికి జిల్లాలోని మూడొంతుల మండలాల్లో మండల స్థాయి అధికారులు కార్యాలయాలకు రాలేదు. ఒంగోలు తర్వాత అత్యంత ప్రాధాన్యత మార్కాపురం డివిజన్ కేంద్రానికి ఉంది. అక్కడ ప్రస్తుతం సబ్ కలెక్టర్ డివిజన్‌స్థాయి అధికారిగా వ్యవహరిస్తుండగా సోమవారం సబ్ కలెక్టర్ త్రినాగ్ సెలవలో ఉన్నారు. దీంతో ఆ డివిజన్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు నలుగురంటే నలుగురు అధికారులు మాత్రమే వచ్చారు. అది కూడా నిర్ణీత సమయానికి ఒకరిద్దరు మాత్రమే కనిపించారు. సాధారణంగా మండల, డివిజన్ కేంద్రాల్లో కనీసం పది నుంచి 12 మంది కీలక శాఖల అధికారులు ఉండాలి. అలాంటిది ఏ మండల కార్యాలయంలో చూసినా వారిలో మూడవ వంతు మంది కూడా కనిపించలేదు.

హాజరు అరకొర.. సమయపాలన శూన్యం

- పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ 10.15 గంటలకే ప్రారంభించినా వీడియో కాన్ఫరెన్స్ సాంకేతిక సమస్యతో పనిచేయడం లేదంటూ గంటలోపే అందరూ వెళ్లిపోయారు.
- పుల్లలచెరువులో రిజిస్టర్‌లో 11 మంది హాజరైనట్లు సంతకాలు చేసినా 11.30 గంటల సమయంలో నలుగురు మాత్రమే ఉన్నారు.
- వైపాలెం, త్రిపురాంతకంలలోనూ ఇలాంటి పరిస్థితే కనిపించింది. రాచర్లలో మధ్యాహ్నం 12 గంటలకు కూడా ఇద్దరు, ముగ్గురు అధికారులు మాత్రమే కనిపించారు.
- పొదిలి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు కార్యాలయ ఏవో తప్ప ఎవ్వరు రాలేదు.
- ముండ్లమూరులో తహసీల్దార్ హైకోర్టు పనిమీద వెళ్లగా డీటీ, మరో ఉద్యోగి మినహా ఇతర శాఖల అధికారులు హాజరు కాకపోగా పీసీపల్లిలో ఉదయం 11 గంటలకు కూడా తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బంది ఎవరు రాలేదు.
- వ్యవసాయ, హౌసింగ్ శాఖల అధికారులు ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉన్నారు.
- కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఉన్న ఇతర శాఖల వారు పెద్దగా కనిపించలేదు.
- దర్శిలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తప్ప ఎవ్వరూ కనిపించకపోగా ఒంగోలు మండల కార్యాలయంలో పదిన్నర సమయానికి కూడా తహసీల్దార్ జాడలేదు.
- మద్దిపాడులో తహసీల్దార్‌తో పాటు ఇద్దరు, ముగ్గురు మాత్రమే కనిపించగా కొండపి, సింగరాయకొండలలో కొంత బెటర్‌గా ఉన్నా, ఎన్‌జిపాడులో 10.40 వరకు డీటి మినహా ఇతరులు కనిపించలేదు.


సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

సమస్యల పరిష్కారంలో మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు స్పష్టంగా కనిపించింది. కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసం వద్దకు భారీగా ప్రజలు రాగా వృద్ధులు, వికలాంగులు కూడా అధికంగానే ఉన్నారు. సదరమ్ సర్టిఫికెట్లు, భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా ఉన్నాయి.

- వారసత్వంగా వచ్చే భూమిని తల్లి మరణం అనంతరం తమకు ఆన్‌లైన్ కోసం సంబంధిత పత్రలు ఇచ్చినా రూ.10వేలు డబ్బులు ముట్టజెప్పి రెండేళ్లుగా తిప్పుతున్నారని తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.
- భర్త చనిపోతే పాస్‌పుస్తకం తన పేరుతో మార్పు కోరుతూ ఆరేళ్లుగా తిరుగుతున్నా పని కాలేదని ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంజమ్మ అనే మహిళ వాపోయారు.
- ఉమ్మడి భూమిలో తన వాటపై స్పష్టత కోరుతూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా పరిష్కారం చేయలేదని రాచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు వెంకటరెడ్డి చెప్పారు.
- తన తల్లి పేరుతో ఉన్న రిజిస్టర్ భూమిని వేరువారు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని దానిని తన తల్లిపేరుపై మార్చాలని ఏడాదిగా తిరుగుతున్నా పరిష్కరించడం లేదని పుల్లలచెరువు కార్యాలయం వద్ద కోటేశ్వరరావు వాపోయారు.
- రీ సర్వేలో తన ఎకరా భూమిని అధికారులు తమ బంధువుల పేరుతో ఆన్‌లైన్ చేశారని దానిని సరిచేయాలని కోరుతున్నా స్పందన లేదని గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రంగస్వామి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితే జిల్లా అంతటా కనిపించింది. తక్షణం ఉన్నతాధికారులే కాక పాలక పక్షం పెద్దలు, ప్రజాప్రతినిధులు కూడా మండల స్థాయి కార్యాలయాల పరిస్థితిని సమీక్షించి ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరేళ్లుగా పాసు పుస్తకం కోసం తిరుగుతున్నా..

ఈమె ముండ్లమూరు మండలం జగత్‌నగర్‌కు చెందిన వల్లెపు అంజమ్మ. ఆమె భర్త వల్లెపు మహాలింగం ఆరేళ్ల క్రితం చనిపోయారు. అప్పటి నుంచి తన భర్త పేరుమీద ఉన్న సర్వే నెంబరు 303/2లో 1.63 ఎకరాలు, 303/6లో 90 సెంట్లకు సంబంధించి పాసుబుక్ తన పేరుపై మార్చి ఇవ్వాలని కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. కూలి పనికి వెళితే గాని పొట్ట గడవని తాను తహసీల్దార్ కార్యాలయానికి పనులు మానుకొని తిరుగుతున్నా కనికరించడం లేదని కన్నీరు పెట్టింది.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అర్జీ చూపిస్తున్న అంజమ్మ



ఘనంగా మొహర్రం

పలుచోట్ల పీర్ల ఊరేగింపు.. ముగిసిన పెద్ద షరగత్, షహాదత్

మార్కాపురం వన్‌టౌన్, జూలై7 (ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా మార్కాపురంలో పట్టణంలోని పీర్లకు పెద్ద షరగత్, సహాదత్ (నీళ్లలో ముంచే కార్యక్రమం) ఘనంగా నిర్వహించారు. గొర్లగడ్డలోని బాదుల్లా స్వామి, తూర్పువీధిలోని చిన్నబాదుల్లాస్వామి పీర్లను ప్రత్యేకంగా అలంకరించిన విద్యుత్ చాందిరిలో ఉంచి నగరోత్సవం చేశారు. పీర్లకు రంగురంగుల దట్టీలు కట్టి వెండి గొడుగులు, నాగాభరణలు, వెండి ఊయలతో అలంకరించారు. ఉదయం పెద్ద షరగత్ అనంతరం పీర్లను మకానాలలో ఉంచి రాత్రి ఊరేగింపుగా షహదత్ కార్యక్రమం నిర్వహించారు. బొరుగులు, పప్పులు, బెల్లం ఫాతేహాలుగా సమర్పించారు. వెలిగించిన పీర్ల గుండాలను మూసివేసి పీర్లతో పాటు భక్తులు కూడా గుండం చుట్టూ తిరిగారు. గుండంలోని బూడిదను వివిధ రోగాల నివారణ నిమిత్తం భద్రపరుచుకున్నారు. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గుండ్లకమ్మ నది వద్ద పీర్లను నీళ్లల్లో ముంచే కార్యక్రమం నిర్వహించారు. గొర్లగడ్డ, తూర్పువీధి, ఆర్టీసీ బస్టాండ్, విజయ టాకీస్, నాగులవరం రోడ్డు, రాజీవ్ కాలనీలలోని పీర్లకు వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల అనంతరం జియారత్ నిర్వహించి పీర్లను ఆయా మాకానాలలో భద్రపరిచారు.

రాచర్ల : రాచర్ల మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. అనుములపల్లిలో మటమయ్య స్వామి పీర్ల పండుగ మహోత్సవం గ్రామ ప్రజలు ఘనంగా జరిపించారు. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పొదిలి : పట్టణంలో పడమటిపాలెం, తూర్పుపాలెంలో ఉన్న పీర్లను ఘనంగా ఊరేగించారు. ఆదివారం రాత్రి మతసామరస్యానికి ప్రతీకగా చావిడిలో అగ్నిగుండాలు ఏర్పాటు చేసి అందులో నడిచారు. సోమవారం పెద్దబస్టాండ్ సెంటర్లో తూర్పుపాలెం, పడమర పాలెంకు చెందిన పీర్లను ఓ చోటకు చేరడంతో పండగ ముగుస్తుంది. పెద్దమసీద్ వద్ద ఉన్న బావిలో నీళ్ల పడతాయని దీంతో మొహరం ముగుస్తుందని మతపెద్దలు తెలిపారు.

తర్లుపాడు : మొహర్రం వేడుకలు తుమ్మలచెరువులో ఘనంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా హుబ్లీ వంటి నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడికి ఎక్కువగా సంతానం కలగని వారు, వ్యాధిగ్రస్తులు స్వామికి మొక్కులు చెల్లిస్తారు. ఆదివారం అర్ధ రాత్రి జరిగిన పెద్దసరిగెత్ కార్యక్రమంలో ఖాసీం స్వామివారు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వార్లకు కాయకర్పూరం సమర్పించారు. సోమవారం పీర్లను గ్రామోత్సవం అనంతరం నీళ్ల తాకే కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో 200 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.





పెద్ద దోర్నాల : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మొహర్రం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు విడి సరిగెత్ నిర్వహించిన అనంతరం ఏడవ రోజున చిన్నసరిగెత్, పదవ రోజున పెద్ద సరిగెత్ నిర్వహించారు. 11వ రోజున సోమవారం వేకువ జామున 3గంటల నుంచి పీర్లను గ్రామంలో ఊరేగించి సోమవారం సాయంత్రం నీటిలో పీర్లను ముంచే కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ విఫలం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ఆరోపించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా రంగ సమస్యల పరిష్కార విషయంలో ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మిరియాలపాలెం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ధర్నాలో రాజశేఖర్ మాట్లాడుతూ ఆరు రకాలుగా ఉన్న పాఠశాల వ్యవస్థను తొమ్మిది రకాలుగా మార్చి మొత్తం విద్యారంగాన్ని గందరగోళం చేశారన్నారు. 84, 85, 117 జీవోలను తీసుకొచ్చి పాఠశాల విలీనాన్ని, పాఠశాలల మూసివేతకు గురవుతున్నాయని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో 117జీవోను రద్దుచేసి అర్హులైన వారందరికీ స్కాలర్ షిప్‌లు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటిలకు నిధులు విడుదల చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల10వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సిసింద్రీ బాబు, సీహెచ్ శ్యామ్, కోటయ్య, సచిన్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం కోసం బైక్ ర్యాలీ


కార్మిక సంఘాల నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నెల్లూరు బస్టాండు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పెంచిన పనిగంటలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులను గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులను, పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, చీకటి శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, దామా శ్రీనివాసులు, బీవీ రావు, శేషయ్య, మున్వర్‌బాషా, సలార్, కల్పన, సీహెచ్ చిరంజీవి, కృష్ణమోహన్, సుబ్బారావు, దాసరి సుందరం, రాజశేఖర్, పద్మ పాల్గొన్నారు.

'పలకల పరిశ్రమను కాపాడారు'

రాయల్టీ తగ్గించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కందులకు ఎస్టేట్ ప్రతినిధులు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కందులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్టేట్ ప్రతినిధులు

మార్కాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి చూపుతున్న పలకల పరిశ్రమను ఆదుకునేందుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చూపిన చొరవ మరువలేనిదని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా సోమవారం జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెన్నా పోలిరెడ్డి మాట్లాడుతూ గతంలో మార్కాపురం పలకల పరిశ్రమకు రాయల్టీ చాలా ఎక్కువగా ఉండేదని, ఈ విషయాన్ని పలుమార్లు వైసీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. సమస్యను చెప్పగానే ఎమ్మెల్యే కందుల స్పందించి పలకల పరిశ్రమపై ప్రభుత్వం కరుణ చూపాలని అసెంబ్లీలో మాట్లాడారన్నారు. ఆయన కృషి ఫలితంగా మూతపడే పరిస్థితుల్లో ఉన్న పలకల పరిశ్రమ నేడు పునరుజ్జీవం పొందనుందని చెప్పారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం 50 నుంచి 60 శాతం మేర రాయల్టీని తగ్గించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో గుప్తా ప్రసాద్, దొండపాటి వెంకటేశ్వర్లు, పఠాన్ హుసేన్‌ఖాన్, మోరా వెంకటరెడ్డి, గోపినాథ్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో తండ్రిపై హత్యాయత్నం

● నిందితుడికి రిమాండ్

టంగుటూరు/కొండపి, జూలై7 (ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు అలవాటు పడిన కొడుకు, ఏకంగా తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామానికి చెందిన దివి వెంకటరావు, లక్ష్మిలకు 23 ఏళ్ల కొడుకు చందు చెడువ్యసనాలకు అలవాటు పడ్డాడు. పదేపదే డబ్బులు ఇవ్వాలని, లేకుంటే చంపుతానని తల్లిదండ్రులను బెదిరిస్తుండేవాడు. ఈక్రమంలో తల్లితండ్రులు తమ ఇల్లు వదిలి వేరే గ్రామంలో బంధువుల వద్ద నెలరోజులుగా ఉంటున్నారు. పింఛన్ డబ్బుల కోసం వెంకటరావు, లక్ష్మి ఈనెల 1వ తేదీ గ్రామానికి వచ్చి పింఛన్ తీసుకున్నారు. 3వ తేదీ ఉదయం డబ్బులు తనకు ఇవ్వాలని చందు తల్లితండ్రులపై గొడవపడ్డాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తండ్రి వెంకటరావు తలపై కొడుకు చందు కర్రతో కొట్టాడు. రక్తగాయాలైన వెంకటరావు స్పృహ తప్పి పడిపోగా భార్య లక్ష్మి వెంకటరావును ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. లక్ష్మి అక్కడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు చందును సింగరాయకొండ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 14 రోజులు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై నాగ మల్లేశ్వరరావు తెలిపారు.

దొరకని దొంగలు

టంగుటూరు/కొండపి, జూలై7 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు మండలంలోని జయవరం గ్రామంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఇత్తడి వినోద్‌కుమార్‌కు చెందిన ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.92వేల నగదు, ఐదు చీరెలు, 8 వాచ్‌లు, 19 గ్రాముల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గత శుక్రవారం దొంగతనం చేశారు. ఆమేరకు టంగుటూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటిని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వినోద్ భార్య అంగన్‌వాడీ ఆయాగా ఎన్టీఆర్ నగర్‌లో పనిచేస్తుండగా, వినోద్ ఆటో నడుపుకుంటున్నాడు. కష్టపడి సంపాధించుకున్న సొమ్ము దొంగల పాలయ్యిందని వినోద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఆదాయపన్నుశాఖ ఉద్యోగి మృతి


కృష్ణచైతన్య మృతదేహం

పంగులూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇన్‌కంట్యాక్స్ ఉద్యోగి మృతిచెందిన ఘటన జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 8 గంటల సమయంలో చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు ఇన్‌కంటాక్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దాసరి కృష్ణచైతన్య(46) స్కూటీపై ఒంగోలు నుంచి గుంటూరు వెళుతున్నాడు. మండలంలోని జాగర్లమూడివారి పాలెం వద్ద ఫ్లై ఓవర్ దిగే క్రమంలో వేగంగా డివైడర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో డివైడర్ పక్కన కృష్ణచైతన్య విగతజీవుడై పడి ఉండగా స్కూటీ కొద్దిదూరంలో పడిఉంది. ఎస్.ఐ. వినోద్‌బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మీకోసంలో అందిన అర్జీలను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. అంతకు ముందు అర్జీలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలు అందించిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారుడికి తెలియజేయాని ఆదేశించారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలన్నారు. వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారథి, విజయజ్యోతి ఉన్నారు.


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కలెక్టర్

- తమ భూమిని ఇతరులకు అన్యాయంగా ఆన్‌లైన్ చేశారని పెద్దారవీడు మండలం సోమేపల్లికి చెందిన తిరుమలమ్మ ఫిర్యాదు చేశారు. తోకపల్లి ఇలాఖాలో 102/1సిసర్వే నెంబరులో 3.58 ఎకరాలు, 14/2 సర్వేనెంబరులో 25 సెంట్ల భూమి ఉందన్నారు. తమ భూమిని తన భర్త మరణానంతరం ఆ భూమిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా భూమిని ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యపై పదేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.
- రెండేళ్ల నుంచి పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని పుల్లలచెరువు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదని, గతంలో పంచాయతీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా బ్యాంకు అకౌంట్లలో జీతాలు పడేవని తెలిపారు. పంచాయతీలో పది మంది కార్మికులు ఉండగా, జీతాలు రాక ముగ్గురు మానేశారని వివరించారు.

ఇంజనీరింగ్, ఫార్మసీ కౌన్సెలింగ్ ప్రారంభం

13నుంచి 18 వరకు వెబ్ ఆప్షన్లు

22న సీట్ల కేటాయింపు



ఒంగోలువిద్య, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నుంచి ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 16 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600లను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల దరఖాస్తులన్నింటినీ హెల్ప్‌లైన్ సెంటర్ మెయిల్‌కు పంపుతారు. అభ్యర్థులు దరకాస్తుతో పాటు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఆన్‌లైన్‌లోనే పరిశీలిస్తారు. దీనికి అభ్యర్థులు హాజరుకావాల్సిన అవసరం లేదు. హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఇంటర్ మార్కులు జాబితా, పదో తరగతి మార్కులు సర్టిఫికెట్, టీసీ, 6నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, రిజర్వుడు కేటగిరి అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్థానికతకు సంబంధించిన సర్టిఫికెటను జతపర్చాలి. గతంలో ఏదైనా కారణాలతో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయకపోతే ఇప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఏదైనా పొరపాటు జరిగితే హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని మేసేజ్ వచ్చిన వారు మాత్రమే హెల్ప్‌లైన్ సెంటర్‌కు నేరుగా పోవాలి.


షెడ్యూల్ ఇదీ

- ఈనెల 16 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- 7నుంచి 17 వరకు హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికెట్ల పరిశీలన
- 13నుంచి 18 వరకు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాలి
- 19న ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం
- 22న సీట్లకేటాయింపు
- 23నుంచి 26 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌జాయినింగ్ ఇచ్చి కళాశాలలో రిపోర్టు చేయాలి
- ఆగస్టు 4నుంచి ఇంజనీరింగ్, ఫార్మసీ తరగతులు ప్రారంభం

టీచర్స్‌కు హ్యాండ్‌బుక్‌లు పంపిణీకి సిద్ధం

జిల్లాకు 55,600 పుస్తకాలు

టీచర్లకు పాఠ్యప్రణాళికల భారం తగ్గింపు



ఒంగోలు విద్య, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి తరగది గదిలో మరింత సమర్థవంతంగా విద్యార్థులకు బోధించేందుకు వీలుగా విషయనిపుణులతో తయారు చేయించిన హ్యాండ్‌బుక్స్‌ను వారికి అందిస్తున్నారు. 1నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన హ్యాండ్ బుక్స్‌ను సిద్ధం చేశారు. తరగతి గదిలో బోధించేందుకు టీచర్లు పాఠ్యప్రణాళికలతో తరగతి గదిలోకి అడుగుపెట్టాలి. ప్రణాళికలు స్వయంగా తయారు చేసుకోవాలి. పాఠ్యాంశాలకు అనుగుణంగా పాఠాన్ని పీరియడ్ వారీగా ఏయే అంశాలు చర్చించాలి, అందుకు అవసరమైన బోధన సామగ్రిని టీచర్లు స్వయంగా సిద్ధం చేసుకోవాలి. టీచర్లు బోధించే అన్ని తరగతులకు రోజుకు కనీసం ఆరు పీరియడ్లు బోధించాల్సి ఉంటుంది. ఆ పీరియడ్లకు ఆరుపాఠ్యప్రణాళికలను తయారు చేసుకోవాలి. అందువీలుగా టీచర్లు పాఠ్యపుస్తకాల బోధనకు సంబంధించి మొదట వార్షిక పాఠ్యప్రణాళికను తయారు చేసుకోవాలని ఏయే పాఠాన్ని ఎన్ని పీరియడ్లలో బోధించాలో ముందుగానే నిర్ణయించి అందుకు అనుగుణంగా అన్ని పీరియడ్లకు పాఠ్యప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. తరగతి గదిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అభ్యసించేందుకు వీలుగా సమగ్ర సమాచారంతో టీచర్స్ హ్యాండ్‌బుక్స్‌ను రూపొందించారు.

జిల్లాకు 56,500 పుస్తకాలు

అన్ని పాఠశాలలకు హ్యాండ్ బుక్స్‌ను అందించేందుకు జిల్లాకు 56,500 పుస్తకాలు వచ్చాయి. డీసీఈబీ ద్వారా ఈపుస్తకాలను పాఠశాలలకు అందజేస్తున్నట్లు డీసీఈబి కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. టీచర్స్ హ్యాండ్ బుక్స్‌తో టీచర్ల పని సులభతరమైందన్నారు. ప్రతి సబ్జెక్టు, ప్రతి తరగతికి ఒకటి చొప్పున హ్యాండ్‌బుక్ రూపొందించారు. అందమైన ముఖచిత్రం కవర్‌పేజీతో పుస్తకాలను ముద్రించారు.

- 1, 2 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు గణితం
- 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం, పరిసరాల పరిజ్ఞానం
- 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, జనరల్ సైన్స్, సాంఘిక శాస్త్రం
- 8, 9, 10 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, ఫిజికల్‌సైన్స్, బయాలాజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం
- పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, సెక్షన్లను బట్టి ఈ పుస్తకాలను పంపిణీ చేస్తారు.

అక్కడ పట్టించుకోవడం లేదు.. మీరైనా కనికరించండి

● క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం.. జిల్లా కేంద్రానికి అర్జీదారుల పరుగులు
● గ్రీవెన్స్‌లో అధికశాతం 'సదరం' సమస్యలే..!



అధికారులు రాని ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెస్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. సమస్య పరిష్కారం కోసం నెలల తరబడి తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో తమ గోడు చెప్పుకునేందుకు వందల కిలోమీటర్ల దూరం నుంచి, వ్యయ ప్రయాసలతో జిల్లా కేంద్రానికి పరుగులు పెడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకవైపు ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సైతం మండల అధికారులను ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో సోమవారం పలువురు అర్జీదారులు కలెక్టరేట్‌లోని స్పందన భవనకు బారులు తీరుతున్నారు. అయ్యా అక్కడెవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా కనికరించండి అంటూ బాధితులు ఒంగోలు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ వద్ద వాపోయారు.

ఏడాది నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా

వృత్తి రీత్యా చెప్పులు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నాకు షుగర్ వ్యాధితో ఒక కాలు తీసేశారు. ఒంటికాలితో ఇంటికే పరిమితమయ్యాను. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే సదరం సర్టిఫికెట్ కావాలన్నారు. సర్టిఫికెట్ కోసం పొదిలి దగ్గర పోతవరం సచివాలయానికి వెళితే దర్శి వెళ్లమన్నారు. దర్శి వెళితే ఒంగోలు జీజీహెచ్‌కు వెళ్లమన్నారు. ఒంగోలు వెళితే ఇక్కడ కాదు మీ ఊర్లోనే ఇస్తారు అంటున్నారు. ఏమి చేయాలో తెలియడం లేదు. ఇలా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వినేవారు లేరు. కనీసం కలెక్టర్‌కి అయినా చెప్పుకుంటే న్యాయం జరుగుతుందని ఒంగోలు వచ్చాను.



- గాలిముట్టు పెద్దయ్య, పోతవరం, పొదిలి



11 ఏళ్లుగా మంచానికే పరిమితం

మా బాబు మనీష్ పుట్టుకతోనే పూర్తి అంగవైకల్యం, పుట్టు గుడ్డి, మూగ, ఒక్క మాటలో చెప్పాలంటే చెవులు వినిపించడం తప్ప శరీరంలో ఏ అవయవం పనిచేయడం లేదు. 11 ఏళ్ల నుంచి మంచానికే పరిమితం అయ్యాడు. ప్రభుత్వ అందించే పింఛన్ రూ. 6వేలు వస్తుంది. కానీ అబ్బాయి మందులకే నెలకు రూ. 15 నుంచి రూ. 20వేలు అవుతున్నాయి. ఆకలి అయినా అడగలేడు. బతుకుదెరువు కోసం చిన్న టిఫిన్ బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. కనీసం వీల్‌చైర్ కూడా రాలేదు. వంద శాతం వైకల్యం ఉండి, మంచంలోనే ఉంటున్న నా బిడ్డను ప్రభుత్వం ఆదుకోవాలి.

- మహేష్, భాగ్యనగర్ 4వ లైను

సూపరింటెండెంట్‌లు సమయానికి రాలేదు. వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులు అధికారుల కోసం ఎదురుచూసి విసుగుచెందారు. అదేవిధంగా భూముల సమస్యకు సంబంధించి వచ్చిన రైతులు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ సంతకం కోసం వీఆర్వోలు తిప్పుకుంటున్నారని ఆగ్రహం చెందారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో దళారుల హవా నడుస్తోంది. వారి ద్వారా వచ్చిన వారికి పనులు సులభంగా జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్‌ను వివరణ అడగగా తాను జేసీ టెలికాన్ఫరెన్స్‌లో ఉన్నానని చెప్పగా అర్బన్ తహసీల్దార్ మధు సూదనరావు విచారణ నిమిత్తం బయట ఉన్నట్లు తెలిపారు.

సగం మంది అధికారుల డుమ్మా

మద్దిపాడు : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. ఇక్కడ పరిష్కారం కానీ వాటిని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి బాధితులు తీసుకెళ్తారు. ఈక్రమంలో సోమవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు నలుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్వైజర్ జ్యోతి, వెలుగు ఏపీఎం కాకుమాను సుబ్బారావు, హౌసింగ్ ఏఈ హాజరు కాగా మిగతా అధికారులు మాత్రం అరగంటకి ఒకరు చొప్పున వచ్చారు దీంతో అర్జీదారులు అర్జీలు ఎవరికి ఇవ్వాలో తెలియక వెనుదిరిగి వెళ్లారు.

గ్రీవెన్స్‌కు 2అర్జీలు

సంతనూతలపాడు : సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో భూమి సర్వే కోసం 2 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మీ కోసంలో 4 అర్జీలు స్వీకరణ

పొన్నలూరు : పొన్నలూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యాలయంలో 3 అర్జీలు స్వీకరించినట్లు తహశీల్దార్ ఉయ్యాల. పుల్లారావు తెలిపారు. పొన్నలూరులో 2 అర్జీలు భూమి కొలతలపై సర్వేచేయమని, పొన్నలూరుకు చెందిన నేలపాటి వెంకటేశ్వర్లు తన భూమిని ఆన్‌లైన్ చేయమని, రేషన్ కార్డు కోసం అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు.

సమయపాలన పాటించని అధికారులు

● ప్రజల అసహనం

ఒంగోలు(రూరల్): ఒంగోలు రూరల్ ,అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరుగు మీకోసం కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించక పోవటంతో అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతి మీకోసం కార్యక్రమాన్ని విజిట్ చేయగా పలు సమస్యలు బహిర్గతమయ్యాయి. పది గంటలకు రావాల్సిన ఒంగోలు రూరల్, అర్బన్ తహసీల్దార్‌లు,వ్యవసాయ శాఖ అధికారి , ఐసీడీఎస్, ఎంపీడీవో కార్యాలయ

జాయింట్ ఎల్‌పీఎంలు వేరు చేయాలి

కొండపి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రీసర్వే చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం నంబర్లుగా ఉన్నవాటిని వేరు చేయాలని కోరుతూ కొండపి, టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లకు అర్జీలు అందజేశారు. కొండపి మండలంలోని పెరిదేపి గ్రామానికి చెందిన కె.రవికుమార్ రీసర్వే కారణంగా తన భూమి విడబడలేదని, ఉమ్మడి భూమిగా చూపిస్తున్నదని జాయింట్ ఎల్‌పీఎంను వేరు చేయాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావుకు అర్జీ అందజేశారు. జరుగుమల్లిలో జాయింట్ ఎల్‌పీఎంలను వేరు చేయాలని రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ పి.మురళి తెలిపారు. టంగుటూరు మండలంలో కూడా ఇదే సమస్య పరిష్కరించాలని రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు.



గ్రీవెన్స్‌లో జేసీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన డ్వాక్రా మహిళలు

డ్వాక్రాగ్రూపు నగదును నొక్కేశారు

● జేసీకి దేవరంపాడు మహిళల ఫిర్యాదు
● విచారణ చేయిస్తానని హామీ

ఒంగోలు(రూరల్),జూలై7(ఆంధ్రజ్యోతి): వెలుగు బుక్ కీపర్, సీసీ, ఏపీఎంలు కుమ్మక్కై బ్యాంకులో ఉన్న డ్వాకా గ్రూపు నగదు రూ. 50 లక్షలను నొక్కేశారని ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామ ఎస్సీ డ్వాక్రా గ్రూపు మహిళలు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ ఆర్. గోపాలకృష్ణకు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళలు మాట్లాడుతూ నాటి వెలుగు సీసీ సాంబయ్య, ఏపీఎం గోపి ,బుక్ కీపర్ దర్శి సుజాత బ్యాంక్‌లోని రూ. 50లక్షలను అక్రమంగా డ్రా చేసుకున్నారని, అధికారులు చర్యలు తీసుకొని వారి నుంచి నగదును రికవరీ చేయించాలని వారు విజ్ఞప్తిచేశారు. దీనిపై జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించి నగదు రికవరీ చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. అలాగే డీఆర్‌డీఏ పీడీని రికార్డులు విజిలెన్స్ అధికారులకు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరంపాడు గ్రామ ఎస్సీకాలనీ మహిళలు బొమ్మల రత్తమ్మ, కొక్కిలగడ్డ కవిత, కనుమూరి మారతమ్మ, దాసరి సుజాత, బీసజీవరాణి, కె.కోటేశ్వరి, కె.నాగరత్నం, కొమ్ము విజయమ్మ, బత్తుల విజయ, కనుమూరి దేవమ్మ, కె. కరుణమ్మ, కే స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సాయి పాదుకలను మోస్తున్న రవిశంకర్ కుటుంబ సభ్యులు

ఘనంగా సాయిపాదుక సేవలు

నాగులుప్పలపాడు, జూన్7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నాయకులు,రవిప్రియ గ్రూప్స్ అధినేత కంది రవిశంకర్‌కు చెందిన చదలవాడ గ్రామంలోని సాయి విష్ణు విల్లాస్ ప్రాంగణంలో నిర్మించిన శ్రీ సాయిబాబా దేవాలయలో సాయిపాదుక సేవలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్రలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలోని సాయిబాబా వాడిన పాదుకలను సాయి విష్ణు విల్లాస్ వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. విల్లాస్ ముఖద్వారం వద్ద నుంచి మేళతాళాలు, మహిళల కోలాట ప్రదర్శనగా సాయిబాబా ఆలయం వరకు సాగిన పల్లకి సేవలో సంస్థ అధినేత కంది రవిశంకర్ కుటుంబసభ్యులతో కలసి సాయి పాదుకల పల్లకిని మోశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కంది సాయివిష్ణు, ప్రముఖ కవి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, సంతపేట సాయిబాబా మందిరం అధ్యక్షులు అళహరి చెంచలరావు, చదలవాడ గ్రామ సర్పంచ్ దాసరి వరప్రసాద్, ఉప సర్పంచ్ కోడె సుబ్బారావు, చదలవాడ వెంకట కృష్ణయ్య, ఒంగోలుకు చెందిన పలువురు పుర ప్రముఖులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● ఎస్పీ గ్రీవెన్స్‌కు 79 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,జూలై7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరిచాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూల నుంచి 79 మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ప్రజా సమస్యలను స్వయంగా విన్న ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు.

● కొత్తగా ఒంగోలులో వెంచరు వేస్తున్నామని చెప్పి స్థానిక మారుతీనగర్‌కు చెందిన కార్‌ట్రావెల్స్ యజమాని వద్ద మూడు కార్లను సమతానగర్‌కు చెందిన వ్యక్తి బాడుగకు తీసుకొన్నాడు. ఏడు నెలలుగా కార్లు బాడుగ ఇవ్వలేదుని, కార్లూ తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.

● ఒంగోలులోని తన ఇంట్లో ఓ మహిళ, ఆమె కుటుంబ సభ్యులు అద్దెకు ఉంటున్నారని, అద్దె చెల్లించకుండా ఇల్లు ఖాళీ చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని సంతనూతలపాడు మండలానికి చెందిన ఒక మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

రేషన్ కార్డులు, పింఛన్ల సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో జరిగిన అడ్డగోలు నిబంధనలతో నేటికీ ప్రజలకు కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్‌లు లభించే పరిస్థితి లేదని, అర్హులైన వారికి న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని 24, 25 డివిజన్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల బండ్లమిట్ట, దేవరాజు వీధిలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకోవడంతో కొందరు తమకు కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్‌లు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పలు సమస్యలను నేరుగా గుర్తించిన దామచర్ల వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల నగర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజతోపాటు, నగర అధ్యక్షుడు బండారు మదన్, పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పథకాలపై మహిళతో మాట్లాడుతున్న దామచర్ల



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బూరేపల్లి కాలనీలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకాస్వాములు, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.జయంత్‌బాబు, నాయకులు సుబ్బారావు, వెంకటశేషయ్య, శ్రీనివాసరావు, జనసేన మండలాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, అయ్యన్న, శ్రీనివాసరావు, సుబ్బారావు, జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు

సంతనూతలపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. సోమవారం మండలంలో పలుగ్రామాలను ఆయన పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చెత్తకుప్పల ఏరియాలను గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ సంబంధిత సిబ్బంది తిరిగి చెత్తను సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీల్లో నీటిపరీక్షలను ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల ద్వారా చేయించి నివేదికలను జిల్లాకు పంపనున్నట్లు తెలిపారు.

పాఠశాలల విలీనం పేరుతో విద్యను దూరం చేయొద్దు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యావిధానంలో పాఠశాలలను విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో దళితులను ప్రభుత్వ విద్యకు దూరం చేయడం తగదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ జిల్లాకమిటీల అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆంజనేయులు మాట్లాడారు. ప్రస్తుతంఉన్న పాఠశాలలు మూసి వేసి రెండు,మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే పాఠశాలలకు పిల్లలు నడిచి వెళ్లడంసాధ్యమేనాఅని ప్రశ్నించారు. ప్రభుత్వం పాఠశాలలు మూసివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి

ఒంగోలు(రూరల్), జూలై7(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజనలను అక్షరాస్యులుగా మార్చే అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని సమన్వయంతో చేయాలని జిల్లాకలెక్టర్ (ఇన్‌చార్జి)ఆర్.గోపాలకృష్ణ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు క్రైం,జూలై7(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఎస్పీని కలిసి పదిమంది ఏఎస్సైలు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో టి.ఇన్నయ్య, టి.మాలకొండయ్య, వై.డానియేల్, సీఎచ్.భాస్కరరావు, టి.కృష్ణమూర్తి, కె.కోటేశ్వరరావు, కె.హరిబాబు, బి.శ్రీనివాసరావు, పి.ప్రసాదరావు, వై.శ్రీనివాసరావులు ఉన్నారు.

ప్రేమపేరుతో యువతి బంధువులపై దాడి

● ఇరువురికి గాయాలు

ఒంగోలు క్రైం,జూలై7(ఆంధ్రజ్యోతి): తన ప్రేమకు అడ్డుపడుతున్నారంటూ ఓ యువకుడు యువతి బంధువులపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన కర్నూల్ రోడ్డులో ఓ హోటల్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. ఆంధ్రకేసరి నగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువతిని ప్రేమించాను అంటూ ఆనంద్ అనే యువకుడు ఆదివారం అక్కడికి వెళ్లాడు. దీంతో ఆ యువతి సోదరుడు హేమంత్ హెచ్చరించాడు దీంతో రెచ్చిపోయిన ఆనంద్ సోమవారం రాత్రి పెద్ద బాకుతీసు కొని వెళ్లి కర్నూల్ రోడ్డులో ఉన్న హేమంత్‌పై దాడికి దిగాడు.హేమంత్ తన మామ రమేష్‌ను పిలిచాడు. దీంతో ఆనంద్ రమేష్‌పై బాకును విసిరడంతో తలకు గాయం అయ్యింది. అదే సమయంలో హేమంత్‌కు గాయాలయ్యాయి. వీరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు.ఆనంద్ మాత్రం రిమ్స్‌కు వెళ్లి తనకు గాయాలయ్యాయి అని ఫిర్యాదు చేశాడు. ఈమేరకు తాలూకా పోలీసులు విచారణ చేసున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నగరంలో భారీ ర్యాలీ, జెండా ఆవిష్కరణలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ నేతృత్వం వహించి, అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్ర మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజిక అభివృద్ధి కోసం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముప్పై సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. ఆయన పోరాట ఫలితమే నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ ఫలాలు త్వరలోనే లభించబోతున్నాయన్నారు. అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్. శ్రీనివాసరావు, ఎంఈఎఫ్ జిల్లా కన్వీనర్ టి. ఆనంద్ మాదిగ మాట్లాడారు. అంతకుముందు నగరంలో సుమారు 40కి పైగా ప్రాంతాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరణలు చేయగా, స్థానిక హెచ్‌సీఎం వద్ద నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకుని భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిక్షాలు, జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్, జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా ఏసుదాసు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరువీధి బాబు, నాయకులు తాళ్ళూరి శేషయ్య, లక్కెబోయిన కోటేశ్వరరావు, పసుమర్తి ఇశ్రాయేలు, కొలకలూరి ప్రభాకర్‌తోపాటు, మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒంగోలులో మాదిగ మహామేళ

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదిగ మహా మేళ కార్యక్రమాన్ని సోమవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈదుమూడికి చెందిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య నేతృత్వంలో స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని మునిసిపల్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగిరి ప్రీతమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి, దళిత హక్కుల సాధన సమితి అధ్యక్షుడు గోపి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేణమాల మాధవ, ఎస్ఎన్‌పాడు అధ్యక్షుడు జంగ్రాజుపల్లి బాలరాజు, జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సంఘం కార్యదర్శి ఎండ్లూరి రవి, నగర నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాజీ సర్పంచ్‌కు నివాళి

జరుగుమల్లి (కొండపి) జూలై7 (ఆంధ్రజ్యోతి): పచ్చవ మాజీ సర్పంచ్ తాటికొండ రమణయ్య దశదిన కర్మ సందర్భంగా సోమవారం పచ్చవలోని రమణయ్య స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పాడు ఖాజీగా షేక్ అబ్బాస్

మద్దిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి):సంతనూతలపాడు నియోజకవర్గ ఖాజీగా షేక్ అబ్బాస్‌ను శాసనసభ్యుడు విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా నియమించారు. ముస్లిం వివాహాలు, దహనసంస్కార కార్యక్రమాలను అబ్బాస్ నిర్వహిస్తారు. ఈ మేరకు ఆయనకు నియామకపత్రాన్ని సోమవారం అందజేశారు.

భవనాలకు తిరిగి కొలతలు వేయాలి

మద్దిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ నాగార్జున హైస్కూల్‌ను జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు పరిశీలించారు. భవనం కొలతలను తిరిగి వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10వేల చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న అన్ని భవనాలను మరొకమారు కొలతలు వేసి ఆస్తి పన్ను నిర్ధారించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.కార్యక్రమంలో మద్దిపాడు పంచాయితీ కార్యదర్శి షేక్ నూరుల్లా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వై.వన్య, సర్వేయర్ షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

ఒంగోలు (రూరల్),జూలై7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు ,బొద్దులూరివారిపాలెం గ్రామాలలో సోమవారం టీడీపీ ,కూటమి నాయకులు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ రాజ్‌విమల్, నల్ల మోతు బాలగంగాధర్, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పనిగంటల పెంపును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు స్థానిక మంగమూరు రోడ్డులోని మూడు బొమ్మల సెంటర్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాసరి సంగీతరావు, పంది రంగయ్య, జ్యోతి సుబ్బారావు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఒంగోలు(రూరల్),జూలై7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయరు పేటలో గల శ్రీ షిర్డి సాయి బాబా మందిరంలో గరుపౌర్ణమివారోత్సవాలలో భాగంగా బాలికలుకూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్యప్రదర్శన ఎంతగానో ప్రేక్షకులను ఆకట్టుకున్నది. శ్రీనళిని ప్రియా కూచిపూడి నృత్యనికేతన్ విద్యార్థులతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

నాగులుప్పలపాడు, జూన్7 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఉప్పుగుండూరులో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామంలోని దిన్నెమీద నివశించే కొలకలూరి అనిల్ 32 భార్య గత కొంత కాలంగా పుట్టింటిలో ఉంటోంది. ఇటీవల అనిల్ అనారోగ్యానికి గురయ్యాడు.దాంతో మనోవేదన చెందుతూ సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్ తరలించి కేసు నమోదు చేశారు.

పోలీస్ బెటాలియన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వెనుకవైపు పోలీస్ బెటాలియన్ కార్యాలయాన్ని సోమవారం సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పరిశీలించారు. అసిస్టెంట్ కమాండర్ జనార్దన్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్‌కు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండవ జయంతి బాబు, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, కే.మాధవ రావు, రాయపాటి వెంకటశేషయ్య, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులకు శ్రద్ధ లేదు.. ప్రజలకు నమ్మకం లేదు

- మొక్కుబడిగా మీకోసం కార్యక్రమం
- అధికారులు సమయానికి రారు.. వచ్చినా ఉండరు

త్రిపురాంతకం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జరిగే మీకోసం కార్యక్రమంపై అధికారులకు శ్రద్ధ లేదు అన్నట్లు కనిపించింది. ప్రజలకు కూడా అధికారులు వారి సమస్యలు పరిష్కరిస్తారనే నమ్మకం లేదన్నట్లు ఉంది. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సోమవారం పరిశీలించగా ఈ విషయాలు స్పష్టంగా కనిపించాయి. అంతటా అధికారుల హాజరు మొక్కుబడిగా ఉంది. 11గంటల వరకు అధికారులు వచ్చే పరిస్థితి లేదు. వచ్చినవారు మండలస్థాయిలో జరిగే కార్యక్రమంలో సంతకాలు చేసి వెళ్తున్నారు. అన్ని మండలాల్లో నలుగురు ఐదుగురుకు మించి అధికారులు మీకోసంలో కనిపించడంలేదు. ప్రజలు కూడా మండలాల్లో అధికారులపై నమ్మకంలేక జిల్లా కేంద్రంలో అధికారులకు ఫిర్యాదులు చేసేందుకు వెళ్తుంటే ఇక్కడి అధికారులు మాత్రం సమస్యపై జిల్లా అధికారులు మనలను పిలిచినప్పుడు వీడియో ఎదరుగా వద్దామనుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వారివారి కార్యాలయాల్లో ఉండిపోయారు.

త్రిపురాంతకంలో..

మండలంలో సోమవారం మీకోసం కార్యక్రమంపై అధికారుల ఆసక్తి కనిపించలేదు. కేవలం మొత్తం 5మంది అధికారులు మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ గదిలో కనిపించారు. తహసీల్దార్ గతనెల 30న ఉద్యోగవిరమణ చేయడంతో డిప్యూటీ తహసీల్దార్ మాత్రం అందుబాటులో ఉన్నారు. ఇతర అధికారులు మొక్కుబడిగా వీడియో కాన్ఫరెన్స్ జరిగే గది వద్దకు వచ్చి వెళుతూ కనిపించారు. పుల్లలచెరువు తహసీల్దార్ ఇక్కడ ఇన్‌చార్జిగా ఉండడంతో రెవెన్యూ సమస్యలపై వచ్చిన వారు తహసీల్దార్ వస్తారా? రావడం లేదా అని వాకబు చేస్తూ కనిపించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్ అందరూ మొక్కుబడిగా వారి పనులు చేసుకుంటున్నట్లు కాలక్షేప కబుర్లతో కనిపించారు. ఎంపీడీవో గదికి తాళం వేసి ఉండడంతో బాపట్ల శిక్షణలో ఉన్నారని చెప్పారు. ఆయన స్థానంలో కార్యాలయ ఏవో సాంబశివరావు గ్రీవెన్స్‌లో ఉన్నారు. ఏపీవో సెలవులో ఉన్నట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ, ఐసడీఎస్ సూపర్‌వైజర్ హాజరయ్యారు. వ్యవసాయాధికారి, ఏపీఎం, ఇద్దరు ఎంఈవోలు వారి వారి కార్యాలయాల్లో ఉన్నారు. మొత్తానికి జిల్లా అధికారుల మీకోసంలో తమ సమస్య వచ్చినప్పుడు పిలిస్తే వెళ్దాంలే అన్నట్లు ఉన్నారు. అసలు కార్యక్రమంపై ఆసక్తే లేకుండా మరికొందరు కన్పించారు. ప్రజలు కూడా అధికారుల తీరునుబట్టి సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలవద్ద కనిపించలేదు. సోమవారం ఒక్క అర్జీ కూడా రాలేదని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ తెలిపారు.

మీ కోసం.. ఎవరి కోసం

ఎర్రగొండపాలెం రూరల్ : మీకోసం కార్యక్రమానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కావడం లేదు. దీంతో ఈ మీ కోసం ఎవరి కోసం అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీకోసం తీరును పరిశీలించగా.. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ మీ కోసంలో కేవలం తహసీల్దారు, డీటీ, సీనియర్ అసిస్టెంట్, మండల సర్వేయర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వెలుగు ఏపీఎం, గృహ నిరాణ శాఖ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఇతర శాఖల అధికారులు కానీ, సిబ్బంది కానీ హాజరు కాలేదు. వెలుగు, వ్యవసాయ శాఖ అధికారులు సంతకం పెట్టి పది నిమిషాల్లో వెళ్లిపోయారు. అధికారులు రాకపోవడం, ఇచ్చిన ఆర్జీలకు పరిష్కారం లేకపోవడంతో ప్రజలు ఎక్కువ శాతం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికో, కలెక్టరేట్‌కో వెళ్లి సమస్యలపై మొరపెట్టుకుంటున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి 2 అర్జీలు అందాయి. ఒకటి కోర్టు కేసులో ఉన్నది, మరొకటి ఆన్‌లైన్ సమస్య. వాదంపల్లి గ్రామానికి చెందిన రైతు చిన్న లక్ష్మయ్య తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారానికోసారి గ్రామాల్లో నిర్వహిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. అధికారుల గైర్హాజర్‌పై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. తాను వచ్చిన కొత్తలో ఇలాగే ఉంటే అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

తూతూమంత్రంగా

- సమయపాలన పాటించని వైనం
- రెవెన్యూశాఖకు చెందిన అర్జీలే అధికం

మార్కాపురం : వారానికోసారి జరిగే మీకోసంకు మండల, డివిజన్ స్థాయి అధికారులు హాజరయ్యేందుకు సక్రమంగా మొగ్గు చూపడం లేదు. ఉదయం 10.00 గంటలకల్లా కార్యాలయానికి చేరుకుని గంట ఉండి తర్వాత వెళ్లి పోతున్నారు. అంతేకాక చాలా శాఖాలకు చెందిన అధికారులు సంవత్సరంలో ఒకటి రెండుసార్లు కూడా మీ హాజరుకావడంలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మీ కోసం అంటే కేవలం రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలపై మాత్రమే అర్జీలు అందజేయాలి అనే అపోహ ఏర్పడుతోంది. అర్జీలలో కూడా 95 శాతానికి పైగా ఆ శాఖకు చెందిన అర్జీలే వస్తున్నాయి. వాటిలో ఏళ్లుగా పలు స్థాయిల్లోని అధికారుల వద్దకు వెళ్లిన అర్జీలే మళ్లీమళ్లీ రావడం విశేషం. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి మెరుగైన సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమానికి మొత్తం 6 మంది అధికారులు హాజరయ్యారు. సెలవులో ఉండడంతో సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ హాజరుకాలేదు. కార్యాలయ కేఆర్ఆర్‌సీ తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మీ కోసం హాజరైన వారిలో ముఖ్య అధికారులు ఎవరూ లేరు.



ఆంధ్రజ్యోతి విజిట్

ఎంపీడీవో కార్యాలయంలో 11.45 గంటలకు సాంకేతిక సమస్యతో పరికరాలు పనిచేయక వెళ్లిపోయిన అధికారులు

ఏడాదిగా తిరుగుతున్నా

- వంగూరి చిన్నగురుస్వామి



రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న చిన్నగురుస్వామి

సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో గిద్దలూరు మండలం గడికోటకు చెందిన వంగూరి చిన్న గురుస్వామి పొలం సమస్యపై అర్జీ అందజేశారు. 1995వ సంవత్సరంలో తాను గ్రామంలోని 443/2 సర్వే నెంబర్‌లో 3.12 ఎకరాల భూమిని కొని పాస్ పుస్తకం పొంది అనుభవంలో ఉన్నానని తెలిపారు. కానీ రెండేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు తన భూమిలోని 0.75 ఎకరాల భూమిని పక్క గ్రామానికి చెందిన నల్లగుండ్ల సాలమ్మ పేరున ఆన్‌లైన్ చేశారన్నారు. ఆమెకు ఎలాంటి క్రయవిక్రయ పత్రాలు లేకున్నా ఇష్టానుసారంగా ఆన్‌లైన్‌లో పొలం నమోదు చేశారన్నారు. ఈ విషయమై మండల సహసీల్దార్‌ను అడిగితే ఆన్‌లైన్‌లో పొలం తొలగించే అధికారం తనకు లేదని చేతులు దులుపుకున్నారన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే అసలు పట్టించుకున్న వాళ్లే లేరన్నారు. మూడు మాసాల క్రితం ఒంగోలు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. అక్కడ నుంచి ఈ సమస్యను పరిష్కరించమని మళ్లీ సబ్ కలెక్టర్ కార్యాలయానికే ఫైల్ పంపారన్నారు. రెండు మాసాలుగా సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడలేదని వాపోయారు.

న్యాయం చేయండి

- సాల్మన్‌రాజు, దివ్యాంగుడు



సాల్మన్‌రాజు

పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్‌లో 6 నెంబర్ రూంను మార్చి 23, 2011లో తనకు కెటాయించారు. ఆ షాపును మరొకరికి అక్రమంగా కేటాయించి తనకు అన్యాయం చేశారని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దివ్యాంగుడైన సాల్మన్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కాపురం మండలం భూపతిపల్లి గ్రామానికి చెందిన పొడతరపు కాటం రాజు తనకు వారసత్వంగా వచ్చిన సర్వే నెంబర్ 723లో 1.98 సెంట్ల భూమికి కొలతలు వేసి పాసుపుస్తకం ఇవ్వాలని కోరుతున్నా పరిష్కరించడం లేదని వాపోయారు. తిప్పాయపాలెంకు చెందిన బాలి అంజిరెడ్డి కూడా ఆన్‌లైన్ సమస్యపై తిరుగుతున్నట్లు చెప్పారు. మాలపాటి పల్లి గ్రామానికి చెందిన వీరారెడ్డి తన అనుభవంలో ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని అర్జీ ఇచ్చారు.

తర్లుపాడులో.. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీకోసంకు అధికారులు హాజరుకాకపోవడంతో వెలవెలబోయింది. వచ్చిన ఇద్దరు అధికారులు కూడా సాంకేతిక లోపం ఏర్పడ్డంతో వెళ్లిపోయారు. దీంతో మీ కోసం జరగలేదు.



తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

దుమ్మాకొట్టిన అధికారులు

కొనకనమిట్ల : మీకోసంకు పలుశాఖ అధికారులు దుమ్మాకొట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌కు 5 శాఖల అధికారులు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. తహసీల్దార్ సురేష్ ఒక్కరే వినతులను స్వీకరించారు.

కంభంలో మొక్కుబడిగా

కంభం : వైసీపీ పాలన పోయి ప్రజా ప్రభుత్వ పాలన వచ్చి ఏడాదైనా ప్రభుత్వ అధికారుల్లో అలసత్వం పోలేదు. ప్రజల సమస్యలు తీర్చేందుకు వారం వారం నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమం మొక్కుబడిగా సాగుతున్నది. సోమవారం 10.30 గంటలకు పరిశీలించగా తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి, పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ అధికారులు మాత్రమే హాజరుకాగా మిగిలిన ఏ శాఖకు చెందిన అధికారులు హాజరు కాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అర్జీలిచ్చేటప్పుడు ఆయా శాఖల వారు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్తున్నారు.

ఎవరు వస్తున్నారో..ఎవరు రారో తెలియదు

రాచర్ల : మీకోసంకు విద్య, రెవెన్యూ, గృహ నిర్మాణ, వ్యవసాయ శాఖ, ఈవోఆర్డీ అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఏ శాఖ అధికారి కూడా హాజరు కాలేదు. తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఎవరు వస్తారో.. ఎవరు రారో తెలుసుకునేందుకు రిజిస్టర్ కూడా అందుబాటులో లేదు. తహసీల్దార్ కార్యాలయంలో మూడు నెలలుగా వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్ పనిచేయడం లేదని తెలిసింది. అయినా అధికారులు వీసీకి హాజరవుతున్నారు. ఎందుకు, ఎలా హాజరవుతున్నారో అర్థంకాని ప్రశ్న. ఒకరిద్దరు హాజరవుతున్నారే తప్ప ప్రయోజనం లేదని ప్రజలు అంటున్నారు. ఏకొత్తపల్లికి చెందిన రెడ్డి వెంకటరెడ్డి, అనుములపల్లికి చెందిన శిరిగిరి రంగయ్య సమస్యలు చెప్పుకోవడానికి వస్తే అధికారులు ఎవరూ అందుబాటులో లేరని, విధిలేని పరిస్థితుల్లో కింది స్థాయి అధికారులకు అర్జీలు ఇచ్చి వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల గైర్హాజర్‌తో వెలవెల



పొదిలిలో హాజరైన అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు

పొదిలి : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం అధికారుల గైర్హాజరుతో వెలవెలబోయింది. తహసీల్దార్ క్రిష్ణారెడ్డి, మండలపరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు మాత్రమే హాజరయ్యారు. కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ముఖ్యమైన శాఖల అధికారులు రాకపోవడంతో వారికి అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారు మధ్యాహ్నం వరకూ వేచి ఉండి వెనుదిరిగి వెళ్లారు. ఎంపీడీవో సెలవులో ఉన్నట్లు తెలిసింది. అధికారులు ఉండడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మీ కోసమే... మాకు కాదు

పెద్దారవీడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తుంది. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. మీ కోసం మీకే గాని.. మాకు కాదు అంటున్నారు పెద్దారవీడు మండల అధికారులు. సోమవారం పరిశీలనలో అధికారుల పనితీరు తేటతెల్లమైంది.

అధికారులు సమయానికి రారు.. వచ్చినా ఉండరు

పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయంలో సాంకేతిక సమస్యల కారణంగా 10.15 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైంది. ఆ సమయానికి డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, హౌసింగ్ మల్లారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ అధికారి సుబ్బయ్య మాత్రమే హాజరయ్యారు. ఎంఈవో శ్రీనివాసులు 10.30 నిమిషాలకు వచ్చారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయారు. ఎంఆర్ఐ గోపి 10.30కి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి 11.11కి వచ్చారు. ఏవో లక్ష్మీనారాయణ 11.12కి, ఆరోగ్యశాఖకు చెందిన కనకదుర్గాబాయ్ 11.30 గంటలకు హాజరయ్యారు.

కేవలం ఆరు శాఖల అధికారులు మాత్రమే

సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమానికి కేవలం ఆరు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రధానంగా మీ కోసం కార్యక్రమం జరుగుతున్న ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించి ఎంపీడీవో కానీ, కార్యాలయ సిబ్బంది కానీ ఒక్కరు కూడా హాజరుకాలేదు. అంతేకాక ప్రధాన శాఖలైన ఆర్ అండ్ బీ, నీటిపారుదల, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, ఆర్టీసీ, పోలీస్ శాఖల నుంచి ఒక్కరు కూడా హాజరుకాలేదు.

24కు గాను 4 శాఖల వారే హాజరు

పుల్లలచెరువు : మీకోసంకు 26 శాఖలకు గాను 4 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతావారు డుమ్మా కొట్టారు. కొందరు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు.

ఎడాదిగా తిరుగుతున్నా

- ద్రోణాదుల కోటేశ్వరరావు, పుల్లలచెరువు



కోటేశ్వరరావు

గత ఎడాది నుంచి తన తల్లిపేరున ఉన్న భూమిని అక్రమంగా ఆన్‌లైను చేశారు. తొలగించాలని ఎడాది నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదు. తన తల్లి ద్రోణాదుల గంగమ్మ 1994లో గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్టర్ పొందిన సర్వే నెం.579లో ఎకరం 2.8సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్ చేసుకున్నారు. ఈ విషయమై గత నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈరోజు నోటీసు ఇచ్చారు. వెంటనే సమస్య పరిష్కరించాలి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

సమగ్రంగా బాలికల సర్వే

మార్కాపురం రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి). అనాథ బాలబాలికల సర్వే సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు సచివాలయ మహిళా పోలీసులను కోరారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో సోమవారం మార్కాపురం పట్టణ, మండల సచివాలయ మహిళా పోలీసులతో బంగారు బాల్యం మిషన్‌లో భాగంగా అనాథ బాలబాలికల సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాలబాలికలతో పాటు వారి కుటుంబాలను కూడా పర్యవేక్షించే అత్యంత విలువైన ఈ సర్వేను జాగ్రత్తగా చేయాలని కోరారు. ఈ సర్వే అనంతరం గుర్తించిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి అందించే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా ఈ సర్వేన సామాజిక బాధ్యగా తీసుకుని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గిరిధర శర్మ, సిద్ధిక్ బాషా, మున్సిపల్ మేనేజర్ అంజనేయులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు జాగ్రత్తలు పాటించండి

రాచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : డెంగీ నివారణకు విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని వైద్య శాఖ గిద్దలూరు సబ్ యూనిట్ అధికారి జి వెంకటేశ్వర్లు అన్నారు. డెంగీ మాసోత్సవంలో భాగంగా ఆకవీడు పీహెచ్‌సీ పరిధిలోని చోళ్లవీడు గ్రామ జడ్‌పీహైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని విద్యార్థులకు సూచించారు. మనం శుభ్రంగా ఉంటూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో విజయ్ కుమార్, హెచ్‌ఏ శ్రీనివాసులు, హెచ్‌వి సుబ్బమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

11న భూముల కౌలుకు వేలంపాట

రాచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు సమీపంలోగల నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయ భూముల కౌలుకు ఈనెల 11వ తేదీ శుక్రవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎం.నాగయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. చోళవీడు, జేపీచెరువు, రాచర్ల, అనుములవీడు, రామాపురం, సోమిదేవిపల్లి, రంగాపురం గ్రామాల్లోగల భూములకు వేలంపాటలు జరుగుతాయని ఆసక్తి కలవారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. కౌలు పాడుకున్న వారికి 2025-26 నుంచి 2027-28 వరకు అనగా మూడు సంవత్సరాల పాటు హక్కు ఉంటుందన్నారు. వేలంపాటలు ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో జరుగుతాయన్నారు. వివరాలకు 9603322656 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎరువుల డీలర్లు రైతులకు రసీదులు ఇవ్వాలి



దుకాణంలో విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కంభం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణ డీలర్లు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని వ్యవసాయాధికారి మహమ్మద్ సూచించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్‌ను, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లను, బిల్ బుక్‌లను పరిశీలించారు. విత్తనాల నాణ్యత పరీక్ష కోసం మనగ్రోమోర్ సెంటర్, లక్ష్మీకనకదుర్గ ఎంటర్ ప్రైజెస్, బాలాజీ ఏజెన్సీ షాపులలో పత్తి, వరి విత్తనాలు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పరీక్ష నిమిత్తం పంపుతామన్నారు. రిజిస్టర్‌లు, బిల్ బుక్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తనాల నాణ్యత ప్ర మాణాలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

రాచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ప్రారంభ మవుతుందని ఆ కార్యక్రమానికి కార్యదర్శులు సిద్ధంగా ఉండాలన్నారు. అప్పగించిన సర్వే పనులన్నీ పెండింగ్ లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈనెల 10న జరిగే మెగా పీటీఎం కార్యక్రమం విజయవంతానికి ప్రత్యేక కృషి చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కొన్ని పంచాయితీల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి కార్యదర్శులు పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు రాచర్ల మండలంలో సుపరిపాలన

రాచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తామని టీడీపీ మండలాధ్యక్షుడు కటిక యోగానంద్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఉదయం 10గంటలకు సత్యవోలు, 12గంటలకు యడవల్లి, సాయంత్రం 4గంటలకు గుడిమెట్ట, 6గంటలకు సోమిదేవిపల్లి గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు

11న శాకాంబరి అలంకారం

గిద్దలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాస పూజల్లో భాగంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 11వ తేదీ శుక్రవారం శాకాంబరి పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 11న శుక్రవారం ఉదయం 10గంటలలోపు దాతలు ఎవరైనా కూరగాయలు దేవస్థానానికి వచ్చి ఇవ్వవచ్చని, సాయంత్రం 6గంటలకు అమ్మవారు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పండ్ల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సంజీవరాయునిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కమలదేవి, డాక్టర్ షేక్ అఫ్రానా ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై చదవడం, రాయడం వచ్చిన 25 నుంచి 45 ఏళ్ళలోపు వివాహితులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు పీహెచ్‌సీలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు మండల అధికారులకు శిక్షణ

పెద్ద దోర్నాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులకు మంగళవారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులకు మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ బి.వాసుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15లోగా ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని, అప్లై చేసుకున్న అభ్యర్థులు ఈనెల 21న తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌నకు హాజరు కావాలన్నారు. శిక్షణ సమయంలో ఇంప్లాంట్ ట్రైనింగ్ ద్వారా వివిధ కంపెనీలలో శిక్షణ, కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు 100 శాతం ప్లేస్మెంట్స్ ఇప్పించబడనుని, పూర్తి వివరాలకు 9553306631 నెంబరుకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



పెద్ద నాగులవరంలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కందుల



వైపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఏడాదిలో మంచి పాలన అందించాం

ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిలోనే ప్రజలకు మంచి సుపరిపాలనను అందించామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దనాగులవరంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నాయకులతో కలిసి ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల స్థానికులకు ఏడాది పాలన, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమస్యలు తెలుసుకున్న కందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, పెద్దనాగులవరం నాయకులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : గత వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా దివాళా తీసిందని ఎమ్మెల్యే కందుల అన్నారు. మండలంలోని వద్దమడుగులో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొదిలి : రాష్ట్రాభివృద్ధే టీడీపీ అజెండా అని ఎమ్మెల్యే కందుల అన్నారు. పొదిలి పట్టణంలో 226బూత్ మూగచింతల గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ప్రజలను నిలువునా మోసం చేశారని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో 18, 19 బూత్‌ల పరిధిలో ఇంటింటికీ తిరిగి ఆయన ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు నాదేంద్ర బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ ఇటివల జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా పర్యటనలో మేము వస్తే టీడీపీ నాయకులకు సినిమా చూపిస్తామని చెప్పుచున్నారని, హింసను ఖండించాల్సింది పోయి ప్రొత్సాహిస్తున్నారని,ఇటువంటి పాలనతో విసిగిపోయిన ప్రజలు 11సీట్లు ఇచ్చి గుణపాఠం పలికారని అన్నారు. చంద్రబాబు నాయుడే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడని రాష్ట్ర ప్రజలకు ప్రగాఢనమ్మకం ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకుడు బ్రహ్మం చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, వేగినాటి శ్రీను, ముఖ్య నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, సత్యనారాయణగౌడ్, తోట మహేష్, సుబ్బారావు, నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, లక్ష్మయ్య, గంగయ్య, పాస్టర్ల సంఘం ఫెలోషిప్ అధ్యక్షుడు జీవయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ మస్తాన్ వలి, ఆర్యవైశ్య నాయకుడు తిమ్మయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

సీఎస్‌పురం(పామూరు), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. సోమవారం సీఎస్‌పురం మండలం చింతపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకుందాంపై జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా దూరంగా ఉండాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.


పీసీపల్లి: 10.50గంటల సమయంలో గ్రీవెన్స్ హాలులో ఉన్న ఇద్దరే ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి విజిట్

మీకోసం.. మొక్కుబడి

» సమయపాలన పాటించని అధికారులు » పలువురు గైర్హాజరు

» అర్జీదారుల ఎదురుచూపులు » పలు మండలాల్లో స్పందన అంతంతమాత్రమే!

పీసీపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మీకోసం(పీజీఆర్ఎస్)కు అధికారులు డుమ్మా కొడుతున్నారు. ప్రతి సోమవారం మండలస్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసంకు అధికారులు రాకపోవడంతో తమ సమస్యలు ఎవరు పరిష్కరిస్తారంటూ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం విజిట్ నిర్వహించింది. మండలస్థాయిలో ఉన్న అధికారులందరూ ఉదయం 10గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి గ్రీవెన్స్ హాలులో ఉండాలి. గృహనిర్మాణ శాఖకు సంబంధించిన వర్క్ ఇన్‌స్పెక్టర్ ఫిరోజ్, వ్యవసాయశాఖకు సంబంధించిన వీపీఏ మనోహర్ మాత్రమే సమయానికి గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పటికీ అధికారులు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఆతరువాత 10.50గంటలకు ఏపీఎం సత్యానందం, 10.59గంటలకు తహసీల్దార్ సీహెచ్ ఉష కార్యాలయానికి వచ్చారు. ఆతరువాత ఎంఈవోలు, డిప్యూటీ ఎంపీడీవో, వైద్యశాఖకు సంబంధించిన ఉద్యోగి గ్రీవెన్స్‌కు వచ్చారు. మిగిలిన శాఖల అధికారులెవరూ మీకోసం కార్యక్రమానికి హాజరుకాకుండా డుమ్మాకొట్టారు.

దర్శిలో మూడే అర్జీలు

దర్శి, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రంగా ఉంది. మూడు అర్జీలు మాత్రమే దాఖలయ్యాయి. గ్రంథాలయ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని, భూమికి ఆన్‌లైన్ చేయాలని, మ్యుటేషన్ పూర్తి చేయాలని అర్జీలు దాఖలయ్యాయి. మ్యుటేషన్ కోసం వచ్చిన అర్జీని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది సకాలంలో హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు.


నక్కా పార్వతమ్మ

సర్వే కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా..

కురిచేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): సర్వే కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదని కల్లూరు గ్రామానికి చెందిన నక్కా పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీకోసంలో 10.50 గంటలకు తహసీల్దార్ రజనీకుమారి ఒక్కరే వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. మిగిలిన అధికారులు ఎవరూ హాజరుకాలేదు. 11 గంటల తరువాత ఒక్కో అధికారి గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కల్లూరు గ్రామానికి చెందిన నక్కా పెద్ద గాలెయ్య భూమిని సర్వే చేయడం కోసం గత ఫిబ్రవరి 7న సచివాలయంలో ఫీజు కట్టారు. అప్పటినుంచి ఎన్నిసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఇంత వరకూ కొలవ లేదని పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. పడమర గంగవరం గ్రామానికి చెందిన ఓ రైతు తన భూమికి హద్దులు చూపి తనకు అప్పగించాలని కోరుతున్నా పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


కనిగిరి: తహసీల్దార్‌తో పాటు నామమాత్రంగా హాజరైన అధికారులు

ముండ్లమూరులో మమ..

ముండ్లమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీకోసంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు తప్ప మిగతా మండలస్థాయి అధికారులెవ్వరూ హాజరుకాలేదు. తహసీల్దార్ హైకోర్టుకు వెళ్లటంతో ఆయన స్థానంలో డీటీ హాజరై అర్జీలు స్వీకరించారు. 12 గంటల సమయంలో ఎంపీడీవో శ్రీదేవి హాజరయ్యారు. ఏపీవో, ఏపీఎం, వైద్యాధికారి, పశువైద్యాధికారి, పంచాయతీ రాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఏఈ గైర్హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు కార్యాలయాల్లో ఉండి కూడా రాక పోవటంతో వివిధ సమస్యల పై వచ్చిన అర్జీ దారులు సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక వెనుదిరిగారు.


తాళ్లూరు: వీసీ పనిచేయక ఖాళీగా కూర్చున్న అధికారులు


దర్శిలో మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు

తాళ్లూరులో తుస్

తాళ్లూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలపై అర్జీలు తీసుకుని వాటి పరిష్కార మార్గం చూపేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీకోసంకు మండలస్థాయి అధికారుల్లో ఎక్కువమంది డుమ్మా కొట్టారు. 13 శాఖలకు చెందిన అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే మీకోసంలో అందుబాటులో ఉండి శాఖలవారీగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలి. తహసీల్దార్ కోర్టు పనిమీద వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దార్, హౌసింగ్ అధికారి, ఐసీడీపీఎస్ సూపర్‌వైజర్ ఉదయం 10.40కు హాజరయ్యారు. 11 గంటల సమయంలో వెలుగు ఏపీఎం, డ్వామా ఏపీవో హాజరయ్యారు. మిగిలిన 8 శాఖలకు చెందిన ఎంపీడీవో, వ్యవసాయాధికారి, పశువైద్యాధికారి, వైద్యాధికారి, ట్రాన్స్‌కో ఏఈ, ఎంఈవో, తదితరులు మీకోసంకు హాజరుకాలేదు. తహసీల్దార్ కార్యాలయంలో వీసీ పని చేయకపోవటంతో హాజరైన అధికారులు ఖాళీగా కూర్చున్నారు.

దొనకొండలో వచ్చాం.. వెళ్లాం..

దొనకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి పలు శాఖలకు చెందిన అధికారులు గైర్హజరయ్యారు. తహసీల్దార్ రమాదేవి, ఎంఈవో సాంబశివరావు, మండల పరిషత్ కార్యాలయ టైపిస్టు రాము, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ సురేష్ మాత్రమే హాజరయ్యారు.

ఆన్‌లైన్ కోసం ముడుపులు చెల్లించినా తిప్పుకుంటున్నారు..

గజ్జెల వెంకటరెడ్డి, తురకపాలెం, తాళ్లూరు మండలం


వెంకటరెడ్డి

వారసత్వంగా వచ్చిన భూమి ఆన్‌లైన్ కోసం ఏడాదిన్నర కాలంగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదు. రెవెన్యూ అధికారులు అడిగిన మేరకు తమ తల్లి డెత్ సర్టిఫికెట్, భాగస్వామ అంగీకార నోటరీ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేశాం. తనకు పెద్దల నుంచి సంక్రమించిన ఆస్తిని తన పేరున ఆన్‌లైన్ చేయమని మ్యుటేషన్‌కు దరఖాస్తు పెట్టుకున్నాను. ఆన్‌లైన్ కాక పోవటంతో రెవెన్యూఅధికారులను కలిసి రూ.పది వేలు ముడుపులు కూడా చెల్లించి ఏడాదిగా తిరుగుతున్నా. నేటికి ఆన్‌లైన్ చేయలేదు. అన్ని వివరాలు ఉన్నా రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తిప్పుకుంటున్నారు.

కనిగిరిలో చిన్నచూపు

కనిగిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మీకోసం కార్యక్రమం పట్ల పలువురు అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. తహసీల్దార్ సమయపాలన పాటించినప్పటికి వివిధ శాఖల మండలస్థాయి ముఖ్య అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. గురవాజీపేట అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ తహసీల్దార్ కార్యాలయంలో హాజరైతే, కనిగిరి పట్టణ, ఏరువారిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్‌లు ఆర్డీవో కార్యాలయంలో జరిగే మీకోసం వీసీలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో హార్టికల్చర్ అధికారి హాజరయ్యారు. ఆర్డీవో కార్యాలయంలో ఇరిగేషన్ డీఈ, హౌసింగ్ డీఈ, ఫిషరీస్ అధికారి హాజరయ్యారు. ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, ఆర్టీసీ, ఫారెస్ట్, ఎక్సైజ్, వైద్యవిధానపరిషత్, అగ్రికల్చర్, డీఆర్‌డీఏ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐసీడీఎస్, మెప్మా, ఆర్అండ్‌బీ, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. కాగా, ఆర్డీవో కార్యాలయంలో ఏడు అర్జీలు, తహసీల్దార్ కార్యాలయంలో 8 అర్జీలు వచ్చాయి.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

సీఎస్‌పురం(పామూరు), జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగారికొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పెన్నులను పూర్వవిద్యార్థులు చల్లా మనోజ్, మధులు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.హరిబాబు, ఆర్వీ సౌజన్య, రాజేశ్వరి, చావా సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవోకు సమ్మె నోటీసు ఇచ్చిన అంగన్‌వాడీలు

కనిగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంగన్‌వాడీలు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ నెల 9న జరిగే సమ్మెలో పాల్గొంటున్నట్టు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమ వారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవోకు అంగన్‌వాడీలు సమ్మె నోటీసు అందజేశారు.

ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్‌ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారా దత్తం చేస్తూ కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కుమారి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పామూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోస్టాఫీసు ఎదురు గల శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో ఈనెల 10న జరిగే గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన ఆర్య కంటి వైద్యశాల డాక్టర్ ఓగిరాల గోపాలకృష్ణ రూ.2 లక్షలు విరాళం అందజేసినట్టు ఆలయ చైర్మన్ పబ్బతి వెంకటేశ్వర్లు తెలిపారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన

వెలిగండ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు అన్నారు. నాగిరెడ్డిపల్లి వైద్య సిబ్బంది సోమవారం మోగళ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈసందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఇంటి ఆవరణలో శుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా నీటి తొట్లను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో కళావతి, ప్రసాద్, రంగాచారి, సత్యానందం, తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

తాళ్లూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని శాఖల అధికారులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు.

మండలంలోని అన్నిశాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు తమశాఖల పరిధిలోని 2023-2024 ఆర్థిక సంవత్సరంలో సాధించిన పురోగతి నివేదికలను అందజేయాలన్నారు. పురోగతి 2.0 సూచిక విధానంపై శిక్షణ ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి

» ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని మాచవరం గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సుపరిపాలన కరపత్రాలను అందజేసి కనిగిరిలో జరిగిన అభివృద్ధిపై వివరించారు. అదే సమయంలో ప్రజలకు ఏర్పడిన సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యల్లో భాగంగా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. స్వయంగా ఎక్స్‌కవేటర్ నడుపుతూ వీధుల వెంట ఉన్న చెత్తకుప్పలను, పిచ్చిచెట్లను తొలగింపు కార్యక్రమం చేపట్టారు.


మాచవరం గ్రామంలో ప్రజా సమస్యలను నమోదు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


పామూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ఎమ్మెల్యే వెంట టీడీపీ కనిగిరి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులు రెడ్డి, ఫిరోజ్, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంషీర్, కొబ్బరిబొండాల సుబ్బారావు, తులసి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎమ్మెల్యే ఆదేశాలతో మండలంలోని గురువాజీపేట గ్రామంలో నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి ఇంటింటికి సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. తక్కెళ్ళపాడు గ్రామంలో పిచ్చాల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

పామూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనర సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పామూరులో జరిగిన సమావేశానికి టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో అభి వృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ప్రజల కు వివరించాలన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని ట్యాంకు బజారు ప్రాంతంలో సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమాల్లో యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, ఉప్పలపాటి హరిబాబు, ఆకుపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలుచేస్తుండటంతో అన్నివర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని 12వ వార్డులో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా, పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ఇంటింటికి వెళ్లి తెలుసుకోవాలని అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. తల్లికి వందనం, దీపం పథకం, పింఛన్ పథకాన్ని ఇప్పటికే అమలుచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కొద్దిరోజుల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు నిధులు జమ అవుతాయన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలు జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతుండటంతో ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతుందన్నారు.


దర్శిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

రోజురోజుకు ప్రభుత్వ పనితీరు పట్ల ఆదరణ పెరుగుతుందన్నారు.

కూటమి ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ చూసి వైసీపీ నాయకులకు ఏంచేయాలో పాలుపోక విధ్వంసాలకు, గొడవలకు పాల్పడుతున్నారని డాక్టర్ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. దర్శి నియోజకవర్గంలో ఇప్పటికే నిలిచిన అభివృద్ధి పనులను పునఃప్రారంభించామన్నారు. దర్శిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించామని, నిలచిన టీటీడీ కల్యాణ మండపం పునఃనిర్మాణ పనులు జరుపుతున్నామన్నారు. త్వరలో అన్నా క్యాంటిన్ భవన నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు భోజనం అందించే ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ మండల అధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, నారపుశెట్టి మధు, నక్కా చంద్ర, రావినేని రామారావు, నానబాల అంకయ్య, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం, మారెళ్ళ గ్రామాల మధ్య రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన మీనగ బ్రహ్మయ్య మారెళ్ళ వెళుతున్నాడు. ఈసమయంలో పూరిమెట్ల నుంచి సుంకరవారిపాలెం గ్రామానికి వస్తున్న మీసాల చిన సిద్ధయ్య ఎదురెదురుగా ఢీకొన్నారు. వీరిద్దరికి తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం బంధువులు అద్దంకి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తీసుకెళ్లారు. రహదారుల మీద ఉన్న చిల్లచెట్లు దట్టంగా పెరగటమే ప్రమాదానికి కారణమైందని వారి బంధువులు తెలిపారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

పామూరు, జూలై 7: మొహర్రం వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. వేకువజామున పెద్ద పీర్ల సరగత్తులను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోపాలపురం గ్రామానికి చెందిన పీర్లతో పామూరుకు చెందిన పీర్లు సలాములు అందుకొని వీడ్కోలు పలికాయి. బుధవారం జరుపుకొనే ప్రార్థనలతో మొహర్రం వేడుకలు సంపూర్ణంగా ముగుస్తాయని ముజావర్లు తెలిపారు.

డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులకు సన్మానం

ముండ్లమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఇటీవల విదేశాలకు వెళ్ళి సోమవారం స్వదేశానికి వచ్చారు. ఉదయం నియోజకవర్గ కేంద్రమైన దర్శికి రావటంతో మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు దిరిశాల శ్రీనివాసరావు, మామిళ్ళపల్లి కోటేశ్వరరావు, కంచుమాటి ఏడుకొండలు డాక్టర్ లక్ష్మి, లలితసాగర్‌లను భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను డాక్టర్ లక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేత రామారావు

ముండ్లమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ముండ్లమూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు బేతపూడి రామారావు సోమవారం నెల్లూరులో కలిశారు. ఇటీవల సూపర్ - 6 హామీల్లో భాగంగా తల్లికి వందనం పేరుతో నిధులు విడుదల చేసినందుకు లోకేశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. సోమవారం సీఎస్‌పురం మండలం చింతపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకుందాంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా దూరంగా ఉండాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'విధ్వంసం నుంచి కోలుకుంటున్న రాష్ట్రం'

తాళ్లూరు, జూలై7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం అన్నారు. సోమవారం మల్కాపురం, రజానగరం కుమ్మరి కాలనీల్లో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు పాలనాదక్షత వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ముందుకువచ్చి ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కాశీంసైదా, షేక్ కాలేషావలి, రాచకొండ వెంకట్రావు, కైపు నాగార్జునరెడ్డి, ఎస్.రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో మార్పువచ్చేలా పాలన

వెలిగండ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల్లో మార్పు వచ్చేవిధంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి అన్నారు. మండలంలోని వెలిగండ్ల, మరపగుంట్ల, కంకణంపాడు, మోగళ్లూరు పంచాయితీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్టానికి పూర్వవైభవం వచ్చిందన్నారు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, శ్రీను, మీనిగ కాశయ్య, ఒంగోలు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కురిచేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా క్రిష్ణమాదిగ జన్మదిన వేడుకలు, ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం కురిచేడులో ఘనంగా నిర్వహించారు. దర్శి రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో కంభంపాటి జోసెఫ్ మాదిగ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంచర్ల జ్ఞానసుందర్, బొంత ఏసుదాస్, కేసనపల్లి కోటేశ్వరరావు, కె.కె.ప్రశాంత్, బరిగెల రూత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కనిగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొత్తూరు, కందుకూరు రోడ్డులోని ఆజీస్‌పురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు బైకిస్టులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తూరు వడ్డెపాలెంలో నివాసం ఉంటున్న చల్లా వెంకటరామయ్య అనే వ్యక్తి కనిగిరి నుంచి వెళ్తూ కొత్తూరు ఎమ్మెస్సార్ విగ్రహం వద్ద సీఎస్‌పురం రోడ్డుకు మలుపు తిరుగుతుండగా పామూరు వైపు నుంచి వస్తున్న లారీ బైకిస్టును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి.

మరోప్రమాదంలో హైద్రాబాద్ నుంచి కనిగిరి మీదుగా కందుకూరు రోడ్డులో వెళ్తున్న యువకుడిని కనిగిరి మండలంలోని ఆజీస్‌పురం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు 108కు సమాచారం అందించగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెండుచోట్ల జరిగిన ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ఈ విషయంపై స్థానిక స్టేషన్‌లో ఎలాంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

'తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి'

ముండ్లమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదవి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం ముండ్లమూరులోని మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాల విడిచిన తరువాత బస్సుల కోసం నిలబడ్డారు. అటుగా వెళుతున్న డాక్టర్ లక్ష్మి కారులో నుంచి దిగి విద్యార్థులతో కరచాలనం చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడగగా ఇక్కడ పీడీగా పని చేస్తున్న కొండారు రామారావు(రాముడు)ను బదిలీ చేయవద్దని కోరారు. దీంతో డాక్టర్ లక్ష్మి స్పందించి మీ పాఠశాలలోనే పీడీ రామారావును ఉంచుతామని హామీ ఇచ్చారు. పాఠశాలలో జరుగుతున్న విషయాలు రెండు రోజుల క్రితమే తనకు తెలిశాయని పేర్కొన్నారు. మీకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూస్తానని తెలిపారు.

అనంతరం బస్సుల్లో స్వగ్రామాలకు వెళ్తున్న విద్యార్థులతో కరచాలనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, శంకరాపురం సర్పంచ్ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

వెలుగులివ్వని.. సూర్యఘర్!

- నత్తనడకన సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు
- లక్ష్యంలో పదిశాతం కూడా చేరుకోని వైనం
- మూడు జిల్లాల్లో అమర్చిన యూనిట్లు 6 వేల లోపే
- ప్రజలకు అవగాహన కల్పనలో అధికారుల విఫలం

విద్యుత్ బిల్లుల నుంచి వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యాలను చేరుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా.. దశల వారీగా ప్రతి ఇంటిని సోలార్ గొడుగు కిందకు తెచ్చేందుకు పనిచేస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరిలోనే ఈ పథకం పట్టాలెక్కినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక్కడ అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం సోలార్ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టిసారించి అడుగులేస్తోంది.



బాపట్ల పట్టణంలోని ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లను పరిశీలిస్తున్న అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):
పీఎం సూర్యఘర్ పథకం ద్వారా తొలి దశలో ఒక్కో నియోజకవర్గంలో పదివేల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. మూడు జిల్లాల పరిధిలో 5 లక్షల గృహాలను సోలార్ విద్యుత్ గొడుకు కిందకు తేవాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో అనేక బాలారిష్టాలకు తోడు.. అధికారుల నిర్లిప్తత కారణంగా.. ఈ పథకం అమలులో ఆశించిన స్థాయిలో వేగం కనబడడం లేదు. దీనికి తోడు ఆయా విభాగాల మధ్య సమన్వయ లోపం కూడా పీఎం సూర్యఘర్‌కు ప్రతిబంధకంగా మారింది.

పొంతన లేదు..

సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు.. ఆసక్తి కలిగిన వారిపేర్ల నమోదును గతేడాది చివరిలో ప్రారంభించి ఈ ఏడాది మార్చి వరకు కొనసాగించారు. తర్వాత ప్రక్రియలో దరఖాస్తులను స్వీకరించారు. మూడు జిల్లాల పరిధిలో పేర్లు నమోదు చేసుకున్న వారి సంఖ్య దాదాపు 2 లక్షల వరకు ఉంటే.. వచ్చిన దరఖాస్తుల సంఖ్య 60 వేల లోపే ఉండడం గమనార్హం. దీనికి సమాంతరంగానే.. ఈ పథకం కింద ఉచితానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గుర్తించే పనిని కూడా యంత్రాంగం చేపట్టింది.

అవగాహన కల్పించడంలో విఫలం

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటుకు.. లక్ష్యాలు చేరుకోవాలంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడమే కీలకమని ప్రభుత్వం ప్రారంభంలోనే గుర్తించింది. దీనికి అనుగుణంగా విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈపీడీసీఎల్ అధికారులతో పాటు సోలార్ ప్యానెళ్ల వెండర్లను భాగస్వాములను చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. కానీ ఈ దిశగా ప్రయత్నాలు చేసిన దాఖలాలు కనిపించలేదు

పెట్టుబడి వద్దే వెనుకడుగు..

నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉపయోగించే వారికి కిలో వాట్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా మార్గదర్శకాలు రూపొందించారు. ఈ యూనిట్‌కు మొత్తం రూ.60 వేలు ఖర్చు అవుతుండగా రూ.30 వేలు రాయితీ రూపంలో లబ్ధిదారులకు అందుతుంది. అలా యూనిట్ల వినియోగం పెరిగే కొద్ది

(మిగతా 6లో)

పండుగగా.. మెగా పేరెంట్స్ మీటింగ్

- బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశం పండుగ వాతావరణంలో జరపాలని కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. ఈ సమావేశం నిర్వహణపై సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులకు, ప్రజాప్రతినిధులకు ముందుగా సమాచారం పంపాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి, విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు గౌరవప్రదంగా వారిని ఆహ్వానించాలని స్పష్టం చేశారు. జూనియర్ కళాశాలల్లో కూడా కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క)పేరుతో విద్యార్థులు మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉంచామని మంగళవారం నాటికి నర్సరీల నుంచి ఆయా మండలాలకు చేరుతాయన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థుల ప్రగతి నివేదిక, హెల్త్‌కార్డుల పంపిణీ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం చేసి, పూర్వ విద్యార్థులను పిలిపించి వేదికపై మాట్లాడించాలన్నారు. ముందస్తుగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించాలని కలెక్టర్ వెంకట మురళీ దిశానిర్దేశం చేశారు. డీఈఓ ఎస్.పరుషోత్తం, సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీపీఓ ప్రభాకరరావు, అటవీశాఖాధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోర్సుకు హాజరైన పోలీసులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

పోలీసు విధుల్లో డ్రైవర్ బాధ్యత కీలకం

శిక్షణను ప్రారంభించిన ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధుల్లో డ్రైవర్ బాధ్యత కీలకమైనదని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం డ్రైవర్ ప్రొఫిషియెన్సీ స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ క్యాప్సూల్ కోర్సును ఆయన ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెళకువలను ఆచరించాలన్నారు. కుటుంబ బాధ్యతను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తతో వ్యవహరిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. మానవ తప్పిదం, వాహన నిర్వాహణ లోపాల వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ తన వాహన పరిస్థితిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసు విధులు ఎప్పుడు ఏ విధంగా ఉంటాయో.. ఊహించలేమని.. అత్యవసర పరిస్థితులలో సుదూర ప్రాంతాలకు అధికారులను, సిబ్బందిని తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. అలాంటి సమయాల్లో అలసట వల్ల నిద్రమత్తులోకి జారుకునే సమయంలో.. అధికారికి విషయం తెలిపి తక్షణం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సాధారణ మనిషి రెండు కళ్లతో.. చూస్తే పోలీసు వాహనం నడిపే డ్రైవర్ నాలుగు కళ్లతో చూసేంత అప్రమత్తత కలిగి ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి బ్యాచ్‌కు రెండు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ పి.విజయసారథి, మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ భాను వెంకటరంగారావు, ఎంటీఆర్ఐ శ్రీకాంత్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ



స్కాన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పీసీ పీఎన్‌డీటీ నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా అని తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కాల పరిమితిని తనిఖీ చేసి, హెచ్చరిక బోర్డులను సంబంధిత ప్రదేశాలలో ప్రదర్శించేట్లుగా చూడాలని నిర్వాహ కులకు ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ మనోజ్, బి.మరియమ్మ పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- 11 మందికి గాయాలు

మార్టూరు,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామంలో పిచ్చికుక్క సోమవారం స్వైర విహారం చేసింది. వేకువజామునే ఇళ్ల నుంచి బయటకు వచ్చిన వారిని, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లేవారిపై దాడిచేసింది. 11 మంది కుక్క కాటుకు గుర య్యారు. గాయపడిన వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. ఎక్కువ మంది ముఖంపై కుక్క దాడి చేసి గాయపరచింది. వారందరూ చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి చేరారు. వారిలో ఇద్దరు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అదేవిధంగా గత ఆదివారం మండలంలోని ద్రోణాదుల గ్రామంలో కూడా లక్ష్మీకుమార్ అనే యువకుడు కుక్క కాటుకు గురవ్వగా.. సోమవా రం కూడా ఇదే గ్రామంలో మరో మహిళ కుక్క కాటు కు గురైంది. కోలలపూడి ఎస్సీ కాలనీలో పిచ్చి కుక్కను స్థానికులు కొట్టి చంపివేసినట్లు తెలిసింది.

- నేడు ఐదు కొత్త బస్సులు ప్రారంభం
- పాల్గొననున్న మంత్రులు గొట్టిపాటి, మండిపల్లి
- శిథిలావస్థకు ఆర్టీసీ బస్టాండ్.. తగ్గిన బస్సు సర్వీసులు
- ప్రత్యేక దృష్టిసారించిన మంత్రి రవికుమార్



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి డిపోకు.. మహర్దశ పట్టేనా?



అద్దంకి,జూలై 7(ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీ డిపోకి మహర్దశ పట్టనుందని ప్రజలు, అధికారులు భావిస్తున్నారు. గత ఐదారేళ్లలో పూర్తిగా గాడి తప్పిన డిపోపై ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టిసారించడం ఇందుకు కారణం. మంగళవారం అద్దంకి ఆర్టీసీ డిపోలో కొత్తగా ఐదు బస్సులను ప్రారంభించేందుకు రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. దశాబ్దం క్రితం అద్దంకి డిపోలో మొత్తం 80 బస్సుల వరకు ఉండేవి. ప్రస్తుతం అద్దె బస్సులతో కలిపి 63 మాత్రమే ఉన్నాయి. సుమారు 20 బస్సు సర్వీసులు ఇతర డిపోలకు వెళ్లి పోయాయి. ఇక ఉన్న వాటిలో కూడా డజను వరకు వారంలో మూడు, నాలుగు రోజులకే పరిమితం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆదివారం, మంగళవారం, శు క్రవారంతో పాటు పండుగ రోజుల్లో పలు సర్వీసులను అర్ధంతరంగా రద్దు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇక గతంలో వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న 20 నైట్ హాల్ట్ బస్సులు.. ప్రస్తుతం రెండింటికి పరిమితమయ్యాయి. వాటిల్లో ఒకటి దర్శి, మరొకటి వలపర్లలో ఉంటోంది. అత్యధిక కలెక్షన్‌లు వచ్చే చిలకలూరిపేట, ఇంకొల్లు తదితర రూట్లలో నైట్‌హాల్ట్ సర్వీసులను సైతం రద్దు చేశారు. కోవిడ్ సమయంలో రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. వైదన, చిలకలూరిపేట, తాళ్ళూరు, బొద్దికూరపాడు వైపు వెళ్లే బస్సులు ఉదయం వరకే పరిమితం అవుతున్నాయి. ఉదయం అద్దంకి వచ్చిన ప్రయాణికులు సాయంత్రం ఇళ్లకు వెళ్లే అవకాశం కూడా ఉండదు. ఇక మణికేశ్వరం, బి. నిడమానూరు, బొమ్మనంపాడు తదితర రూట్లలో బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 33 గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. ఇక దూర ప్రాంతాలకు నడిపే సర్వీసులలో బెంగళూరు, చెన్నై బస్సులను పూర్తిగా రద్దు చేశారు. హైదరాబాద్‌కు గతంలో నాలుగు సర్వీసులు ఉండగా.. రెండు సర్వీసులకు పరిమితం అయ్యాయి.

శిథిలావస్థకు బస్టాండ్..

అద్దంకిలో 1986లో ఆర్టీసీ బస్టాండ్, డిపో నిర్మాణం జరిగింది. 40 ఏళ్ల బస్టాండ్ భవనం తరచూ పెచ్చులూడి పడుతోంది. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్‌కు రంగులు వేసి సింగారించారు. దీనిని చూసిన ప్రయాణికులు నివ్వెరబోతున్నారు.

నేడు ఐదు బస్సులు ప్రారంభం

అద్దంకి డిపో నుంచి హైదరాబాద్, శ్రీశైలంకు నడుపుతున్న బస్సుల స్థానంలో రెండు సూపర్‌లగ్జరీ, మూడు ఎక్స్‌ప్రెస్ కొత్త బస్సులను ఏర్పాటు చేశారు. వీటిని రాష్ట్ర రవాణాశాఖ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు తెలిపారు.

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

- ఎస్పీ తుషార్ డూడి
- పీజీఆర్ఎస్‌కు 55 అర్జీలు

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కు అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన 55 మంది అర్జీలు అందజేసి సమస్యలు వివరించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తీతగాదాలు, స్థలవివాదాలు, ఇతర సమస్యలపై వచ్చిన ప్రజల అభ్యర్ధనను ఎస్పీ కూలంకుశంగా విని అర్జీలను పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ మోయిన్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

కరిగిపోతున్న.. సాగు కాలం!

ఖరీఫ్ సాగు కాలం కరిగిపోతోంది. దుక్కులు దున్ని.. రైతులు విత్తు కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. మేలో ఊరించిన వర్షాలు జూన్‌లో ముఖం చాటేశాయి. నైరుతి నిరాశ పరిచింది. సాగు సందిగ్ధంలో పడటంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 71 మండలాలకు 66 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. కేవలం ఐదు మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదైంది. వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.



- ఖరీఫ్‌పై ప్రభావం చూపుతున్న వరుణుడు
- 66 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- విత్తు కోసం ఆకాశం వైపు రైతుల చూపు
- నైరుతీ నిరాశ.. సంక్షోభంలో సాగు

(కొల్లూరు, ఆంధ్రజ్యోతి)
ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో 4,53,205, బాపట్ల జిల్లాలో 2,80,353, గుంటూరు జిల్లాలో 2,25,525 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తారని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. సీజన్ ప్రారంభమై వారాలు గుడుస్తున్నా ఇంకా వ్యవసాయం ఊపందుకోలేదు. మేలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో 15,650, బాపట్లలో 863, గుంటూరులో 1,905 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇక పల్నాడులో బోరు బావుల కింద పత్తి సాగు చేపట్టారు.

- పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్ల మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగతా 27 మండలాల్లో వర్షాభావం ఏర్పడింది. 15 మండలాల్లో అత్యధిక లోటు, 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు 108 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 41.9 మి.మీ వర్షపాతం

(మిగతా 6లో)

జిల్లాల వారీగా నమోదైన వర్షపాతం మీమీలలో..

జిల్లా	సాధారణం	నమోదైంది	లోటు శాతం
పల్నాడు	108	41.9	61.2
బాపట్ల	94.2	51.1	45.8
గుంటూరు	131.1	68.3	47.9

తాగునీరు, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తా

బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో జాప్యంపై ఉగ్ర ఫిర్యాదు

రెండు సామాజికవర్గాల ప్రజలను మరింత ఆకట్టుకోవాలి

మీ పరిస్థితి బాగుంది.. పార్టీ కమిటీలను ఇంకా పటిష్ఠం చేయండి

ఎమ్మెల్యే ఉగ్రకు సీఎం హామీ

కనిగిరి నియోజకవర్గంపై చంద్రబాబు సమీక్ష

ఒంగోలు, ఆంధ్రజ్యోతి

తొలి ఏడాదిలో ఎమ్మెల్యేల పనితీరును ఆయా నియోజకవర్గాల్లో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కనిగిరిపై సోమవారం రాత్రి అమరావతిలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి నియోజకవర్గ పరిస్థితులను చెప్పారు. అందిన సమాచారం మేరకు.. నియోజకవర్గంలో తాగునీరు, రోడ్ల సమస్య విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. తాగునీటి పథకం ప్రతిపాదనను ఎమ్మెల్యే ఉగ్ర సీఎంకు వివరించారు. వాటిని అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందన్న విషయం ప్రస్తావించగా, రిలయన్స్ సంస్థ చేపట్టిన బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరగడంలేదని డాక్టర్ ఉగ్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అలాంటివి మరికొన్ని ప్రాజెక్ట్‌లు ఇవ్వాలని ఉగ్ర కోరారు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటీ, వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కూడా వారి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. తదనంతరం తన వద్ద నివేదిక ఆధారంగా రాజకీయ అంశాలను కూడా సీఎం సమీక్ష చేశారు. 'నియోజకవర్గంలో మీరు అందుబాటులో ఉంటున్నారు.. మధ్యలో మీరు కొన్ని రోజులు లేరన్న' విషయాన్ని సీఎం ప్రస్తావించారు. మహానాడు నిర్వహణకు కడప, యోగాంధ్ర కార్యక్రమ పనులపై విశాఖ వెళ్లినందున ఆ కొద్ది రోజులు నియోజకవర్గంలో లేనని ఉగ్ర వివరించారు. రెండు సామాజికవర్గాల ప్రజలను రాజకీయంగా మరింత చేరువచేసుకోవాల్సిన అవసరాన్ని సీఎం ఉగ్రకు తెలిపారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు మందా కృష్ణమాదిగను కూడా నియోజకవర్గానికి ఆహ్వానించి కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని సీఎం సూచించినట్లు తెలిసింది. మరో సామాజిక వర్గ ఓటర్లలో రాజకీయంగా నిలకడ కనపడలేదని, అందుకు కారణాలను గుర్తించి వారిలో పలుకుబడిని పెంచుకునేందుకు కృషి చేయాలని ఉగ్రకు సూచించినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాల నిర్వహణ ప్రజా సంబంధాలు కొనసాగింపులో ఉగ్ర పనితీరును కొనియాడిన ఆయన పార్టీ అనుబంధ సంస్థల నియామకాలను పూర్తి చేయకపోవడంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఒక మండలంలో నాయకులు, కార్యకర్తల మధ్య గ్యాప్ పెరిగిందని, వెంటనే సరిచేయాలని తన వద్ద ఉన్న సమాచారం ఆధారంగా ఆదేశించినట్లు తెలిసింది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



టీపీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి స్వామి

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

సింగరాయకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమనీ, ఈ రెండింటినీ రాష్ట్రంలో సమపాళ్లలో పరుగులు పెట్టిస్తున్నామనీ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని టీపీనగర్‌లో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని, అందించిన సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.4వేలుకి పెంచామని, దీపం పథకం కింద మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలెండర్లు అందజేశామని, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.13వేలు చొప్పున వారి తల్లుల ఖాతాకు జమచేశామని తెలిపారు. ఈనెలలో అన్నదాత సుఖీభవ పథకం తొలివిడత కింద రూ.7వేలు రైతుల ఖాతాకు జమచేయనున్నట్లు వివరించారు. వచ్చే నెల ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే డిగ్రీ చదవి నిరోద్యుగులుగా ఉన్న యువతకు నిరుద్యోగభృతి అందజేస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ అసమర్థ పాలన వల్ల అమరావతి నిర్మాణం రూ.6వేల కోట్లు పోలవరం వ్యయం రూ.2వేల కోట్లు పెరిగిందని తెలిపారు. 30 ఏళ్లు అధికారంలో ఉంటామని విర్రవీగిన జగన్‌రెడ్డిని 11 సీట్లకు పరిమితం చేసి ప్రజలు దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడారన్నారు. అధికారం కోల్పోయిన తరువాత పరామర్శల పేరుతో ప్రజల ప్రాణాల తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంతపార్టీ కార్యకర్త కారు కింద తొక్కి శవాన్ని పక్కకు లాగేసి పడేసి వెళ్లిపోయారంటే జగన్ క్రూరమైన నైజాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. ఇనాం భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకొవచ్చునని అన్నారు. పాకల రైల్వేగేట్ వద్ద ఫ్లైవోవర్ నిర్మాణానికి కృషిచేస్తామని తెలిపారు. అనంతరం కాలనీలో రూ.28 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులు, సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, సుదర్శి చంటి, గాలి హరిబాబు, వేల్పుల వెంకట్రావు, బ్రహ్మేశ్వరరావు, రాంబాబు, గుదే వెంకటేశ్వర్లు, గిరి, పులి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ప్రజల అర్జీలు

టంగుటూరు (కొండపి), జూలై7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామికి సోమవారం ఉదయం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. తమ పిల్లలకు వివిధ స్కూళ్లలో చదువుకోవడానికి ఉచితంగా సీట్లు ఇప్పించాలని కోరుతూ ఎక్కువ మంది మంత్రిని కలిశారు. తమ స్వగ్రామాల నుంచి దూరప్రాంత స్కూళ్లలో సీట్లు వచ్చాయని, అవకాశం ఉంటే దగ్గర స్కూళ్లలో సీట్లు ఇప్పించాలని పలువురు తల్లిదండ్రులు కోరారు. కస్తూర్బా, ఇతర స్కూళ్లలో ఇంటర్ సీట్లు ఇప్పించాలని మంత్రిని కలిసి పలువురు విజ్ఞప్తి చేశారు. కొండపి మండలం జాళ్లపాలెం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తన ప్రభుత్వ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన రావెళ్ల రమేష్ మంత్రిని కలిసి అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ సాయం అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఏకేయూలో కొత్త అడ్మిన్లు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు విద్య, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీలో కొత్తగా పరిపాలనాధికారులు(అడ్మిన్లు)గా నియమితులైన వారు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్శిటీ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నిర్మలామణి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాజమోహన్‌రావు యూనివర్శిటీ ఓఎస్‌డీగా, సీడీసీ డీన్‌గా పనిచేస్తున్న జీ సోమశేఖర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, ఇప్పటి వరకు సీఈగా పనిచేసిన కేవీఎన్ రాజు సీడీసీ డీన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారిని యూనివర్శిటీ అధ్యాపకులు అభినందించారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాల పెంపునకు చర్యలు

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, పీఎం రమేష్



పంగులూరు మార్కెట్‌యార్డ్‌లో మాట్లాడుతున్న డీఎం, కరుణశ్రీ, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్

పంగులూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పంగులూరు మార్కెట్‌యార్డ్‌లోని నల్లబర్లీ కొనుగోలు కేంద్రంలో రోజువారీ కొనుగోలు చేసే బేళ్లసంఖ్య ఐదువందలకు పెంచేవిధంగా చర్యలు చేపట్టినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ చెప్పారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో సోమవారం సాయంత్రం నల్లబర్లీ కొనుగోళ్లకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు వెయ్యి బేళ్లను కొనుగోలు చేసినట్లు కరుణశ్రీ తెలిపారు. యార్డ్‌లో కొనుగోలు చేసిన బేళ్లను నిల్వ చేసేందుకు కొత్త గోడౌన్ సిద్ధం చేశామన్నారు. రోజువారీ కొనుగోళ్లను ఐదు వందల బేళ్లకు పెంచనున్నట్లు తెలిపారు. రైతులు తమకు వచ్చిన మెసేజ్‌ల ఆధారంగా ఫోన్ చేసి క్రమపద్ధతిలో రిజిస్ట్రేషన్ ప్రకారం కొనుగోళ్లు చేపడుతున్నట్లు డీఎం కరుణశ్రీ చెప్పారు. రైతు రిజిస్ట్రేషన్ టైమింగ్‌తో పాటు మండె వద్ద దిగిన ఫొటో మ్యాచింగ్ అయిన రైతులకు వరుస వారీ సందేశాలు కంప్యూటర్ ద్వారా జనరేట్ అవుతున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రం పరిధిలోని రైతులందరికీ బేళ్ల అమ్మకానికి అవకాశం వచ్చేలా షెడ్యూల్ రూపొందించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఎం వివరించారు.

మరోమూడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

కొరిశపాడు మండలం తమ్మవరం, మార్టూరు, చినగంజాంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎం కరుణశ్రీ తెలిపారు. ఆ మేరకు అక్కడ గోడౌన్లను గుర్తించినట్లు వివరించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన రైతులకు 48 గంటలలో నగదు జమచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

నిబంధనలు పాటించకుంటేనే తిరస్కరణ : ప్రాజెక్టు మేనేజర్ రమేష్

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే బేళ్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటే తప్పక కొనుగోలు చేస్తామని, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ తెలిపారు. తేమ 20 శాతానికి మించరాదన్నారు. పండుగుళ్ల మిక్స్ చేయరాదని, బూజు కనిపించే లోగ్రేడ్, తెల్లగా కుళ్లిన ఆకులు చెక్కులో కనిపించకూడదన్నారు. అలా ఉంటేనే వాటిని కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఏపీఎం సుబ్రహ్మణ్యం, ఏవో సుబ్బారెడ్డి, సీఈవో నాగబోయిన లక్ష్మి, తహసీల్దార్ సింగారావు, రైతుసంఘం నాయకులు రామారావు, టీడీపీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

అదనంగా గోడౌన్‌లను సేకరించాలి

అదనపు గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు, జులై 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు గోడౌన్‌లను గుర్తించి, పొగాకు కొనుగోలును మరింత వేగవంతం చేయనున్నట్లు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డు, స్టేట్ వేర్ హౌస్ గోడౌన్లలో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ అధికారులతో కలసి పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన పొగాకు నిల్వల నేపథ్యంలో అదనంగా గోడౌన్‌లను సేకరించే విధంగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అనంతరం అదనపు గోడౌన్‌ల గుర్తించి, అధికారులు, స్థానిక నేతలతో చర్చించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ, మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్, తహసీల్దార్ బ్రహ్మయ్య, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆంక్షలు పెడితే పొగాకు రైతులకు నష్టం

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

ఇంకొల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలులో అధికారులు ఆంక్షలు పెడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య చెప్పారు. ఇంకొల్లు మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రంగు మారిందనే సాకుతో నాణ్యమైన పొగాకుకు సైతం ధర తగ్గిస్తున్నారన్నారు. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడితే నష్టపోతారన్నారు. రైతులు వద్ద ఉన్న పొగాకు అంతా సరసమైన ధరకు కొనుగోలు చేయాలని డిమాండు చేశారు. ధర తక్కువ వేస్తున్నారని సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పెషల్ కలెక్టర్ లవన్న మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బయ్యర్లతో మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, యార్డు సిబ్బంది ఉన్నారు.



ఇంకొల్లులో రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌ను పండుగలా నిర్వహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ, డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్,జూలై 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 10వతేదీన జరగనున్న మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నదన్నారు. జిల్లాలోని 2,955 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 188 జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, అక్కడ చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న గొప్ప వ్యక్తులను కూడా ఈ టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌కు ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వమార్గదర్శకాల ప్రకారం ఈ సమావేశాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించాలన్నారు. తల్లికి వందనంకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించి వారి ఖాతాల్లో డబ్బులు జమ ఆయ్యేలా చర్యలు తీసుకోవాలని గోపాలకృష్ణ ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు కిరణ్‌కుమార్, లక్ష్మానాయక్, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మాదిగల అభివృద్ధి



విజయనగర్ కాలనీలో జెండా ఆవిష్కరణలో ప్రతినిధులు

విజయనగర్‌కాలనీ(చీరాల), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని, సుమారుగా 30 ఏళ్ల కోరిక కూటమి ప్రభుత్వంతో సఫలీకృతమైందని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, పలువురు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, వీహెచ్‌పిఎస్ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని విజయనగర్‌కాలనీలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. అందుకు సంబంధించిన జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, పెంచలయ్య, తేళ్ల రాంబాబు, అశోక్, రమేష్, నాగేశ్వరరావు, వందనం, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

బల్లికురవ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యలపై ఈ నెల 9 తలపెట్టిన దేవవ్యాప్త సార్వత్రిక సమ్మెను ప్రజలు అధికంగా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం బల్లికురవలో సార్వత్రిక సమ్మెపై పార్టీ నేతలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ ఈసందర్భంగా వారు మాట్లాడుతు కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను కాలరాసేలా లేబర్ కోడ్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకు రావటం హేయమైన చర్య అన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అద్యక్షులు గొల్లపూడి అంజయ్య, పావులూరి రమణయ్య, కమిటీ సభ్యులు బొంతా వీరయ్య, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో యువతి బంధువులపై దాడి

● ఇరువురికి గాయాలు

ఒంగోలు క్రైం,జూలై7(ఆంధ్రజ్యోతి): తన ప్రేమకు అడ్డుపడుతున్నారంటూ ఓ యువకుడు యువతి బంధువులపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన కర్నూల్ రోడ్డులో ఓ హోటల్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. ఆంధ్రకేసరి నగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువతిని ప్రేమించాను అంటూ ఆనంద్ అనే యువకుడు ఆదివారం అక్కడికి వెళ్లాడు. దీంతో ఆ యువతి సోదరుడు హేమంత్ హెచ్చరించాడు దీంతో రెచ్చిపోయిన ఆనంద్ సోమవారం రాత్రి పెద్ద బాకుతీసు కొని వెళ్లి కర్నూల్ రోడ్డులో ఉన్నహేమంత్‌పై దాడికి దిగాడు.హేమంత్ తన మామ రమేష్‌ను పిలిచాడు. దీంతో ఆనంద్ రమేష్‌పై బాకును విసిరడంతో తలకు గాయం అయ్యింది. అదే సమయంలో హేమంత్‌కు గాయాలయ్యాయి. వీరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆనంద్ మాత్రం రిమ్స్‌కు వెళ్లి తనకు గాయాలయ్యాయి అని ఫిర్యాదు చేశాడు. ఈమేరకు తాలూకా పోలీసులు విచారణ చేసున్నారు.

అవీఇవీ

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఒంగోలు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫెన్సింగ్ ఒలింపిక్ పోటీలకు ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. తమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బీవీ సౌమస్విశ్రీ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో ప్రథమ స్థానంలో విజయం సాధించగా, ముంబైలో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే డి. చరణ్, డి. ప్రియ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచారని వీరు కూడా ముంబైలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడల్లో రాణించడం మరింత ఆనందంగా ఉందని జగదీష్ పేర్కొన్నారు.

వెలుగులివ్వని..'సూర్యఘర్'!

(5వ పేజీ తరువాయి)

కిలోవాట్ల లెక్కన రాయితీలిస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో రాయితీ పో నూ.. మిగిలిన మొత్తం పెట్టే ఖర్చు అధికంగా ఉండడం వల్లే గృహ యజమానులు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు వెనకడుగు వేస్తున్నారు. సోలర్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు తో.. 20 ఏళ్ల పాటు కరెంటు బిల్లులు చెల్లించనవసరం ఉండదనే విషయాన్ని వినియోగదారులకు చేరువ చేయడంలో యంత్రాంగం వైఫల్యం కూడా ఇక్కడ కనపడుతోంది. సోలార్ ప్యానెళ్లు ఈదురుగాలులు వచ్చి దెబ్బతింటే అందించే సర్వీసు పైనా స్పష్టత లేదు.

మూడు జిల్లాల పరిధిలో 6 వేల లోపే..

పీఎం సూర్యఘర్ పథకం గడువు 2025-26 ఆర్థిక సంవత్సరం వరకేనని కేంద్రం ప్రకటించింది. కానీ, మరో ఏడాది గడువు పొడిగించారని అధికారులు చెబుతు న్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం వచ్చిన దరఖాస్తుల్లో 40 శాతం ఇళ్లకు ఇప్పటికే సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తి కావాల్సి ఉంది. అంటే మూడు జిల్లాల పరిధిలో 20 వేల ఇళ్లకు సోలార్ ప్యానె ళ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయి గణాం కాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేవలం 1,600 ఇళ్లకే సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చగా గుంటూరు, పల్నాడు జిల్లాలు కలిపి ఈ సంఖ్య 4,400గా ఉంది.

కరిగిపోతున్న సాగు కాలం!

(5వ పేజీ తరువాయి)

నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. 61.2 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

● బాపట్ల జిల్లాలో 94.20 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 51.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 45.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 25 మండలాలకు.. 11 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం, 12 మండలాల్లో లోటు, కర్లపాలెం మండలంలో సాధారణ, నిజామపట్నం మండలంలో అధిక వర్షపాతం నమోదైంది.

● గుంటూరు జిల్లాలో 47.9 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు 131.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 68.3 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం, తొమ్మిది మండలాల్లో లోటు, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

గతేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నిండటంతో పంటలను విస్తృతంగా సాగు చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. వర్షాలు కురిపించాలని వరుణుడిని రైతులు ప్రార్థిస్తున్నారు.

పురుగుమందు తాగిన సివిల్ ఇంజనీర్ మృతి

ఈపూరుపాలెం(చీరాల), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవు తీరంలో పురుగుల మందు తాగిన మార్టూరు మండలం కోలలపూడి గ్రామానికి చెందిన బొబ్బేపల్లి అనీల్‌కుమార్ (23) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండి, మనస్థాపానికి గురైన అనీల్ గత శుక్రవారం పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి చీరాలలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో వైద్యం పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

అక్కయ్యపాలెం(చీరాల), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. సోమవారం వేటపాలెం మండల పరిధిలోని అక్కయ్యపాలెం గ్రామం జేవీకే కాలనీలో పునర్నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ఎస్టీ కాలనీ వాసులకు నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రాగ్రూపు నగదును నొక్కేశారు

● జేసీకి దేవరంపాడు మహిళల ఫిర్యాదు

● విచారణ చేయిస్తానని హామీ



గ్రీవెన్స్‌లో జేసీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన డ్వాక్రా మహిళలు

ఒంగోలు(రూరల్),జూలై7(ఆంధ్రజ్యోతి): వెలుగు బుక్ కీపర్, సీసీ, ఏపీఎంలు కుమ్మకై బ్యాంకులో ఉన్న డ్వాక్రా గ్రూపు నగదు రూ. 50 లక్షలను నొక్కేశారని ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామ ఎస్సీ డ్వాక్రా గ్రూపు మహిళలు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ ఆర్. గోపాలకృష్ణకు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళలు మాట్లాడుతూ నాటి వెలుగు సీసీ సాంబయ్య, ఏపీఎం గోపి ,బుక్ కీపర్ దర్శి సుజాత బ్యాంక్‌లోని రూ. 50లక్షలను అక్రమంగా డ్రా చేసుకున్నారని, అధికారులు చర్యలు తీసుకొని వారి నుంచి నగదును రికవరీ చేయించాలని వారు విజ్ఞప్తిచేశారు. దీనిపై జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించి నగదు రికవరీ చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. అలాగే డీఆర్‌డీఏ పీడీని రికార్డులు విజిలెన్స్ అధికారులకు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరంపాడు గ్రామ ఎస్సీకాలనీ మహిళలు బొమ్మల రత్తమ్మ, కొక్కెల గడ్డ కవిత, కనుమూరి మారతమ్మ, దాసరి సుజాత, బి.సజీవరాణి, కె.కోటేశ్వరి, కె.నాగరత్నం, కొమ్ము విజయమ్మ, బత్తుల విజయ, కనుమూరి దేవమ్మ, కె. కరుణమ్మ, కే స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

టీడీపీ జెండావిష్కరణ ఏర్పాట్లలో స్వల్ప వివాదం

● రెండు వర్గాలు అధికారపార్టీకి చెందిన వారు కావడం విశేషం


చెదరగొట్టిన అనంతరం జెండా దిమ్మె

చీరాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పుర పాలక సంఘం పరిధిలోని రామనగర్‌లో టీడీపీ జెండావిష్కరణ కోసం చేస్తున్న ఏర్పాట్లులో సోమవారం స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కొండయ్య సోమవారం పర్యటన వార్డులో ఉండటంతో స్థానిక నేతలు జెండా ఆవిష్కరించేందుకు కమ్యూనిటీ హాలు సమీపంలో రోడ్డు అంచులో టీడీపీ నాయకులు దిమ్మె ఏర్పాటు చేశారు. అయితే ఆ నేతలకు చెందిన బంధువులు ఆ స్థలం తమదంటూ అక్కడ జెండావిష్కరణ సబబు కాదని అభ్యంతరం తెలిపారు. అలాగే మున్సిపల్ అధికారులు మాత్రం స్థలం ఆర్‌అండ్‌బీకి చెందినదిగా చెబుతున్నారు. ఈ క్రమంలో జెండా ఏర్పాటు ఇక్కడ తాత్కాలికమా..? శాశ్వతమా..? అన్న ఇరువర్గాలు చర్చించినట్లు సమాచారం. అయితే సోమవారం ఉదయానికి దిమ్మె చెదరగొట్టి ఉండటంతో స్వల్ప ఆందోళన వాతావరణం నెలకొంది. అయితే రెండు వర్గాలు అధికార పార్టీకి చెందిన వారు పైగా బంధువుల కావడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తిమృతి


మృతిచెందిన మల్లికార్జునరావు

పంగులూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో రామకూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని నల్లపాటి మల్లికార్జునరావు(44) మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకొంది. మల్లికార్జునరావు భార్య పుట్టినిల్లు వెల్లలచెరువు. రెండు గ్రామాలలో మల్లికార్జునరావు ట్రాక్టర్‌తో వ్యవసాయం చేస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు. సోమవారం పుట్టావారిపాలెం నుండి వినుకొండవైపు వెళ్లే క్రమంలో వెల్లలచెరువు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో మల్లికార్జునరావు దానికిందపడి మరణించినట్లు సమాచారం. మృతునికి భార్య సుశ్మిత కుమారుడు కుమార్తె ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం

అద్దంకిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవి ధన్వంతరి ఆధ్వర్యంలో శ్రీరామవృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదానం నిర్వహించారు. సామా రాము, సుధారాణిల పిల్లలు రాముగురు, జివ్వాజి రూపాంజిలి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, సీనియర్ నాయకులు తమ్మన శ్రీనివాసరావు, కర్రి శ్రీలక్ష్మి, రంగయ్య, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ఎంఈవో

అద్దంకిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ అందిస్తున్న సహాయసహకారాలను సద్వినియోగపర్చు కోవాలని ఎంఈవో ఏ.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నోట్ పుస్తకాలు అందజేశారు. విశ్రాంత హెచ్‌ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పుట్టిన రోజు సందర్భంగా ఆయన సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా దాత సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పురుషోత్తమ్మ, రోటరీ క్లబ్ కార్యదర్శి అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ గుణశేఖర్, చప్పిడి వీరయ్య, మురళి సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో లేకుంటే చర్యలు

బల్లికురవ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవు అని ఎంపీడీవో కుసుమకుమారి హెచ్చరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' లో సచివాలయాలపై కొరవడిన పర్యవేక్షణ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో స్పందించారు. వేమవరం కార్యదర్శిని కార్యాలయానికి పిలిపించి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా కార్యాలయాలకు గైర్హాజరైతే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్ల వెంబడి ఉన్న చెత్తను ట్రాక్టర్ల ద్వారా గ్రామానికి దూరంగా పడవేయిస్తున్నామని ప్రజలు కూడా ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు వేయకుండా అధికారులకు సహకరించాలని కోరారు.

విద్యాజ్యోతి ద్వారా ప్రత్యేక తరగతులు

బల్లికురవ, జూలై 7 (ఆంధ్ర జ్యోతి) : బడిమానిన బాలికలకు ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూని యర్ కళాశాలలో విద్యాజ్యోతి పథకం ద్వారా ప్రత్యేక తరగ తులు నిర్వహిస్తామని జిల్లా సమగ్ర శిక్ష జీసీడీవో చారులత పేర్కొన్నారు. సోమవారం బల్లికు రవ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులతో అమె మాట్లాడారు. విద్యాజ్యోతి ద్వారా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగలు నిర్వహించి వారికి స్లిప్ టెస్ట్ నిర్వహించాలన్నారు. అలానే 6 నుండి 9 తరగతులు బాలికలకు రోజు మార్చి రోజు పరిక్షలు నిర్వహించాలని సూచించారు. చదువులో వెనకబడి ఉన్న బాలికలను సెప్టెం బరు నాటికి ముందు ఉండేలా వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాల న్నారు. ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలల మాదిరిగా అన్ని వసతులను ఏర్పాటు చేస్తోందని విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలన్నారు. ఈ తనిఖీలో ప్రిన్సిపాల్ సరళకుమారి ఉన్నారు.

ఇంకొల్లులో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'

ఇంకొల్లు, జూలై 7,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులోని కోదండరామ పంక్షన్ హాల్‌లో వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసుధనరెడ్డి వై.ఎస్.రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిన్నిపూర్ణ, మండల పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీ

● వాహన సముదాయల వద్ద ఇష్టానుసారం పార్కింగ్ ● విద్యాసంస్థల వద్ద వాహనాలు నిలిపి ఆకతాయిల తిష్ఠ


పట్టణంలో బస్ కోసం రోడ్డు దాటుతున్న విద్యార్థినులు

చీరాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగింది. ఈక్రమంలో వాహనదారులు కూడా ఇష్టారీతిగా ప్రయాణాలు సాగిస్తూ, ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌లు చేస్తూ ప్రజలకు ఆటంకాలు కలిగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచూ ఏదోమూల రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే సాయంత్రమైతే గడియార స్తంభం కూడలిలో పెద్దఎత్తున కార్లు సైతం పార్కింగ్‌లు చేస్తూ షాపింగ్‌లకు వెళతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కళాశాలలు ఉన్నాయి. వీటిలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. స్కూలు ముగిశాక, రోడ్లు దాటాల్సి ఉంది. దీంతో ఆయా విద్యాలయాల వద్ద ఆకతాయిలు హద్దులు దాటుతున్నారు. ఏకంగా పెద్ద పెద్ద ద్విచక్ర వాహనాలతో బీభత్సం సృష్టిస్తున్నారు. అతివేగంతో వాహనాలు నడుపుతూ షాట్స్ పేలుస్తు చిన్నారులను భయాందోళనకు గురి చేస్తున్నారు. దీంతో చిన్నారులు సైతం ఒకింత అసౌకర్యానికి గురవుతున్నారు. ఈక్రమంలో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదా లు జరుగుతాయోనని, చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది కొన్నిచోట్ల సిబ్బంది ని ఉంచి భద్రత చర్యలు చేపట్టారు. అయితే వీటి సంఖ్య మరింత పెంచా ల్సి ఉండటంతో పాటు ముఖ్యమైన ప్రదేశాల్లో స్పీడు బ్రేకర్స్ నిర్మించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది. అలాగే స్కూళ్ల వద్ద రెక్కీలు నిర్వహించి బాలికలను ఇబ్బందులకు గురి చేస్తున్న అల్లరి మూకలకు బుద్ధి చెప్పాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాల వేగంపై ప్రత్యేక దృష్టి




పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. అందుకు సంబంధించి ఉన్నతాధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అలాగే పాఠశాలల వద్ద చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాము. స్పీడ్ నియంత్రిస్తే సర్వ సాధారణంగా ఇబ్బందులు తొలుగుతాయి. స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుకు కృషి చేస్తాము. అల్లరి మూకలను నియంత్రిస్తాం.

\- సూరేపల్లి సుబ్బారావు, సీఐ వన్‌టౌన్

భవనాశి చెరువు కట్టను కమ్మేసిన చిల్లచెట్లు


కట్టపై పెరిగిన చిల్లచెట్లు

అద్దంకి, జూలై7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెద్ద చెరువులలో ఒకటైన భవనాసి చెరువు నిరాదరణకు గురైంది. వైసీపీ ప్రభుత్వంలోని ఐదు సంవత్సరాలలో కనీసం చెరువు కట్ట పై ఉన్న చిల్ల చెట్లు ను కూడా తొలగించలేదు. కొండ అంచు నుండి చ క్రాయపాలెం సమీపంలోని అలుగు వరకు చెరువు కట్ట ఉంది. చెరువు కట్ట కింద నామ్ రోడ్డు నిర్మాణం జరిగింది. చెరువు కట్ట కు రెండు వైపులా దట్టంగా చిల్లచెట్లు పెరగటంతో రైతులు, జాలర్లు చెరువు కట్ట మీదుగా రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది. దీంతో ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వలో సాగునీటి సంఘాలకు నీటి విడుదల చేసిన నేపథ్యంలో భవనాసి కాలువలతో పాటు చెరువు కట్ట పై ఉన్న జంగిల్ తొలగించేలా చర్యలు చేపట్టాలని రైతులు, జాలర్లు కోరుతున్నారు.


భవనాసి చెరువు కట్ట వ్యూ

పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి


సుపరిపాలన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని, ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలన కార్యక్రమం సోమవారం పురపాలక సంఘం పరిధిలోని 1, 2 వార్డులలో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఏడాది కాలంలో అందించిన సంక్షేమాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే ప్రజల నుండి అందిన అర్జీలను స్వీకరించారు. అంతేకాకుండా ఆ ప్రాంత వాసులు సుదీర్ఘంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కారం దిశగా సూచనలు చేశారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ యువనాయకులు గౌరీ అమరనాథ్, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీ సమస్యలపై ఆర్డీవో విచారణ

వేటపాలెం(చీరాల), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని రోశయ్యకాలనీ రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్టీ కాలనీను ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోరుతూ కాలనీవాసులు ఇటీవల కలెక్టర్ వెంకటమురళీని కలిశారు. దీంతో వెంటనే స్పందించి సూచించిన ఆదేశాల మేరకు ఆర్డీవో పరిశీలించారు. ఈక్రమంలో వారు ఎదుర్కొంటున్న తాగునీరు, నివేశన స్థలాలు సమస్యలు ఉన్నట్లు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్లు ఆర్డీవో వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ గోపీకృష్ణ ఉన్నారు.

వైద్యశాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వైద్యశాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. సోమవారం ప్రాంతీయ వైద్యశాలలో అభివృద్ధి కమిటీతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో అత్యవసర సేవలపై చర్చించారు. వైద్యశాలలో అంతర్గత రహదారులు, మౌలిక వసతులపై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మార్చురీలో పెద్దఎత్తున ఫ్రీజర్ బాక్సుల కొరత ఉన్నట్లు వైద్యాధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రాణవాయువు కేంద్రం, వైద్యశాల చుట్టూ భద్రతకు సంబంధించిన రక్షణ గేట్లుపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ కృష్ణప్రసాద్ సహకారంతో వైద్యశాలకు అధునాతన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.శ్రీకాంత్, వైద్యులు హరిబాబు, సునీత, రమాదేవి, హనుమంతురావు, లక్ష్మీనారాయణ, కోటి నాగిరెడ్డి, రాజాసెల్వన్, ఉష తేజస్విని, బండారుపల్లి హేమంత్ కుమార్, తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యశాల ఆస్తులు పరిరక్షిస్తాం

వైద్యశాలకు చెందిన ఆస్తుల పరిరక్షణపై వైద్యశాల కమిటీ దృష్టిసారించిందని, ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య తెలిపారు. వైద్యశాల స్థలాన్ని కొంత ఆక్రమిస్తున్నట్లు సమావేశం దృష్టికి వచ్చిందన్నారు. ఆస్తులు పరిరక్షించాలని సూచించినట్లు తెలిపారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు, వెంటనే రక్షణచర్యలు చేపట్టాలన్నారు.

భగ్గు మంటున్న పచ్చి మిర్చి ధర

● గత వారం కేజీ రూ. 30 నేడు రూ. కేజీ 90

● బెంబేలెత్తుతున్న ప్రజలు



బల్లికురవ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గత వారం వరకు ప్రజలకు అందుబాటులో ఉన్న పచ్చి మిర్చి ధర ఒక్కసారిగా భగ్గు మంటోంది. సోమవారం మార్టూరు కూరగాయాల మార్కెట్‌లో పచ్చి మిర్చి కిలో రూ.90 పలికింది. చిరు వ్యాపారులు మిర్చిని కొనుగోలు చేసి గ్రామాలలో కిలో రూ. 120 రుపాయల చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో పచ్చిమిర్చి ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రైతులు పండించిన సమయంలో కిలో రూ.20 ఉందని ఇప్పుడు కాయలు ఎక్కడ లేక పోవడంతో ధర పెరిగిందని రైతులు అంటున్నారు. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో రైతులు పచ్చిమిర్చి పంటను సాగు చేస్తుంటారు సీజన్‌లో మాత్రం ధర తక్కువ ఉంటుందని వారు ఆందోళన చెందుతున్నారు. హోటల్స్ నిర్వహించే వారు పచ్చి మిర్చి ధర పెరగడంతో చట్నీలకు ఎండుమిర్చిని వినియోగిస్తున్నారు. మిగిలిన పలు రకాల కూరగాయల ధరలు అందుబాటులోనే ఉన్నాయి.

వెంకటసుజనకు డాక్టరేట్


యార్లగడ్డ వెంకట సుజన

దగ్గుబాడు/పర్చూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం, దగ్గుబాడు గ్రామానికి చెందిన యార్లగడ్డ వెంకట సుజనకు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. రాయలసీమ యూనివర్సిటీ మేనేజ్మెంట్ విభాగంలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఈ-కామర్స్ ఆన్ కన్స్యూమర్ డెసిషన్ మేకింగ్ టువార్డ్స్ ది పర్చేస్ ఆఫ్ ఎలెక్ట్రానిక్ గూడ్స్ ఇన్ హైదరాబాద్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ దక్కింది. కుప్పంలోని స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ద్రవిడియన్ యూనివర్సిటీ డీన్ అచార్యులు జి.ఎల్.నారాయణప్ప పర్యవేక్షలో చేసిన పరిశోధనలను గుర్తించి రాయలసీమ యూనివర్సిటీ వైవి సుజనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆమెకు పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందలు తెలిపారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్

చినగంజాం, జూలై 7(ఆంధ్ర జ్యోతి) : డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్విని యోగం చేసు కొని, ఈ పథకం ద్వారా తమ జీవనో పాధిని మెరుగు పరుచుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు డీఆర్‌డీవో ఆధ్వర్యంలో పీఎం.సూర్యఘర్ పథకంపై వీవో అధ్యక్షులు, వివోఏలకు సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ అర్హులైన వారు సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనిట్ ఏర్పాటునకు రూ.1.10 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. లబ్దిదారుని వాటా రూ.20,000లు, చెల్లిస్తే ప్రభుత్వం రాయితీ రూ.78,000లు, బ్యాంకు లోను రూపంలో రూ.1,12,000లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రూపులలో ఉన్న మహిళలు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కే.శారద, సీసీలు శ్రీలక్ష్మి, మాధవి, వీవో అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వైద్యాధికారి, సిబ్బందికి సత్కారం


వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

చినగంజాం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఇతర ప్రాంతాల పీహెచ్‌సీలకు బదిలీపై వెళ్లిన వైద్యాధికారి, వైద్య సిబ్బందికి సోమవారం ఘనంగా వీడ్కోలు సభ జరిగింది. స్థానిక పీహెచ్‌సీలో గత ఎనిమిది సంవత్సరాలుగా పనిచేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయభాస్కరరావు ప్రకాశం జిల్లా రిమ్స్‌కు, యూడీసీ పి.బాలలక్ష్మి, ఫార్మసీ ఆఫీసర్ పి.సుశీలమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ కే.శ్యామ్‌ప్రసాదు, ఆరోగ్య కార్యకర్తలు ఎం.పద్మజ, ఏఎన్‌ఎం కే.తిరుపతమ్మ, జె.సువార్త, కే.రమాదేవి, ఎం.సింగమ్మలు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారిని ఇక్కడికి వచ్చిన అధికారులు సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో బదిలీపై ఇక్కడకు వైద్యాధికారి డాక్టర్ సీ.హెచ్.సిరివెన్నెల, వైద్య సిబ్బంది షేక్.రియాజ్ అహ్మద్, వి.రామలక్ష్మి, వి.సుశీలమ్మ, ఎస్.పద్మావతి, వై.మాధవి, డి.నాగరాజులు వచ్చారు. బదిలీపై వెళ్లిన వారిని, బదిలీపై ఇక్కడకు వచ్చిన వారిని వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్, సీ.హెచ్.వో ఝాన్సీ, డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ భవాని, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయ రావు, సందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలపై వినతి

చీరాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ అభ్యర్థులు సమస్య ల పరిష్కారం కోరుతూ ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల డిఎస్సీ, గ్రూప్ 2పరీక్షల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని, అయితే ఈపరీక్షల్లో రాణించిన అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు కూడా అర్హులయ్యే అవకాశం ఉందని చెప్పారు. కానీ కానిస్టేబుల్ ఉద్యోగమే లక్ష్యంగా సాగుతున్న అభ్యర్థులు దీని వలన తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఈక్రమంలో ఇతర ఉద్యోగాలతో సర్దుకున్న వారి నుండి ఒప్పందపత్రం తీసుకుని కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభాష్, బాషా, సంతోష్, రవితేజ, సాయికుమార్, వికాస్‌బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు వాగును కమ్మేసిన ముళ్లచెట్లు, పొదలు

నీరు ముందుకు సాగని వైనం


పర్చూరు ప్రధాన వాగులో నిండిపోయిన ముళ్ళ చెట్లు, పొదలు

పర్చూరు, జూలై 7, (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వాగులో ముళ్లచెట్లు, పొదలు, గుర్రపుడెక్క పేరుకుపోయి అడవిని తలపిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో నీరు ముందుకు కదలని దుస్థితి నెలకొంది. వాగునిర్వహణ పట్టించుకోవాల్సిన డ్రైనేజ్ అధికారులు కన్నెత్తికూడా చూడక పోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రజల మంచినీటి అవసరాలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న సాగర్‌జలాలు ఎస్కేప్ చానల్ ద్వారా వాగుకు చేరి అయా గ్రామాల మంచినీటి చెరువులకు నింపుకోవాల్సి ఉంది. దీంతో వాగులకు సక్రమంగా నీటి సరఫరా జరకపోవడంతో ఆయా గ్రామాల మంచినీటి చెరువులకు అరాకొరా నీరు మాత్రమే చేరుతోంది. దీంతో ప్రజలకు త్రాగునీటి కష్టాలు తప్పడం లేదు. వాగు నుంచి మంచినీటి చెరువులు నింపుకోవాలంటే కష్టతరంగా మారుతుంది. దీనికి తోడు కొద్దిపాటి వరదలు వచ్చిన సమీప పంట పొలాలు నీటమునిగిపోతున్నాయి. వాగు అభివృద్ధికి నోచుకోకుండా అధ్వానంగా మారినా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.

అసలే చివరి ఆయకట్టు..

పర్చూరు నియోజకవర్గం సాగర్ కాలువలకు చివరి ఆయకట్టులో ఉంది. దీంతో సాగర్ జలాలు విడుదలైనా, నీటి సరఫరా అంతంత మాత్రంగానే చేరుతోంది. ఎగువ నుంచి నీరు దిగువకు చేరాలంటే కష్టతరంగా ఉంది. ఇలాంటి తరుణంలో వాగులో ఎక్కడ చూసినా, చిల్లచెట్లు ముళ్ల పొదలు, గుర్రపు డెక్కతో నిండి ఉంది. నీటి సరఫరా సక్రమంగా సాగుతున్న దాఖలాలు లేవు. దీంతో ఇటు తాగునీటితో పాటు, సాగునీటికి కూడా ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

కన్నెత్తి చూడని డ్రైనేజ్ అధికారులు

వాగుల్లో చిల్లచెట్లు, ముళ్లపొదలు పేరుకుపోయి అడవిని అలపిస్తున్నా అధికారులు కన్నేత్తి చూడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పర్చూరు వాగు అభివృద్ధిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పర్చూరు వంతెన సమీపంలోని చిల్లచెట్లు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి


బొమ్మనంపాడులోని వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అద్దంకిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరిచి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య సూచించారు. సోమవారం మండలంలోని బోమ్మనంపాడులో రోడ్లువెంబడి చెత్తాచెదారని తొలగించి శుభ్రం చేసిన ప్రాంతాలను ఆయన డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌వీఎస్ ప్రసాదరావు, పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరు మీ ఇంటి వద్దనే ఏర్పాటు చేసిన డబ్బాలలో తడి పోడి చెత్తలను వేయాలన్నారు. అలాగే గ్రామాలల్లో ఉన్న బోర్లను పరిశీలించారు. అన్ని గ్రామాలల్లో చేతిబోర్లు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని ప్రజలకు ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

సంతమాగులూరు జూలై 7 (ఆంధ్రజ్యోతి) సంతమాగులూరు మండలంలోని కొమ్మలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా మాసనం శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధితులు చేపట్టిన ఆయన్ను ఎంఈవోలు ఏమవరపు కోటేశ్వరరావు దినేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు, పాఠశాలలో ఉపాధ్యాయులు అందరు కష్టపడి పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బాధితులు స్వీకరించిన శ్రీనివాసరావుకు దిశాల్వా కప్పి అభినందనలు తెలిపారు.

'సోమశిల'కు త్వరలో కృష్ణమ్మ రాక

- పోతిరెడ్డిపాడుకు 10 వేల క్యూసెక్కులు విడుదల
- రెండువారాల్లో జిల్లాకు జలాలు



అనంతసాగరం జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయాన్ని త్వరలోనే కృష్ణమ్మ పలకరించనుంది. ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 1.85 లక్షల క్యూసెక్కుల ప్రవాహం డ్యాంకు వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం పూర్తి నిల్వ 215.80 టీఎంసీలకు గాను సోమవారానికి 190 టీఎంసీలకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. ఇక దిగువ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు 10 వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో ఆ జలాలు రాయలసీమ అవసరాలు తీరుస్తూ సోమశిల వైపు పరుగు తీస్తోంది. 10 నుంచి 15 రోజుల్లో కృష్ణమ్మ సోమశిలకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి.

నీరు వదిలారు

శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీరు వదిలిన విషయం వాస్తవమే. ఆ నీరు సోమశిలకు చేరాలంటే కొంత సమయం పడుతుంది. రుతుపవనాల ద్వారా వర్షాలు కురిస్తే నేరుగా కుందు నుంచి సోమశిలకు వరద చేరే అవకాశం ఉంది.

- వెంకటరమణారెడ్డి ఎస్‌ఈ, సోమశిల

● ఈసారి తొందరగానే ..

సహజంగా సోమశిల ప్రాజెక్టుకు ఆగస్టు మొదటి వారంలో కృష్ణా జలాల రాక ఉంటుంది. ఈసారి శ్రీశైలం డ్యాం తొందరగా నిండటంతో ఆదివారం పోతిరెడ్డిపాడుకు నీరు సరఫరా చేశారు. అక్కడ నుంచి నీరు ఇక్కడకు రావడానికి పది రోజులకుపైగా సమయం పడుతుంది. ఈ క్రమంలో జూలై 3వ వారంలో నీరు చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సోమశిల పరిధిలో వచ్చే ఏడాది రెండు పంటలకు అవసరమైన నీరు నిల్వ చేసుకొనే వెసులుబాటుతోపాటు చిత్తూరు, చెన్నై ప్రాంతాలకు త్వరలో నీరు ఇచ్చే సౌలభ్యం కలగనుంది. కాగా, డ్యాంకు ప్రస్తుతం 190 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 29.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఇక మ్యాజిక్ డ్రైన్!

- ప్రయోగాత్మకంగా కొమరికలో నిర్మాణం



ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రైన్ ఇదే!

నెల్లూరు (జడ్పీ), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మురుగు కాలువల్లో ఎక్కడ నీరు అక్కడ ఇంకిపోయే విధంగా 'మ్యాజిక్ డ్రైన్' నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తక్కువ ఖర్చుతో భూగర్భ జలాలు పెరిగేలా ఇంకుడు గుంతల తరహాలో ఈ కాలువల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. తొలుత ఎన్టీఆర్ జిల్లా నందిగామా మండలం సోమవరంలో ఈ డ్రైన్ నిర్మించగా విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లాలో ఒక్కో కాలనీలో ప్రయోగాత్మకంగా డ్రైన్ నిర్మించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామంలో ఏర్పాటు చేయనున్నారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం ద్వారా డ్వామా ఆధ్వర్యంలో ఈ పనులు జరగనున్నాయి. తొలుత పొదలకూరులో రెండు గ్రామాలు, జలదంకిలో ఒకటి, ఇందుకూరుపేట మండలంలో కొమరికను అధికారులు పరిశీలించారు. చివరకు ఎక్కువ గృహాలు ఉన్న కొమరికను ఎన్‌ఆర్ ఈజీఎస్‌ను ఎంపిక చేశారు.

● ఇంకుడు గుంతల్లాగా...

మ్యాజిక్ మురికి కాలువలను ఇంకుడుగుంతల తరహాలో నిర్మించనున్నారు. కాంక్రీట్ లేకుండా కాలువకు ఇటు, అటు వైపు నాపరాళ్లను ఏర్పాటుచేసి, కాలువ మధ్యలో రాళ్లు, గ్రావెల్ మాత్రమే వేసేలా రూపకల్పన చేశారు. ఇళ్లలో నుంచి వచ్చే మురికినీరు కాలువల్లో పారుదల లేకుండా భూమిలో ఇంకిపోతుంది. దీనిద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. అంతేగాక కాంక్రీట్‌తో నిర్మించే కాలువ కన్నా ఈ డ్రైన్ ఖర్చు చాలా తక్కువ. అలాగే పైన నిలబడే చెత్తను తొలగించేందుకు ప్రత్యేక పరికరాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఇది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా మ్యాజిక్ డ్రైన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. కొమరికలో మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపినట్లు డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. స్థానికులతోనే ఈ పనులను చేయించనున్నట్లు చెప్పారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

13 కళాశాలలు.. 12,804 సీట్లు ● ఆగస్టు 4న తరగతుల ప్రారంభం

నెల్లూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కావాలనుకునే విద్యార్థుల కల నెరవేరడానికి తొలిమెట్టు ప్రక్రియ ఆరంభమైంది. ఈఏపీసెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం మొదలైంది. గతేడాది ఏ కళాశాలలో ఏ కేటగిరీకి ఎన్నో ర్యాంకు వరకు సీటు వచ్చింది అనే వివరాలు పరిశీలించుకుంటూ తామెక్కడ ఉన్నామో.. ఎక్కడ సీటు వస్తుందో అని విద్యార్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు అధికశాతం మంది కంప్యూటర్ సైన్స్ కోర్సుపైనే ఆసక్తి చూపిస్తుండగా కోర్సు ముఖ్యమా, కళాశాల ముఖ్యమా అనే ప్రశ్న కూడా తల్లిదండ్రులు, విద్యార్థులను వెంటాడుతోంది. దీనికోసంగా కళాశాలలో వసతులు, విద్యా ప్రమాణాలు, ఫలితాలు, ఉద్యోగావకాశాల పరిస్థితులను అంచనా వేసుకుంటున్నారు.

● అందుబాటులో 12,804 సీట్లు

గతంలో 21 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా వీటిలో 8 కాలేజీలు మూతపడ్డాయి. ఏఐసీటీఈ జాబితా ప్రకారం జిల్లాలో 13 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా, 12,804 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది అత్యధికంగా సీఎస్‌ఈ, ఈసీఈ సీట్లు భర్తీకాగా మెకానికల్, సివిల్ విభాగాలకు రెండో ప్రాధాన్యం ఇచ్చారు. చివరగా ఈఈఈలో కొంతమంది మాత్రమే ప్రవేశించారు. ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే లక్ష్యంగా తమకు వచ్చిన ర్యాంకులను బట్టి కళాశాల, గ్రూపుల ఎంపిక చేసుకోవాలని, బ్రాంచ్‌ల ఎంపికే కీలకం కానుందని మేధావులు చెపుతున్నారు.

● ఈఏపీసెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ

7 నుంచి 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లింపులు, 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోనే ధ్రువపత్రాలు పరిశీలన ఉంటుంది. 13 నుంచి 18వ తేదీ వరకు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్ ఆప్షన్‌ల ఎంపిక, 19న వెబ్ ఆప్షన్‌లు మార్చుకునే అవకాశం ఇచ్చారు. 22న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్ల కేటాయింపు జాబితా వెల్లడిస్తారు. సీట్లు దక్కించుకున్న విద్యార్థులు 23 నుంచి 26వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. ఆగస్టు 4న తరగతులు ప్రారంభం అవుతాయి.

అప్రమత్తంగా ఉండాలి

వెబ్ ఆప్షన్ల నమోదులో విద్యార్థులు జాగ్రత్తగా వ్యవహరించాలి. నచ్చిన కోర్సులు, కళాశాలలను ముందుగానే ప్రాధాన్యత క్రమంలో జాబితాను సిద్ధం చేసుకుని, దీని ఆధారంగా ఆప్షన్లను నమోదు చేయాలి. కళాశాలల షార్ట్‌ఫామ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఫోన్ నెంబర్, బోధనా రుసుం ఆప్షన్, కులం తప్పుగా నమోదైతే మార్చుకునేందుకు మాత్రమే సంబంధిత ధ్రువపత్రాలతో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలి.

- డాక్టర్ ఎస్.రామారావు, జిల్లా సమన్వయకర్త



స్వర్ణాల చెరువులో తలమీద రొట్టె పెట్టుకుని స్నానం చేస్తున్న ముస్లిం యువతి



స్వర్ణాల చెరువులో భక్తుల సందడి



భక్తి సుగంధం!

- వైభవంగా గంధ మహోత్సవం ● పోటెత్తిన యాత్రికులు
- 4లక్షల మందికిపైగా భక్తుల రాక ● పటిష్ట బందోబస్తు ● నేడు రొట్టెల పండుగ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగే రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి తర్వాత వైభవంగా జరిగింది. మతసామరస్యాన్ని ప్రతిబింబిస్తూ ఆధ్యాత్మిక శోభను వెదజల్లుతూ లక్షలాది మంది ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. బారాషహీదులకు సమర్పించే పవిత్ర గంధాన్ని నగరంలోని కోటమిట్ట అమీయామియా మసీదులో సిద్ధం చేశారు. ఇస్లాం మత పెద్దలు దైవ ప్రార్థనలతో గంధం కలిపి 12 బిందెలకు ఎత్తారు. ఆ బిందెలను పూలతో అలంకరించి రథంపై ఉంచుకుని మేళతాళాలు, ఫకీర్ల జరబ్‌లతో కోటమిట్ట, ట్రైకర్‌రోడ్డు, పాత జడ్పీ కార్యాలయం, ఏసీ మార్కెట్, మాగుంట విగ్రహం, పోలీసు ఆఫీసు మీదుగా బారాషహీద్ దర్గాకు చేరుకున్నారు. అమరులైన బారాషహీద్‌ల సాహసాలను కీర్తిస్తూ ఫకీర్‌లు సాహస విన్యాసాలు ప్రదర్శించారు. ఈ దృశ్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బిందెలలోని గంధాన్ని కడప పెద్ద మసీదు పీఠాధిపతి ఆరీఫుల్లాహుస్సేనీ, ఆయన శిష్యబృందం దైవప్రార్థనలు చేసి, బారా షహీద్‌ల సమాధులకు ఎక్కించి కొత్త గలేఫులు కప్పారు. అనంతరం భక్తులకు గంధాన్ని ప్రసాదంగా పంచారు. ఈ ఘట్టం ముగియడంతో రొట్టెల పండుగ స్వర్ణాల చెరువు తీరంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

4 రొట్టెలకు డిమాండ్

రొట్టెల పండుగకు సోమవారం రెండవ రోజు భక్తులు పోటెత్తారు. సుమారు 4 లక్షల మంది తరలివచ్చినట్లు అంచనా. వరాల రొట్టెల కోసం స్వర్ణాల ఘాట్‌లో భక్తులు కిటకిటలాడారు. వివాహం, ఉద్యోగం రొట్టెలకు డిమాండ్ కనిపించింది. ఆరోగ్యం, సౌభాగ్యం, విద్య తదితర రొట్టెలను సైతం భక్తులు అధిక సంఖ్యలో పట్టుకున్నారు. బారాషహీద్‌ల సమాధుల దర్శనానికి బారులు దీరారు. సోమవారం అర్ధరాత్రి గంధ మహోత్సవం జరగనున్నందున సాయంత్రానికి యాత్రికుల సంఖ్య మరింత పెరిగింది. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చే వారి వాహనాలతో నగర రోడ్లపై రద్దీ నెలకొంది. దీంతో భక్తులకు సేవలు అందిస్తున్న సిబ్బందిని ఆయా శాఖల అధికారులు అప్రమత్తం చేశారు.

● లోకేష్ కోసం ప్రత్యేక రొట్టె...

రొట్టెల పండుగకు హాజరైన మంత్రి లోకేష్ కోసం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రత్యేకంగా భారీ రొట్టెను తయారు చేయించారు. సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, భక్తులతో లోకేష్ ఆరోగ్య రొట్టెను పట్టుకున్నారు. గంధమహోత్సవం సందర్భంగా భారీ స్థాయిలో అన్నదానం జరిగింది. స్వర్ణాల ఘాట్‌లో హోసూరుకు చెందిన భక్తుడు ఫిట్స్‌తో పడిపోతే అపోలో వైద్య శిబిరంలోని వైద్యులు స్పందించి సేవలు అందించారు.

● పోలీసుల తనిఖీలు...

బారాషహీద్ దర్గాకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు తరలివస్తున్న సందర్భంగా పోలీసు శాఖ విస్తృత తనిఖీలు చేపట్టారు.

● జోరుగా బోట్ షికారు..

స్వర్ణాల చెరువులోని బోట్ క్లబ్‌లో పర్యాటకాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బోట్ షికారు జోరుగా సాగుతోంది. భక్తులు భారీ సంఖ్యలో బోట్ క్లబ్ పరిసరాల్లో సేద తీరడమే కాక బోట్ షికార్ చేస్తున్నారు.



బారాషహీద్ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని..

● ఆరోగ్య రొట్టె స్వీకరించిన నారా లోకేష్

నెల్లూరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అన్నారు. బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెలపండుగలో జిల్లా మంత్రులు మహ్మద్ ఫరూక్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి లోకేష్ పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం స్వర్ణాల చెరువు ఘాట్ వద్దకు చేరుకున్నారు. దిల్‌షాద్, గౌసియా అనే మహిళలు మంత్రి లోకేష్‌కు ఆరోగ్య రొట్టెను అందించారు. ఈ రొట్టెను తన తండ్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందచేస్తానని తెలిపారు. అనంతరం ఘాట్ వద్ద మీడియాతో లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ఈ పండుగ కోసం రూ. 10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వీసీల నియామకం పారదర్శకంగా జరుగుతోందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 9,600 పాఠశాలలో ఒన్ క్లాస్, ఒన్ టీచర్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లపై భక్తులు, మహిళలు, చిన్నారులతో లోకేష్ మాట్లాడారు. యాత్రికులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో సెల్ఫీలు తీసుకున్నారు. మంత్రి వెంట రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, ఎస్పీ కృష్ణకాంత్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తాళ్ళపాక అనురాధ తదితరులు ఉన్నారు.

సంబ్రమాశ్చర్యం!

- వీఆర్ స్కూల్‌లో విద్యార్థిలా మారిన లోకేష్
- అహం వద్దు.. కార్యకర్తలకు దిశా నిర్దేశం
- బారాషాహీద్ దర్గాలో భక్తిశ్రద్ధలతో పూజలు
- ఏర్పాట్లపై యాత్రికులతో ఆరా



వీఆర్‌స్కూలులో బాస్కెట్‌బాల్ ఆడుతున్న లోకేష్

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఒక్క రోజు పర్యటన నిమిత్తం నెల్లూరుకి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంబ్రమాశ్చర్యాలతో సోమవారం సాయంత్రం రాజధానికి పయనమయ్యారు. పీ-4 కింద అద్భుతంగా తయారైన వీఆర్ స్కూలును చూసి మురిసిన ఆయన కొంతసేపు విద్యార్థిగా మారిపోయారు. నెల్లూరు నగర నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలను కార్యోన్ముఖులను చేశారు. పరిణితి చెందిన నేతగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎంపీ వేమిరెడ్డి నివాసంలో విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు. సాయం సంధ్యవేళ బారాషాహీద్ దర్గాలో ప్రార్థనలు చేశారు.

● పిల్లల్ని ఉత్సాహ పరుస్తూ..

ఉదయం 9 గంటల ప్రాంతంలో వీఆర్ స్కూలును మంత్రి లోకేష్ ప్రారంభించారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పీ-4 పథకం కింద పాఠశాలను అభివృద్ధి చేసిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు, నారాయణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి షరణీలు వారి వెంట ఉన్నారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు, స్టడీ మెటీరియల్ చూసి సంతోషించారు. హైడ్రోఫోనిక్ ల్యాబ్‌ను చూసి ఆశ్చర్యపోయారు. అధునాతన టెక్నాలజీతో సిద్ధం చేసిన క్రీడా మైదానాలు చూసి తను మంత్రిననే విషయాన్నే మరచిపోయారు. క్రికెట్ బ్యాట్ అందుకొని బ్యాటింగ్ చేశారు. వాలీబాల్ కోర్టులో బాల్ అందుకొని స్టయిల్‌గా సర్వీస్ చేశారు. లోకేష్‌తో ఆడేందుకు వెనుకాడుతున్న పిల్లలను చూసి ఆడండ్రా.. బాబు అంటూ వారిని ఉత్సాహపరిచారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నిజంగా ఈ స్కూలు ఓ అద్భుతమంటూ కితాబిచ్చారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ తాను కూడా ఆర్‌ఎస్‌ఆర్ స్కూలును ఇదేవిధంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.



వీఆర్‌స్కూలు ప్రారంభం, ఆర్‌ఎస్‌ఆర్, బాలికల ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు శిలాఫలకాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్, ఇతర మంత్రులు ఫరూక్, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి తదితరులు

● వీఆర్ స్కూలుగానే కొనసాగాలి : ఆనం

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ వీఆర్ స్కూల్ 50 ఏళ్లపాటు ఆనం కుటుంబీకుల ఏలుబడి కింద ఉండేదన్నారు. ఈ విద్యాసంస్థ అభివృద్ధికి తమ కుటుంబ పెద్దలు ఎంతో కృషి చేశారన్నారు. ఇన్నేళ్లలో ఏనాడు స్కూలు పేరు మార్చే ఆలోచన చేయలేదన్నారు. ఇప్పుడు వీఆర్ స్కూలు పేరును వీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూలుగా పేరు మార్చడాన్ని ఆనం తప్పు పట్టారు. ఈ పేరును తొలగించి వీఆర్ స్కూలుగానే ఉంచాలని, ఇంతకు మునుపులా ప్రత్యేక పాలకవర్గం కింద కొనసాగించాలని కోరారు. నగరంలోని మరిన్ని మున్సిపల్ స్కూళ్లను పీ-4 పథకం కింద అభివృద్ధి చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ పాఠశాలను అధునాతనంగా తీర్చిదిద్దామన్నారు. ఈ పాఠశాల విద్యార్థులకు నారాయణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ తరఫున ఉచిత బ్రేక్‌ఫాస్ట్, యూనిఫాం, పుస్తకాలు, ఉచిత రవాణా, ఆరవ తరగతి పైబడిన విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేయడానికి తన బిడ్డలు ముందుకు వచ్చారని, ఈ సహాయ సహకారాలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

● మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో అనిల్ గార్డెన్‌లో మంత్రి లోకేష్ సమావేశమై దిశానిర్దేశం చేశారు.

● సాయంత్రం నారా లోకేష్ రొట్టెల పండుగలో పాల్గొన్నారు. ఆరు గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570

టీఆర్‌ఆర్‌లో 10 నుంచి ఉచిత శిక్షణ

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థినీ విద్యార్థుల కోసం ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, జనరల్ అవేర్నెస్ అంశాలపై ఈనెల 10వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి ఉచిత శిక్షణ తరగతులు కళాశాలలో జరుగుతాయని తెలిపారు. పాతికేళ్ల బోధనానుభవం, పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ క్వాలిఫైడ్ అధ్యాపకులు ఆయా అంశాలలో శిక్షణ ఇస్తారని, పరిసర ప్రాంత విద్యార్థినీ విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న మెగా పేరెంట్, టీచర్ సమావేశం

లింగసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేసి వారి సలహాలు, సూచనలు తీసుకొనేందుకు ఈ సమావేశం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

ముగిసిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం

కావలి/కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాలు-2025 కార్యక్రమాలు ఆదివారం రాత్రి ముగిశాయి. కావలి వాయునందన ప్రెస్‌వీధిలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందించిన, అధిక పర్యాయాలు రక్తదానం చేసిన, రక్తదాతలను ప్రోత్సహించిన వారిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సత్కరించి మెమొంటోలు అందచేశారు. కందుకూరులో రక్తదాతలను ప్రోత్సహిస్తూ ప్రతిఏటా క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాల నిర్వహణకు కృషి చేస్తున్న పట్టణానికి చెందిన మహాత్మాగాంధీ విగ్రహ కమిటీప్రతినిధి పబ్బిశెట్టి వరదరాజా, బీసీ హాస్టల్ వార్డెన్ జీ.తిరుపతిరావులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. వంశీకృష్ణ, రెడ్‌క్రాస్ రాష్ట్రకోశాధికారి పీ.రామచంద్రరాజు, జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, రోటరీ ఇంటర్నేషనల్-3160 జిల్లా కార్యదర్శి డాక్టర్ మాధవరెడ్డి, ఐఎంఏ కార్యదర్శి వీ.గోపి, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, అరికట్ల మధుసూదన రావు, డాక్టర్ పీ.శ్రీధర్ పాల్గొన్నారు.

చెంచులక్ష్మీపురంలో వెలగని వీధి దీపాలు

బిట్రగుంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ చెంచులక్ష్మీపురంలో వీధి దీపాలు వెలగక వీధులు అంధకారంగా మారాయి. ఇటీవల కాలంలో విద్యుత్ అతరాయం వలన చీకటి పడితే అడుగు బయట పెట్టాలంటే స్థానికులు భయపడుతున్నారు. పంటపొలాలు గ్రామ సమీపంలో ఉండటంతో పాముల సంచారం పెరిగింది. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విట్స్ వార్షిక వార్త లేఖ ఆవిష్కరణ

కావలి(టౌన్), జూలై 7(ఆంధ్రజ్యోతి) : పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వార్షిక వార్త లేఖను విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డిలు ఆవిష్కరించారు. సంపాదకులుగా వ్యవహరించిన డాక్టర్ గిరీష్ గాంధీ డాక్టర్ హయాత్ రజ్వీలు మాట్లాడుతూ గత సంవత్సరం వివిధ విభాగాల్లో నిర్వహించిన కార్యక్రమాలు దేశంలోని ప్రసిద్ధి చెందిన యూనివర్శిటీలు కళాశాలలో తమ విద్యార్థులు సాధించిన విజయాలు, జాతీయ సెమినార్ల నిర్వహణ అందులో పాల్గొన్న వక్తలు నిపుణుల సమాచారం తదితర అంశాలను లేఖలో పొందుపరిచామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిఖిత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కి 7 వినతులు

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 7 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె. అనూష తెలిపారు. ఆ సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, వీధిలైట్లు ఇతర సమస్యల పరిష్కారం కోసం 9177700267కు ఫోన్‌లో తెలిపినా తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు మండల, సచివాలయ అధికారులకు శిక్షణ

కలిగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతోపాటు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2023-24 కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని, పైన తెలిపిన శాఖాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

కొండాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని సాయిపేటలో జరిగింది. గ్రామానికి చెందిన పాటిబండ్ల చిన అంకయ్య తన గేదెలను మేతకోసం పొలాలకు తోలుకొనిపోతుండగా స్థానిక ఎస్సీ కాలనీలోని వీధిలో విద్యుత్‌వైరు తెగిపడి ఉండటంతో గేదె పొరపాటున దానికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుమారు రూ.80 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని పశుపోషకుడు చిన అంకయ్య కోరారు.

మడుగు కాదు.. రోడ్డే..!

- పైపులైను పగిలి సైడు కాలువలు లేక రోడ్డుపై నిలిచిన నీరు
- ఇబ్బందుల్లో వాహనదారులు, పాదచారులు

లింగసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటోలో కపిస్తున్నది మడుగు కాదండి.. ఆర్‌అండ్‌బీ రోడ్డే. మూడు రోజుల క్రితం రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం కోసం ఎక్స్ కవేటర్‌తో గుంత తీశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న తాగునీటి పైపులైను పగిలిపోయింది. దీంతో మంచినీరు వృథాగా పోతూ రోడ్డుపై మడుగు కట్టింది. కాగా దశాబ్దాలుగా రోడ్డుకి ఇరువైపుల డ్రైనేజీ కాలువలు లేక పోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి, ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు ఇలా రోడ్డుపై చేరి దర్శనమిస్తోంది. ఇది ఎక్కడో మారుమూల పల్లెలో కాదండోయ్.. లింగసముద్రం మండల కేంద్రంలోనే. వివరాల మేరకు లింగసముద్రం ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మసీదు సెంటరు నుంచి బస్టాండ్ సెంటరు వరకు మాత్రమే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు



లింగసముద్రం మీసేవా కేంద్రం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన పైపులైన్ లీకేజీ నీరు

ఒక వైపు సైడు కాలువ ఉంది. ఈ కాలువ కూడా కేవలం 200 మీటర్ల దూరం మాత్రమే ఉంది. కానీ రోడ్డు రెండో వైపున సైడు కాలువ లేదు. దీంతో తిరుమణిశెట్టి కోటయ్య మందిరం సమీపంలో ఉంటున్న నివాసాల వారు కొందరు తమ ఇళ్లలోని వ్యర్థపు నీటిని ప్రతిరోజూ ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో ప్రతిరోజూ వాహనదారులు, ప్రజలు ఈ బురదనీటిలో నడవలేక ఇబ్బందులు పడుతుండగా వాహనాలు వచ్చినప్పుడు ఆ నీరు ప్రజలపైకి పడుతోంది. దీంతో దుర్వాసన పడలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే వర్షం కురిసిన ప్రతిసారీ స్థానిక మీసేవా కేంద్రం నుంచి దక్షిణం వైపు ఉన్న వాటర్ ప్లాంటు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు

5 నెలల క్రితం డాక్టర్ పీవీ కృష్ణమోహన్ ప్రజా వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటరు మీదుగా కోళ్లఫారం వరకు రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువల నిర్మాణానికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ చెప్పారు.

మురుగు గుంత కాదండీ.. రోడ్డే!

- సిమెంట్ రోడ్డుపై నిల్వ చేరిన నీరు
- ఇబ్బందుల్లో అయ్యవారిపల్లె ప్రజలు



అయ్యవారిపల్లెలో సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

వలేటివారిపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లె జాతీయ రహదారి నుంచి ఎస్సీ కాలనీలోకి వెళ్లే సిమెంట్‌రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీ వాసులు ఇళ్లలోని వృథా నీరంతా సిమెంట్‌రోడ్డు పైకి వదిలేస్తున్నారు. గతంలో జాతీయరహదారి లేకపోవడంతో కాలనీ వాసులు వదిలేసిన వృథా నీరంతా రోడ్డు పక్కన దిగువకు పోయేది. ఇప్పుడు రోడ్డు ఎత్తు పెరగడంతో మురుగు నీరు దిగువకు పోయే అవకాశం లేక హైవే రోడ్డు పక్కన ఎస్సీ కాలనీల్లోకి వెళ్లే సిమెంట్ రోడ్డుపై నిల్వ ఉండి మురుగుకుంటలా మారింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేగాకుండా మురుగు నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ పంచాయతీ పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి మురుగునీరు సిమెంట్ రోడ్డుపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేట్టిన ఈ ధర్నా అనంతరం మున్సిపల్ మేనేజరు ఫణీంద్రకు వినతిపత్రం అందచేశారు. అనంతరం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీలో శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలలో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికులకు జీవోఎంఎస్ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ చెందిన కార్మికుల గ్రాడ్యుటీ రాష్ట్రప్రభుత్వం సత్వరం విడుదల చేయాలన్నారు. కొవిడ్-19లో తీసుకున్న డైలీవేజెస్ కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈనెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రవి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి



ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో క్లస్టర్, బూత్ ఇంచార్జిల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని నందావారివీధిలో పార్టీ నాయకులు చీదెళ్ల పిచ్చయ్య, వలేటివెంకటేశ్వర్లు, యోగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. తూర్పుపాలెం ప్రాంతంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కల్లూరి శైలజ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల జాబితా నిర్వహణపై బీఎల్వోలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న బీఎల్వోలు

కావలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ, అండ్ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు కావలి అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితా నిర్వహణపై 45 మంది బీఎల్వోలకు తొలిరోజు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కావలి తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్ సర్టిఫికెట్లు అందచేశారు.

10న కరేడుకు సీపీఐ నేత రామకృష్ణ రాక

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈనెల 10వ తేదీన ఉలవపాడు మండలం కరేడుకు రానున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆపార్టీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ.హనుమారెడ్డి, నెల్లూరు జిల్లా సహాయకార్యదర్శి పీ.మాలకొండయ్య తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీ కోసం కరేడులో భూసేకరణకు జరుగుతున్న ప్రయత్నాన్ని రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టిన నేపథ్యంలో రైతులకు మద్దతుగా వారితో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకునేందుకు రామకృష్ణ వస్తున్నట్లు తెలిపారు. 8,400 ఎకరాల్లో మూడు పంటలు పండుతూ కరేడు చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ అన్నం పెడుతున్న భూములను ఇండోసోల్ కంపెనీకి అప్పగించాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో రైతులపక్షాన సీపీఐ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. సబ్ కలెక్టరు, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు సమక్షంలో ఇండోసోల్ వద్దు మా భూములే మాకు ముద్దు అంటూ గ్రామస్థులు ఏకాభిప్రాయంతో నినాదాలు చేయటమే గాక మా భూములు ఇచ్చే ప్రశ్నేలేదని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకుండా నిమ్మకునీరెత్తినట్లు ఉండటం శోచనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కరేడులో పర్యటనకు రైతులంతా అందుబాటులో ఉండాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, వీ.తిరుపతిరావు పాల్గొన్నారు.

కావలిలో సుపరిపాలనలో తొలి అడుగు



సుపరిపాలన కరపత్రాలు అందచేస్తున్న టీడీపీ నేతలు

కావలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ క్లస్టర్, 33వ వార్డులోని 65, 66 బూత్‌లలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కో ఇన్‌చార్జి తిరువీధి ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి జ్వాలా సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరిల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్య్రమంలో బూత్‌కన్వీనర్లు పట్నం శివ, కంచర్ల కల్యాణచక్రవర్తి, గట్టం శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, పానుగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ దినోత్సవం



ఉలవపాడు : కరేడులో పీఎం మోదీ, సీఎం బాబు, మంద కృష్ణ ఫొటోలకు పాలభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బిట్రగుంట : వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత గోవిందరాజులు

ఉలవపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని దళితవాడల్లో ఎమ్మార్పీఎస్ శ్రేణులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కరేడు, ఉలవపాడు, మన్నేటికోట, భీమవరం, చాకిచర్ల గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ఉలవపాడు ప్రధాన రహదారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు, శ్రేణులు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కరేడులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మందకృష్ణ ఫొటోలకు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం నవీన్, కరేటి గోపాల్, సత్యం, శ్రీనివాసులు, గోపాల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి 31 ఏళ్ల పూర్తిన రోజు కావడం, మాదిగ హక్కులను కాపాడేందుకు నడుం బిగించిన మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు కావడం ఆనందదాయకమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. బోగోలు మండలం బేతనీపేట క్రీడామైదానంలో జెండా ఆవిష్కరణ బోగోలు టౌన్ ఎమ్మార్పీఎస్ నేతలు శ్యాంసుందర్, ఫిలోమెన్‌రాజ్, మర్లపాటిబాబుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు టీ.ఇజ్రాయేల్, పీ.గోవిందరాజులు, సీహెచ్.రవి, జీ.సంజయ్, రాజన్న, శంకర్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

దగదర్తిలో మండే మార్కెట్



కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతున్న మహిళా రైతులు

దగదర్తి(బిట్రగుంట) జూలై 7(ఆంధ్రజ్యోతి): దగదర్తి ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులో పండించిన ఆకుకూరలు, కూరగాయల విక్రయానికి మండే మార్కెట్ సోమవారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు పండించిన వాటిని కొనుగోలు చేసేందుకు గ్రామస్థులే కాకుండా పలువురు ఉద్యోగులు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా మోడల్ మండల టీం లీడర్ హరిచందన మాట్లాడుతూ ఎటువంటి కెమికల్, పురుగు మందులు వాడకుండా ప్రకృతి ఎరువులతో పండించినవి తినడం ఆరోగ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సభ్యులు, పలుగ్రామాలకు చెందిన మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘కరేడు’ జోలికొస్తే కూటమి కూలడం ఖాయం

- రైతుల తరపున ఐలూ న్యాయపోరాటం
- అమరావతి రైతులతో పెట్టుకొన్న వైసీపీ గతే కూటమి ప్రభుత్వానికి పడుతుంది
- కరేడు గ్రామ రైతులకు అండగా హైకోర్టున్యాయవాదులు
- ప్రజల పక్షాలన న్యాయపోరాటానికి సిద్ధం
- ఐలూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్

విజయవాడ లీగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కరేడు జోలికొస్తే కూటమి ప్రభుత్వం కూలిపోతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రైతుల పక్షాన తాము న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. కరేడు గ్రామంలోని రైతుల భూములలో దాగి ఉన్న ఖనిజ సంపద దోచుకొనేందుకే ప్రభుత్వం వేలాది ఎకరాలు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు సిద్ధంగా వుందన్న అనుమానంగా వుందని ఐలూ న్యాయవాదులు కూడా మండిపడుతున్నారు. ఆదివారం విజయవాడ, గుంటూరు, నెల్లూరుకు చెందిన దాదాపు 25 మంది ఐలూ న్యాయవాదుల బృందం కరేడు గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడింది. సోమవారం విజయవాడలో ఐలూ న్యాయవాదులు 'ఆంధ్ర జ్యోతి' తో మాట్లాడారు. తదనంతర పరిణామాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం కరేడు గ్రామంలోని దాదాపు 8,348 ఎకరాలు ప్రభుత్వం ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని, ఇదే జరిగితే అమరావతి రైతులతో పెట్టుకొన్న వైసీపీకి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని అన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బంజరు, బీడు భూములనేకం వుండగా ఏడాదికి మూడు పంటలు పండే సశ్యశ్యామలమైన కరేడు గ్రామంలోని భూములను ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టడం వెనుక భూములలో వుండే ఖనిజ సంపద దోచుకొనేందుకా అన్న అనుమానం కలుగుతోందన్నారు. ప్రజల పక్షాన ఐలూ న్యాయవాదులు నిలబడి న్యాయపోరాటం చేసేందుకు కూడా సిద్ధంగా వున్నట్లు సుంకర తెలిపారు. ఐలూ న్యాయవాదులు సంపర దుర్గా శ్రీనివాసరావు, బొమ్మసాని రవి. ఆలూరి సుధాకరరావు, సప్పా రమేష్‌కుమార్, సీవీ సుబ్రమణ్యేశ్వరరావు, వడ్లమూడి



కరేడు రైతులతో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు (ఫైల్)

రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ, రైతులు, తమతో మాట్లాడుతూ చావనైనా చస్తాం కానీ తమ భూముల్ని ప్రభుత్వానికి అప్పగించేది లేదని తేల్చిచెప్పారని తెలిపారు. కరేడు ప్రాంతంలో సశ్యశ్యామలమైన మూడు పంటలు అందించే భూములున్నాయన్నారు. కరేడు గ్రామంలోని రైతులకు మూడు పంటలిచ్చే భూములే కావలనడం వెనుక ఏదో అంతరార్థం దాగి వున్నట్లు అనుమానంగా వుందన్నారు. తమ భూముల్లో ఖనిజ సంపద నిక్షిప్తమై వుందని, దానిని కొల్లగొట్టేందుకే ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు సిద్ధమైందనే అనుమానాలు తలెత్తుతున్నాయని రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇండోసోల్ సోలార్ కంపెనీకి తమ భూముల్ని కట్టబెట్టేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీ చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీకి భూమిని కేటాయించగా అప్పటి ప్రతిపక్షంలో వున్న ఇప్పటి పాలకపక్షం ఆ సంస్థ అప్పటి సీఎం జగన్ బినామీ సంస్థ అని, అది ఒక సూట్‌కేసు కంపెనీ అని దానిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని అప్పట్లో ప్రకటించిందని , కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం కంటే ఎక్కువగా కరేడు గ్రామ భూములను గుర్తించి వాటిని ఇండోసోల్ కంపెనీకి దారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని రైతులు తమకు తెలిపారన్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదన విరమించేంత వరకు తమ పోరాటం ఆగదని రైతులు చెబుతున్నారని, వారికి మద్దతుగా తాము కూడా వారి పక్షాన నిలబడి వారికి ఉచితంగా న్యాయసహాయం అందించేందుకు కూడా సిద్ధంగా వున్నట్లు ఐలూ న్యాయవాదులు చెప్పారు. రైతులను హింసించిన ప్రభుత్వం బాగున్నట్లు చరిత్రలో లేదని, అమరావతి రైతుల ఉసురు పోసుకున్న గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని న్యాయవాదులు మండిపడ్డారు. సామాజిక సమస్యలపై పోరాటాలు చేస్తూ సమాజంలో అట్టడుగు వర్గాలు, మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి వారి గొంతుకై ఐలూ ప్రశ్నిస్తుందని, వారికి అండగా ఉంటామని న్యాయవాదులు చెప్పారు.

గంధోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



దర్గా ప్రాంగణంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● డ్రోన్ కెమెరాల నిఘా నీడలో దర్గా : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూలై 7 (ఆంధ్రజ్యోతి): రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధ మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఆయన సోమవారం బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల నిఘా నీడలో బారాషాహీద్ దర్గా ప్రాంగణం, పరిసరాలు ఉన్నాయన్నారు. దర్గాలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానంగా చేసిన డ్రోన్, పీటీజెడ్, సీసీటీవీ ఫుటేజ్‌లను నిరంతరం పరిశీలిస్తూ బందోబస్తులో ఉన్న సిబ్బందికి సూచనలు ఇస్తున్నామని తెలిపారు. రెండోరోజు 31 మంది తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చామని, డాగ్‌స్క్వాడ్, బీడీ టీమ్‌లతో నిరంతరం తనిఖీలు చేస్తున్నామన్నారు. సుమారు 3500 యాత్రికుల వాహనాలను ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ చేసుకునేట్లు చర్యలు చేపట్టామని ఎస్పీ వివరించారు.

సంతానం రొట్టె వదిలాం



కొన్నేళ్లుగా రొట్టెల పండుగకు వస్తున్నాం. గత ఏడాది సంతానం కలగాలని నా భార్య రొట్టె పట్టుకుంది. సంతానం కలగడంతో ఈ ఏడాది సంతానం రొట్టె విడిచి పెట్టాం. గతంతో పోల్చుకుంటే రొట్టెల పండుగలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి.

- జీ రవి, తిరుపతి

పదేళ్లుగా వస్తున్నాం



పదేళ్లుగా కుటుంబమంతా రొట్టెల పండుగకు వస్తున్నాం. మనసులో బలంగా కోర్కెలు కోరుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకుంటే మా కోర్కెలు నెరవేరుతున్నాయి. గత ఏడాది మేము కోరుకున్న కోరిక నెరవేరడంతో ఈ ఏడాది అందరం మళ్లీ వచ్చాం.

- ముజాహిద్, హైదరాబాద్

వ్యాపార రొట్టె పట్టుకున్నా..



నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ గురించి బంధువులు ఎంతో గొప్పగా చెప్పడం విన్నా. అందుకే ఈ ఏడాది వారితో కలిసి వచ్చా. ఇక్కడకు వచ్చిన తర్వాత వేలాది మంది భక్తుల నమ్మకం చూశాక రొట్టెల పండుగకు ఉన్న ప్రాధాన్యత అర్థమైంది.

- వశీమ్, నాగపూర్

ఆర్థికంగా స్థిరపడాలని కోరుకున్నా...



రొట్టెల పండుగ గురించి ఎన్నోఏళ్లుగా చుట్టుపక్కల వారు, బంధువులు చెబుతుంటే వింటున్నా. కొంతకాలంగా మా కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. అప్పులు తీసుకున్న వారు తిరిగి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ క్రమంలో రొట్టెల పండుగకు వెళ్లమని కొందరు సూచించడంతో వచ్చాం. మా ఆర్థిక ఇబ్బందులు తీరాలని రొట్టె పట్టుకున్నా.

- రామలక్ష్మమ్మ, కడప

హలో.. హలో.. నో సిగ్నల్స్ !

● దర్గా ప్రాంగణంలో సెల్‌ఫోన్లు పనిచేయక భక్తుల ఇక్కట్లు

హలో... హలో... ఎక్కడున్నారు....? ప్చ్.. నో.. సిగ్నల్స్.. ఈ సమస్య బారా షహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చిన ప్రతి భక్తుడిని వెంటాడుతోంది. రొట్టెల పండుగలో పాల్గొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు.సెల్ టవర్ల సామర్థ్యం సరిపోకపోవడంతో ఫోన్లకు సిగ్నల్స్ రావడంలేదు. దీంతో ఫోన్లు మాట్లాడుకోలేక, వాట్సాప్‌ల ద్వారా సందేశాలు పంపుకోలేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పండుగ పూర్తయ్యే వరకు సెల్‌టవర్ల సామర్థ్యం పెంచాలని భక్తులు కోరుతున్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)



కసుమూరులో భక్తుల రద్దీ



వెంకటాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బారాషాహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గా సోమవారం భక్తులతో కిక్కిరిసిపోతోంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో సోమవారం భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామంలోని ప్రధాన మార్గం రద్దీగా మారింది. భక్తులు మస్తాన్ వలీ దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. మొక్కులు తీర్చుకుని స్వామికి తలనీలాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు దర్గా ఆవరణతో పాటు చందన్ మహాల్, కొండపై దర్గాల వద్ద, చెట్ల కింద సేద తీరారు. షాపాబావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కసుమూరు ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ సంస్థ నెల్లూరు నుంచి కసుమూరు వరకు నడుపుతున్న ప్రత్యేక బస్సులను సోమవారం కూడా కొనసాగించారు. వక్ఫ్ బోర్డు అధికారులు పలుచోట్ల తాగునీటి చలివేంద్రాలు, షామియాలు, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.



భూసమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ కార్తీక్

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 127 వినతులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 7(ఆంధ్ర జ్యోతి): భూ సమస్యలను ప్రత్యేకశ్రద్ధతో పరిష్కరించాలని జేసీ కే కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేసీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారులకు వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 127 వినతులు అందగా, వాటిలో 120 రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయి.

● ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి

చేజర్ల మండలం మడపల్లికి చెందిన వసంతమ్మ భూమిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి నాయకులు సోమవారం జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న వసంతమ్మ భూమిని ఇసుక మాఫియా ధ్వంసం చేసిందని ఆరోపించారు. ఆ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్లర మస్తానయ్య, లింగంగుంట శ్రీనివాసులు, కోవూరు దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 47 ఫిర్యాదులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

నెల్లూరు(క్రైం), జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 47 మంది తరలివచ్చి ఫిర్యాదులు అందించారు. కావలి డీఎస్పీ శ్రీధర్, డీటీసీ సీఐ నాగేశ్వరమ్మ, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు.

చంపేస్తామంటున్నారు.. కాపాడండి !

నెల్లూరు (లీగల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయమై గొడవపడి కొంతమంది తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని నగరంలోని బాలాజీనగర్ పరిధి పద్మావతి నగర్‌కి చెందిన అయితా సురేష్ ఎస్పీని కోరారు. సోమవారం జరిగిన పోలీసు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం ఇచ్చారు. బాధితుడి కథనం మేరకు... గత నెల 19న దగదర్తి మండలం దామవరంలోని తన తండ్రికి చెందిన పొలంలో రెవెన్యూ అధికారులు విమానాశ్రయం కోసం సర్వే చేస్తున్నారని తెలిసి తాను అక్కడికి వెళ్లానన్నారు. అక్కడ కొండ్రగుంట శ్రీనివాసులు, రామస్వామి ఇరవైమంది మనుషులను తీసుకువచ్చి పొలం విషయమై గొడవపడి, చంపివేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. ఈ విషయమై అదే రోజు దగదర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. అయితే వారు ఎలాంటి చర్య తీసుకోలేదని, తమపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని చెప్పారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదును కావలి రూరల్ సర్కిల్‌కి పంపుతూ ఎస్పీ కార్యాలయం ఉత్తర్వు చేసింది.

రెండు కార్లు ఢీకొని ఒకరి మృతి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొని ఓ వ్యక్తిపైకి దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని నందిపాడు సెంటర్ లో 565 జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు(54) ఉదయగిరికి వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డు మార్జిన్‌లో వేచి ఉన్నాడు. ఈ తరుణంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి తిరుపతికి వెళుతున్న కారు నందిపాడు సెంటర్ వద్దకు రాగానే ఉదయగిరి నుంచి సంగంకు వెళుతున్న కారును ఢీకొట్టి రోడ్డుపక్కన ఉన్న వెంకటేశ్వర్లపైకి దూసుకెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కారు రోడ్డుపక్కనే ఉన్న గృహాలపైకి దూసుకెళ్లింది. ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పూరిల్లు దగ్ధం

అనంతసాగరం : ఉప్పలపాడులో సోమవారం ఉదయం తారాజువ్వ పడి పూరిల్లు దగ్ధమైంది.

ఎక్కడివారు అక్కడే!

● బదిలీల రద్దుపై సచివాలయ ఏఎన్ఎంల ఆందోళన ● మూడురోజులపాటు అధికారుల కౌన్సెలింగ్ ● అవకతవకలు జరిగాయని ఆరోపణలు ● మరోసారి నిర్వహణకు కమిషనర్ ఆదేశం

నెల్లూరు (వైద్యం) జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సచివాలయాల ఏఎన్ఎంల బదిలీలను రద్దు చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నుంచి మరోసారి కౌన్సెలింగ్ జరగకుండా ఉత్తర్వులు తెచ్చుకోమని, ఇందుకు రెండు రోజులు గడువు ఇస్తున్నానని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మరోసారి కౌన్సెలింగ్ తప్పదని స్పష్టం చేశారు. దీంతో ఏఎన్ఎంలు ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

● అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్

జిల్లాలోని సచివాలయాల్లో 459 మంది ఏఎన్ఎంలకు ఈనెల 2 నుంచి 4 వరకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఈ ప్రక్రియను నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రులు ఈ కౌన్సెలింగ్ ఏమిటంటూ ఏఎన్ఎంలు అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే వ్యవహారంలో అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముడుపులు ఇచ్చిన వారు తాము కోరుకున్న స్థానాల్లోనే ఉండిపోయారు.

● కౌన్సెలింగ్ రద్దుకు వీరే కారణమా...?

ఈ కౌన్సెలింగ్ రద్దుకు ఫిబ్రవరిలో జరిగిన సచివాయం ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులే కారణమని తెలుస్తోంది. అప్పట్లో సచివాయం ఏఎన్ఎంలు గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2గా 289 మంది పదోన్నతులు పొందారు. వీరిని సచివాలయం నుంచి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలకు మార్చారు. ఉద్యోన్నతులు పొందిన సచివాలయం ఏఎన్ఎంలు ఆయా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లలేదు. అయితే వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఈ సచివాలయాల ఖాళీలను కూడా చూపించారు. దీనిపై కమిషనర్‌ను కలిసిన ఉద్యోన్నతి పొందిన ఏఎన్ఎంలు తమకు ఉద్యోన్నతి వచ్చినా సచివాలయం నుంచి రిలీవ్ చేస్తున్నట్లు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, అందుకే పీహెచ్‌సీలకు వెళ్లటం లేదన్నారు. స్పందించిన కమిషనర్ జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చారు.

మరోసారి కౌన్సెలింగ్

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సచివాయం ఏఎన్ఎంలకు మరోసారి బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుంది. తమకు అన్యాయం జరిగిందని ఏఎన్ఎంలు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు తెచ్చుకుంటే కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉండదని భావిస్తున్నాం .

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

30శాతం ఐఆర్ ప్రకటించకుంటే ఉద్యమం



కావలి(టౌన్), జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించకపోతే ఉద్యమం తప్పదని ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్టీయు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమాల పుట్టినిల్లు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ముందుండి ఉద్యమాలు నడిపించిన ఘనత ఎస్టీయుకే దక్కుతుందన్నారు. గతంలో ప్రభుత్వాలపై పోరాడి సాధించుకున్న ప్రయోజనాలను నేటి ప్రభుత్వం తూట్లు పొడిచేలా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీ రమణారెడ్డి మాట్లాడుతూ 11వ పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నప్పటికీ నేటికీ పీఆర్సీ కమిషన్ నియమించకపోవడం మధ్యంతర భృతి ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలు వెంటనే ప్రకటించాలని 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండివైఖరి వీడకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సివస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శనరావు, మాల్యాద్రి, కె రాజ్‌కుమార్, రాజు, సురేష్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పెంచాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న డీఆర్వో, డీఈవో తదితరులు

నెల్లూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇన్‌చార్జి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ అన్నారు. డీ ఆర్వో చాంబర్‌లో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యపై ఆసక్తి ఉన్న ఉద్యోగులు, గృహిణులు, అభ్యాసకులు ఓపెన్‌స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఏపీ సార్వత్రిక విద్యావిధానంలో టెన్త్, ఇంటర్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తున్న తరుణంలో చదువుకోలేని వారు, చదువును మధ్యలో ఆపేసిన వారికి ఇది సువర్ణవకాశమని తెలిపారు. 14 ఏళ్ల వయసు నిండి చదవగలిగి, రాయగలిగిన వారంతా కూడా ఇందుకు అర్హులేనని చెప్పారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు, ఇతర స్వచ్ఛంద సంస్థలు వారు కలిసి ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్‌లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దరఖాస్తులు ఏపీఓపెన్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ వెబ్‌సైట్‌లో చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని విద్యాశాఖ కార్యాలయాలు, పాఠశాలల్లో సంప్రదించాలన్నారు. అనంతరం ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్

● అందరూ పాల్గొని విజయవంతం చేయాలి

● కలెక్టర్ ఆనంద్ పిలుపు

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మీటింగ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ఇప్పటికే ఒకసారి నిర్వహించామని, 10న నిర్వహించబోయేది రెండో మీటింగ్ అని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 3600 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలతోపాటు 143 కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మీటింగ్ రోజున విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనా సామర్థ్యాలను వివరిస్తారని చెప్పారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం తల్లిదండ్రులకు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులతో సోషల్ ఫారెస్ట్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 3.50 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారి ప్రతిభా సామర్థ్యాలను మెరుగు పరచడమే లక్ష్యంగా మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో బాలాజీరావు, ఎస్ఎస్ఏ ఏపీడీ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

వీఎస్‌యూ లేటరల్ ఎంట్రీ నోటిఫికేషన్ విడుదల

వెంకటాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ లేటరల్ ఎంట్రీ ద్వారా పీజీ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. డిగ్రీ నాలుగు సంవత్సరాల ఆనర్స్ విత్ రీసెర్చ్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఈ లేటరల్ ఎంట్రీకి అర్హులని వర్సిటీ డీఓఏ డైరెక్టర్ ఎం హనుమారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జూలై 7 నుంచి జూలై 21వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈ కోర్సుల్లో చేరిన అర్హత గల విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. లేనిపక్షంలో యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగంలో సంప్రదించాలన్నారు.

ఏసీబీ రహస్య విచారణ?


● అధికారులు, సిబ్బందిలో అలజడి

ఉదయగిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోమవారం ఏసీబీ అధికారులు సాధారణ వ్యక్తుల వేషధారణలో రహస్య విచారణ చేపట్టి నట్లు తెలిసింది. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దకు వాహనంలో అధికారులు వచ్చారు. అనంతరం తహసీల్దారు, సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, పోలీస్ స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చిన వారితో సాధారణ వ్యక్తుల్లా మాట్లాడుతూ ఇక్కడ అధికారులు, సిబ్బంది పని తీరు ఎలా ఉంది.. సమస్యలు పరిష్కరిస్తున్నారా.. ఏమైనా ఇబ్బందులకు గురిచేస్తున్నారా... తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఏసీబీ అధికారులు వచ్చి కార్యాలయాల ఆవరణలో సంచరిస్తున్నారనే విషయం అధికారులు, సిబ్బందికి తెలియడంతో వారిలో అలజడి నెలకొంది. ఏసీబీ అధికారులు కొన్ని గంటలపాటు కార్యాలయాల ఆవరణలోనే వివిధ విషయాలపై ఆరా తీసి వెళ్లి నట్లు సమాచారం.

నెలాఖరులోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

● పనిచేసే వారికే పదవులిస్తాం..

● నెల్లూరు నగర కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేష్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోపు మార్కెట్, ఆలయ కమిటీల వంటి నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. పార్టీలో పనిచేసే వారికే పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాజీ పడేది లేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు పర్యటనకు విచ్చేసిన ఆయన నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో సిటీ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముందుగా ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో మాదిరిగా మరోసారి నష్టపోవడానికి సిద్ధంగా లేమని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కేడర్ మొత్తం ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. 'చంద్రబాబు కూడా చెబితే వింటారు. నాలుగోసారి సీఎం అయినా ఆయన వినడానికి సిద్ధంగా ఉన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకే పదవుల భర్తీ జరుగుతుంది. కుటుంబం అన్నాక అనేక సమస్యలుంటాయి. కలిసి కూర్చొని వాటిని పరిష్కరించుకుందాం. నాలుగు గోడల మధ్య సమస్యలు చర్చిద్దాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పోరాడుదాం. చంద్రబాబు కూడా నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు కార్యకర్తలను కలుస్తున్నారు. నిరంతరం కేడర్ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాం' అని లోకేష్ వ్యాఖ్యానించారు. మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ యువ కార్యకర్తలకు అభివాదం చేస్తూ..

● ఉపాధ్యాయుల కొరత తీర్చండి

నెల్లూరు(సిటీ) జూలై 7,(ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ధనరాజు, వీరభద్రుడు, రవికుమార్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వారు వినతిపత్రం అందచేశారు.